www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
21-08-2024
సంపుటి : 01 । సంచిక : 109 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




దేశానికి టెక్నాలజీని పరిచయం చేసిన

# ఘనత రాజీవ్‌గాంధీదే

**పంచాయతీ రాజ్ వ్యవస్థలు ఆయన హయాంలోనే బలోపేతం**

**విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు**

**రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి**




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** హైద-రాబాద్: దేశంలో విప్లవాత్మక మార్పులకు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ శ్రీకారం చుట్టారని ము-ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు. పంజాగుట్టలోని రాజీవ్ విగ్రహానికి పూలమాల-లు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ..దేశానికి టె-క్నాలజీని పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలు ఆయన హయాంలోనే బలోపేతం అయ్యాయని తెలిపారు.

**భారాస నేతలపైమండిపడ్డ సీఎం రేవంత్**

అధికారం పోయినా.. వారికి అహంకారం తగ్గలేదని మిగతా2లో...

# త్వరలోనే భూముల ధరలు పెంపు!

- థర్డ్ పార్టీతో క్షేత్ర స్థాయిలో అధ్యయనం
- నివేదిక అందగానే ప్రభుత్వ నిర్ణయం


2



దేశవ్యాప్తంగా సంచనలం సృష్టిస్తోన్న 31 ఏళ్ల ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. కేసును సిమోటోగా తీసుకుని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా జూనియర్, సీనియర్ డాక్టర్ల భద్రతపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది భద్రతకై తీసుకోవాల్సిన చర్యలను ప్రతిపాదించింది.మరోవైపు సుప్రీంకోర్టు డాక్టర్ల భద్రత గురించి ఓ జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. మెడికల్ ప్రొఫెషనల్స్ ఎవరైనా సరే.. వారికి సామాజిక భద్రత కల్పించడమే ఉద్దేశంగా ఇది పనిచేస్తుంది. టాస్క్‌ఫోర్స్ బృందంలోని సభ్యుల పేర్లను కూడా సుప్రీం వెల్లడించింది.దీనిలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి కూడా సభ్యులుగా ఉన్నారు. దేశంలో వైద్యుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసి రెండు నెలల్లో నివేదికను ఇవ్వాలని టాస్క్ ఫోర్స్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## వైద్యుల భద్రతకై



# జాతీయ టాస్క్ ఫోర్స్

**కోల్‌కతా హత్యాచారం నేపథ్యంలో కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన**

ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది భద్రతకై తీసుకోవాల్సిన


చర్యలను ప్రతిపాదించిన అత్యున్నత న్యాయస్థానం

నేషనల్ టాస్క్ ఫోర్స్ పదిమంది సభ్యుల్లో ఒకరిగా డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి చోటు

9


## డాక్టర్ల భద్రతపై నేషనల్ టాస్క్‌ఫోర్స్

- కోల్‌కతా హత్యాచారం నేపథ్యంలో కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన
- పదిమంది సభ్యుల్లో ఒకరిగా డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి చోటు


2

## బంపర్ ఆఫర్

- ఆర్టీసీ బస్సులో పుట్టిన ఆ చిన్నారికి
- జీవితకాల ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పురుడు పోసిన నర్సుకు డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లో ఏడాది పాటు ఉచితంగా ప్రయాణించే బస్‌పాస్
- మహిళా కండక్టర్ కు నగదు బహుమతి
- ప్రకటించిన టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం


2

## ఏపీలో నూతన విద్యుత్ విధానం

- పర్యావరణ హితంగా, తక్కువ ఖర్చుతో
- విద్యుత్ ఉత్పత్తి సాధించేలా పాలసీ రూపకల్పన
- ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు తీసుకుకోవాల్సిన చర్యలపైనా చర్చ
- ఇంధన పాలసీపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష


2

## లెక్కలు కాదు ఆత్మ ఉండాలి



- వ్యవసాయ రంగం రాష్ట్రానికి వెన్నెముక
- రుణాల మాఫీలో వారం ఆలస్యమైనా ఫలితం ఉండదు
- బ్యాంకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2



కరోనా సృష్టించిన కలవరాన్ని మర్చిపోతున్న తరుణంలో తాజాగా ఎంపాక్స్ కలకలం రేపుతోంది. ఎంపాక్స్ కొవిడ్ కాదని, దాని వ్యాప్తిని నియంత్రించొచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.ఇదిలా ఉంటే.. మంకీపాక్స్ పై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలకు కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. బంగ్లాదేశ్, పాకిస్థాన్ సరిహద్దుల్లోని నౌకాశ్రయాల దగ్గర కూడా నిఘా పెంచాలని, మంకీపాక్స్ లక్షణాలు ఉన్న వారెవరైనా కనిపిస్తే వెంటనే తెలపాలని పేర్కొంది.రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మంకీపాక్స్ నోడల్ కేంద్రాలుగా తమ పరిధిలోని కొన్ని ఆసుపత్రులను గుర్తించాలని పేర్కొంది.కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫీవర్ హాస్పిటల్ ఆవరణలోని సర్ రోనాల్డ్ రోస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ అండ్ కమ్యూనికబుల్ డిసీజెస్ ఆధ్వర్యంలో ఫీవర్ హాస్పిటల్ లో మంకీ పాక్స్ రోగుల కోసం సిద్ధం చేస్తున్న బెడ్లు - విశ్వంబర్ హైదరాబాద్

## రేవంత్.. నా మాట గుర్తు పెట్టుకో!

- అధికారంలోకి రాగానే సెక్రటేరియట్ చుట్టూ చెత్తను తొలగిస్తాం
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2



జీహెచ్ఎంసీకి పూర్తిస్థాయి

## కమిషనర్‌గా ఆమ్రపాలి

- రాష్ట్రంలో ఆరుగురు ఐఏఎస్‌ల బదిలీలు
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్


2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 107 | ₹ 129 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 187 | ₹ 213 |

## తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచాలి

**స్థిరాస్తి వ్యాపారులకు ప్రభుత్వ సహకారం**

గతంలో యువరాజు ప్రభుత్వం

క్రెడాయ్ సదస్సులో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్


2

# మహా నగరం.. అతలా కుతలం

**భారీ వర్షంతో నగరంలో ట్రాఫిక్ జామ్**

- కూలిన ఎల్బీ స్టేడియం ప్రహరీ గోడ
- పోలీసు వాహనాలు ధ్వంసం
- పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ ఆమ్రపాలి
- హుస్సేన్ సాగర్ నుంచి నీటి విడుదల
- 238 స్టాటిస్టిక్ టీమ్ లు, మరో 154 ఎమర్జెన్సీ బృందాలు సిద్ధం
- కమాండ్ కంట్రోల్‌ను సందర్శించిన డిప్యూటీ మేయర్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్‌లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు కురిసిన భారీ వర్షానికి నగరం అతలా-కుతలమైంది. రోడ్లన్నీ జలమయమయ్యా-యి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. మ్యాన్‌హోళ్లు, నాలాలు పొంగిపొర్లాయి. భారీ వర్షానికి ట్రాఫిక్ స్తంభించిపోయింది. రాంనగర్‌లో మిగతా8లో...



# త్వరలోనే భూముల ధరలు పెంపు!

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** రాష్టంలో భూముల ధరలు మళ్లీ పెరగనున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని భూముల మార్కెట్ విలువలను రెండుసార్లు సవరించింది. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు మరోసారి వాటిని సవరించి పెంచబోతోంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ జరిగాయి. ప్రస్తుతం ఈ నిర్ణయంపై ఒక థర్డ్ పార్టీ ప్రైవేటు ఏజెన్సీతో రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేయిస్తోంది. తెలంగాణలోని వివిధ ప్రాంతాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ధరలకు, క్షేత్ర స్థాయిలోని వాస్తవిక రేట్లకు పొంతన ఉందా ? లేదా ? అనేది తెలుసుకునేందుకు ఈ అధ్యయనం చేయిస్తున్నారు. దీని నివేదిక రాగానే రాష్ట్రంలో భూముల ధరల పెంపై కాంగ్రెస్ సర్కారు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వాస్తవానికి ఆగస్టు 1వ తేదీ నుంచే తెలంగాణలో భూముల ధరలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈమేరకు షెడ్యూల్ కూడా విడుదల చేసింది. అయితే ఆగమేఘాలపై భూముల మార్కెట్ విలువలను పెంచితే ఇబ్బందులు ఎదురయ్యే ముప్పు ఉంటుందని గుర్తించారు. అందుకే థర్డ్ పార్టీ ఏజెన్సీతో దీనిపై అధ్యయనం చేయిస్తున్నారు. రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలపై అధ్యయనం కోసం సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ జూన్‌లోనే ఒక సర్క్యులర్‌ను విడుదల చేశారు. జూన్ 18 నుంచి ఆగస్టు 1 వరకు షెడ్యూల్ ప్రకటించారు. మార్కెట్ విలువల రివిజన్‌పై ఇప్పటికే ప్రజలు, రైతు ప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. వారు చెప్పిన రేట్లను ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువలతో సరిపోల్చుకున్నారు. అయితే ఏ మేరకు పెంచాలన్న దానిపై ప్రభుత్వమే తుదనిర్ణయం తీసుకోనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో భూముల ధరలను పెంచే క్రమంలో అవకతవకలకు పాల్పడిందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఎలాంటి శాస్త్రీయ ప్రమాణాలను అనుసరించకుండా, క్షేత్ర స్థాయి పరిస్థితుల గురించి తెలుసుకోకుండా అప్పట్లో భూముల ధరలను రివైజ్ చేశారని అంటున్నారు. దీనివల్ల రాష్ట్రంలోని కొన్ని ఏరియాల్లో భూములకు డిమాండ్ ఉన్నా రేట్లు తక్కువగా ఉండిపోయాయని చెబుతున్నారు. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భూముల ధరల సవరణపై ఫోకస్ పెట్టింది. మార్కెట్ విలువకు అనుగుణంగా సముచిత స్థాయిలో తెలంగాణ భూముల రేట్లు ఉండాలని సీఎం రేవంత్ సర్కారు భావిస్తోంది.

# జీహెచ్ఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్‌గా ఆమ్రపాలి

**విశ్వంబర హైదరాబాద్:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలో ఉన్నతమైన హోదాల్లో కొనసాగుతున్న మరో ఆరుగురు ఐఏఎస్ అధికారులకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు మంగళవారం సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ కి పూర్తి అదనపు బాధ్యతల కమిషనర్ గా వ్యవహరిస్తున్న అమ్రపాలి హెచ్ఎండిఏ కు జాయింట్ మెట్రో పోల్టన్ కమిషనర్ గా నియమించడంతోపాటు మరో మూడు అదనపు పోస్టుల్లో కొనసాగుతున్న సంగతి తెలిసింది. ఆమెను జీహెచ్ఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్ గా కొనసాగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. జీహెచ్ఎంసీ లో అదనపు కమిషనర్ గా వ్యవహరిస్తున్న శ్రీవత్స కోటను హెచ్ఎండిఏ కు జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ గా నియమించారు. పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న దాణా కిషోర్ కు మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టును కేటాయించారు. హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న సర్ఫరాజ్ అహ్మద్ కు హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ప్రాజెక్టు వేరేది డైరెక్టుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోస్టింగ్ కోసం వెయిటింగ్ లో ఉన్న చాహత్ బాచుపల్లి నువ్వు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా నియమించారు. నారాయణపేట అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ ను హైదరాబాద్ వాటర్ బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా నియమిస్తూ సర్కారు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

### దేశానికి టెక్నాలజీని పరిచయం చేసిన

# ఘనత రాజీవ్‌గాంధీదే

**(మొదటి పేజీ తరువాయి)**

విమర్శించారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని అంటున్నారని.. అనవసర ఆరోపణలు చేస్తే భారాస నేతలను తెలంగాణ సమాజం బహిష్కరిస్తుందని హెచ్చరించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని రాష్ట్రంలో ప్రారంభిస్తామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను యంగ్ ఇండియా రెసిడెన్షియల్ అకాడమీలుగా మారుస్తామని ప్రకటించారు.

# బంపర్ ఆఫర్

**విశ్వంభర, హైదరాబాద్:** రాఖీ పౌర్ణమి రోజున గద్వాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో జన్మించిన చిన్నారికి జీవితకాలం పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించేలా బస్‌పాస్‌ను అందిస్తున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్‌లలో పుట్టిన పిల్లలకు జీవిత కాలపు ఉచిత బస్ పాస్‌ను ఇవ్వాలని గతంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ఆడపిల్లకు పుట్టినరోజు కానుకగా జీవితకాలం ఉచిత బస్ పాస్‌ను మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. కండక్టర్‌తో పాటు గర్భిణీ ప్రసవానికి సాయం చేసిన వనపర్తిలోని మదర్ అండ్ చైల్డ్ ప్రభుత్వ ఆసుపత్రి స్టాఫ్ నర్స్ అలివేలు మంగమ్మకు డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లో ఏడాది పాటు ఉచితంగా ప్రయాణించే బస్‌పాస్‌ను యాజమాన్యం అందించింది. బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణికి కాన్పు చేసి మానవత్వం చాటుకున్న గద్వాల్ డిపోకు చెందిన కండక్టర్ భారతి, డ్రైవర్ అంజిలతో పాటు నర్సు అలివేలు మంగమ్మను హైదరాబాద్ బస్ భవన్‌లో ఇవాళ టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. టీజీఎస్‌ఆర్టీసీ సంస్థ ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ వారిని ఘనంగా సన్మానించి, నగదు బహుమతులు అందజేశారు. అనంతరం డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో ఏడాది పాటు ఫ్రీ ట్రావెల్ బస్ పాస్‌ను నర్సు అలివేలు మంగమ్మకు, చిన్నారి జీవితకాలం ఉచిత బస్ పాస్‌ను గద్వాల డిపో మేనేజర్ మురళీకృష్ణకు అందజేశారు. గద్వాల-వనపర్తి రూట్ పల్లె వెలుగు బస్సులో రాఖీ పండుగ రోజున సంధ్య అనే గర్భిణి రక్షాబంధన్ సందర్భంగా తన సోదరులకు రాఖీ కట్టేందుకు వనపర్తికి వెళ్లారు. ఈ క్రమంలోనే బస్సు నాచహల్లి సమీపంలోకి రాగానే గర్భిణికి ఒక్కసారిగా పురిటినొప్పులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన మహిళా కండక్టర్ జి.భారతి బస్సును ఆపించారు. అదే బస్సులో ప్రయాణిస్తోన్న నర్సు అలివేలు మంగమ్మ సాయంతో గర్భిణికి పురుడు పోశారు. అనంతరం 108 సాయంతో తల్లీబిడ్డను స్థానిక ఆస్పత్రికి తరలించారు.



# లెక్కలు కాదు ఆత్మ ఉండాలి

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :**

బ్యాంకు అధికారులకు రైతుల రుణాల పట్ల లెక్కలు కాదు ఆత్మ ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పటి వరకు రూ. 17,300 వేల కోట్లు బ్యాంకులకు అందించామని.. రైతులకు మాత్రం నేటి వరకు రూ. 7,500 కోట్లు మాత్రమే చేరాయని అన్నారు. ప్రజా భవన్‌లో మంగళవారం జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేశారు. రుణాల మాఫీలో వారం ఆలస్యమైనా ఫలితం ఉండదని వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతాలను వేగంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వ్యవసాయ రంగం రాష్ట్రానికి వెన్నెముకగా భావిస్తామన్నారు. రుణమాఫీ, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం, భారీ మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయిస్తున్నామని భట్టి తెలిపారు. ఉచితంగా 24 గంటల విద్యుత్తును అందిస్తున్నామన్నారు. రెండు లక్షల రుణమాఫీ ద్వారా రైతులను రుణ విముక్తులను చేస్తున్నామని.. ఇది వ్యవసాయం అనుబంధ రంగాలను బలోపేతం చేస్తాయని చెప్పుకొచ్చారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా పరిగణిస్తుందన్నారు భట్టి విక్రమార్క. ఇన్నోవేటివ్ పాలసీలతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అమెరికా, కొరియా దేశాల్లో పర్యటించి రూ. 36 వేల కోట్ల విలువైన ఎంఓఏలు కుదుర్చుకున్నారని డిప్యూటీ సీఎం వెల్లడించారు. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి కలుగుతుందని.. వారికి విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని బ్యాంకర్లను కోరారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాలకు లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు రూపంలో



ఇవ్వనున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. వారికి సహకరించి పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడాలని బ్యాంకర్లకు సూచించారు భట్టి. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి క్వార్టర్‌లో ప్రాధాన్యతా రంగాల అడ్వాన్సుల విషయంలో వివిధ విభాగాల్లో బ్యాంకులు సానుకూల పనితీరును కనబరిచినందుకు సంతోషిస్తున్నానని అన్నారు. మొదటి క్వార్టర్‌లోనే ప్రాథమిక రంగం కింద బ్యాంకులు ఇప్పటివరకు 40.62% వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా లక్ష్యాన్ని సాధించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రం నగదు నిల్వల నిష్పత్తి మొదటి క్వార్టర్‌లో 127. 29 శాతానికి మెరుగుపడడం మరో ఆసక్తికరమైన అంశం అని అన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని.. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ ముందంజలో ఉండేలా తమ ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఉపముఖ్యమంత్రి చెప్పారు. వరి ఉత్పత్తిలో పెరుగుదల అంశం.. ఎఫ్‌సీఐకి వరిని సరఫరా చేసే రాష్ట్రాల్లో ప్రధాన రాష్ట్రంగా ఎదగడానికి వీలు కల్పిస్తుందన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగుకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. రాబోయే త్రైమాసికంలో నిర్దేశించిన రుణ ప్రణాళికను అధిగమించేందుకు బ్యాంకర్లు కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు భట్టి పేర్కొన్నారు.


**బ్యాంకర్లది కీలకపాత్ర: మంత్రి తుమ్మల**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బ్యాంకర్లది కీలకపాత్ర అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుల ఖాతాల్లో తప్పులు సరిదిద్ది వారికి లబ్ధి చేకూరేలా చేయాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని ఆయన చెప్పారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి తుమ్మల పాల్గొన్నారు .ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ..ఈ ఏడాది దేవుడి దయతో వర్షాలు పుష్కలంగా పడుతున్నాయని మంత్రి తుమ్మల అన్నారు. ఈ సంవత్సరం అధిక విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కష్టకాలంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పథకం కింద రూ.18వేల కోట్లు ఇప్పటికే విడుదల చేసిందని తుమ్మల చెప్పుకొచ్చారు. కొంత మంది రైతులకు ఇంకా మాఫీ కాలేదని, అందుకు రకరకాల కారణాలు ఉన్నాయని చెప్పారు. వాటన్నింటినీ త్వరలోనే పరిష్కరించి రైతులకు తోడుగా నిలవాలని బ్యాంకర్లకు మంత్రి సూచించారు. నగదు జమ కాని రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన పని లేదని మంత్రి చెప్పుకొచ్చారు.

గ్రామస్థాయిలో పని చేసే బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లను రైతుల రుణ ఖాతాల్లో తప్పులు సరిదిద్దేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సిందిగా బ్యాంకర్లను మంత్రి తుమ్మల కోరారు. రుణ మాఫీ చేయడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రుణమాఫీ కార్యక్రమాన్ని సంపూర్ణంగా పూర్తి చేయడానికి సహకారం అందించాలని బాధ్యత బ్యాంకర్ల ఉందన్నారు. అంకెలు చదువుకోవడానికి ప్రతి మూడు నెలలకోసారి మీటింగులు, బ్యాంకర్ల సదస్సు నిర్వహించడంలో అర్థం లేదని తుమ్మల పేర్కొన్నారు. రైతులు, పేదలు, నిమ్నవర్గాల ప్రజలకు పథకాల ద్వారా ఆర్థిక ఫలాలు అందేలా చేయడంలో కీలకంగా వ్యవరించాలని బ్యాంకర్లను మంత్రి తుమ్మల కోరారు.

# డాక్టర్ల భద్రతపై నేషనల్ టాస్క్‌ఫోర్స్

- కోల్‌కతా హత్యాచారం నేపథ్యంలో కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన
- పదిమంది సభ్యుల్లో ఒకరిగా డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి చోటు



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** దేశంలో వైద్యుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసి సిఫారసులు చేసేందుకు నేషనల్ టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. ఈ టాస్క్ ఫోర్స్‌లో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి కూడా సభ్యులుగా ఉంటారని సుప్రీంకోర్టు తెలిపింది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న తెల్లవారుజామున జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు ఇవాళ విచారణ జరిపింది. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

**10 మంది సభ్యులు వీరే**

డాక్టర్ల భద్రతపై ఏర్పాటు చేసిన నేషనల్ టాస్క్‌ఫోర్స్‌కు ఛైర్మన్‌గా వైస్ అడ్మిరల్ డా. ఆర్కే సరైన్ ఉంటారు. హైదరాబాద్‌కు చెందని ప్రఖ్యాత గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణుడు, ఏఐజీ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి ఇందులో సభ్యుడిగా ఉంటారు. ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ డా. ఎం. శ్రీనివాస్, బెంగళూరు నిమ్హాన్స్ వైద్యులు డా. ప్రతిమమూర్తి, డాక్టర్ గోవర్ధన్ దత్తపురి, డాక్టర్ సౌమిత్రారావత్, డాక్టర్ పద్మ శ్రీవాస్తవ ఈ టీంలో సభ్యులుగా పని చేయనున్నారు. ఈ టాస్క్‌ఫోర్స్ సభ్యులంతా కలిసి డాక్టర్ల భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తారు. మూడోవారాల్లోగా మధ్యంతర నివేదిక, 2 నెలల్లో పూర్తి నివేదికను ఇవ్వాలని ఈ టాస్క్‌ఫోర్స్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

**ఇదీ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ప్రస్థానం**

హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) హాస్పిటల్‌ను డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. గ్యాస్ట్రో చికిత్సలో ఆయనకు దేశంలోనే చాలా మంచి పేరుంది. విదేశాల్లో నాగేశ్వర్ రెడ్డికి చాలా పెద్ద ఆఫర్లు వచ్చినా ఆయన వెళ్లలేదు. దేశ ప్రజలకే సేవ చేయాలని నాగేశ్వర్ రెడ్డి నిర్ణయించుకున్నారు. అందుకే ఆయన హైదరాబాద్‌లో తన ఏఐజీ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. విదేశీ వైద్యులు కూడా వచ్చి ఆయన ఆస్పత్రిలో శిక్షణ తీసుకుంటూ ఉంటారు. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి మొదటి నుంచీ సేవాభావం ఎక్కువ. ఆయన చాలా సామాజిక బాధ్యత కలిగిన డాక్టర్. వైద్యరంగంలో రీసెర్చ్ చేయాలనే ఆసక్తి ఆయనకు మొదటి నుంచీ ఉండేది. అందుకే గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో నాగేశ్వర్ రెడ్డి నిష్ణాతుడిగా ఎదిగారు. ప్రపంచస్థాయిలో గుర్తింపును సాధించారు. ''క్యాన్సర్ చికిత్స కోసం ప్రభుత్వాలు చాలా ఖర్చు చేస్తుంటాయి. కానీ దానికి మందును కనిపెట్టడంపై పనిచేయవు. ఇది చాలా బాధాకరమైన అంశం. క్యాన్సర్‌కు వ్యాక్సిన్‌ను కనిపెడితే ఈ భారీ చికిత్స ఖర్చు రోగుల ఫ్యామిలీకి మిగిలిపోతుంది'' అని డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి చెబుతుంటారు. పేదలపై ఆర్థిక భారాన్ని తగ్గించేలా వైద్యరంగంలో ఆవిష్కరణలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన అంటారు. ''మంచి వైద్యం కోసం డబ్బు అవసరం. మంచి డాక్టరుకు ఎక్కువ వేతనం ఇవ్వాలి'' అని డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి అభిప్రాయపడుతుంటారు. ''డాక్టర్లు అంటే బాగా డబ్బులు సంపాదిస్తారని, డబ్బు కోసమే వైద్యం చేస్తారనే భావన ప్రజల్లో ఉంది. అందువల్లే డాక్టర్లపై దాడులు జరుగుతుంటాయి. ఈవిషయంలో మార్పు రావాలంటే డాక్టర్లే చొరవ తీసుకోవాలి '' అని డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి చెబుతుంటారు. ఇలాంటి ఆదర్శవంతమైన ఆలోచనా విధానం ఉంది కాబట్టే డాక్టర్ల భద్రతపై ఏర్పాటు చేసిన నేషనల్ టాస్క్‌ఫోర్స్ కోసం డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి పేరును సుప్రీంకోర్టు సూచించింది.

# తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచాలి

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** స్థిరాస్తి వ్యాపారులకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని, తెలంగాణ అభివృద్ధి, బ్రాండ్ ఇమేజ్ పెంచేలా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో మంగళవారం నిర్వహించిన కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) తెలంగాణ స్టేట్‌కాన్- 2024 ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గతంలో యువరాజు ప్రభుత్వం మాత్రమే ఉండేదన్నారు. మీకు పనులు కావాలంటే ఆ ప్రభుత్వంలో కేవలం ఇద్దరిని మాత్రమే కలిస్తే సరిపోయేదన్నారు. అందులో ఒకరు ఫామ్ హౌస్ లో ఉంటే.. ఇంకొకరు విదేశాల్లో సెల్ఫీలు దిగడం, ఫొటోలకు పోజులు ఇవ్వడం సరిపోయేదని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడు అలా కాదని.. ఎవరైనా ఎప్పుడైనా మీ సమస్యలు తమ దృష్టి కి తీసుకురావొచ్చని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. క్రెడాయ్ సమస్యలు నేరుగా మాకు చెప్పొచ్చన్నారు. గత సర్కారు ఆరు లక్షల కోట్లు అప్పు చేసి వెళ్లిందని.. వేల కోట్ల కాళేశ్వరం కూలి పోయే పరిస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన నాగార్జున సాగర్ చెక్కు చెదరలేదన్నారు. తెలంగాణలో నిర్మాణ రంగం రోజు రోజుకు పెరుగుతోందన్నారు. ఒక్క హైదరాబాద్‌కే కాకుండా ఇది జిల్లాలకు వ్యాప్తి చెందిందన్నారు. ఇవాళ ఓఆర్ఆర్‌కు ఇంత పేరు వచ్చిందంటే దివంగత నేత రాజశేఖర్ రెడ్డి ముందు చూపే కారణమన్నారు. గతంలో చంద్రబాబు డెవలప్మెంట్ ను హైటెక్ సిటీకే పరిమితం చేశారని.. దీన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాజశేఖర్ రెడ్డి మరింత ముందుకు తీసుకెళ్లారన్నారు. ఓఆర్ఆర్ కంటే అద్భుతంగా ట్రిపుల్ ఆర్ టెండర్లు పిలవబోతున్నామని కోమటిరెడ్డి అన్నారు. సిటీ ఒకే వైపు కాకుండా దక్షిణం వైపు కూడా డెవలప్ చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం మరో మైలురాయి వంటిదన్నారు. సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణను ప్రపంచంతో పోటీ పడేలా చేస్తామన్నారు. భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడం సంతోషకరమన్నారు. రాష్ట్రాన్ని మరో స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో పోటీ పడుతుందనే విషయంలో ఎలాంటి సందేహం లేదన్నారు. నగరానికి కృష్ణ, గోదావరి జలాలను తీసుకొచ్చిన ఘనత, మెట్రో నిర్మించిన ఘనత కాంగ్రెసేదేనని ఉత్తమ్ గుర్తు చేశారు. ఇప్పటికే 40 శాతం పట్టణీకర జరిగిపోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాల కల్పనకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందన తెలిపారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్న అధికారంలో ఉన్నా రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గలేదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క తెలంగాణలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోందన్నారు. అందుకు తగిన మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. అత్యధికంగా బిల్డర్స్ , కార్మికులు, ఉన్న అసోసియేషన్ క్రెడాయ్ అని అనిల్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌కు తలమానికంగా ఓఆర్ఆర్ ఉందన్నారు. త్వరలో మూసీ ప్రక్షాళన జరిగితే హైదరాబాద్ బ్రాండ్ మరింత పెరగనుందన్నారు. మూసీ అండ్ ఈసా నదులపై బఫర్ సమస్యలు ఉన్నాయన్నారు. హైడ్రా నేపథ్యంలో అనుమతులకు సంబంధించి ముందు జాగ్రత్త వహించాలన్నారు.

# రేవంత్.. నా మాట గుర్తు పెట్టుకో!

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. చీఫ్ మినిస్టర్ రేవంత్.. నా మాటలు గుర్తు పెట్టుకోవాలంటూ ట్వీట్ చేశారు. అధికారంలోకి వచ్చిన రోజునే సెక్రటేరియట్ పరిసరాల్లోని చెత్తచెదారాన్ని తొలగిస్తామంటూ స్పష్టం చేశారు . స్కూల్ పిల్లల ముందు రేవంత్‌రెడ్డి ఉపయోగించిన పదజాలాన్ని చూస్తుంటే ఆయన ఆలోచనకు, ఆయన అసభ్యకరమైన పెంపకానికి అద్దం పడుతోందన్నారు. రేవంత్ రెడ్డి లాంటి ఢిల్లీ గులాములు తెలంగాణ గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని అర్థం చేసుకుంటారని ఆశించలేమన్నారు కేటీఆర్. స్కూల్ పిల్లల ముందు రేవంత్‌రెడ్డి ఉపయోగించిన నీచమైన పదజాలాన్ని చూస్తుంటే ఆయన ఆలోచనకు, ఆయన అసభ్యకరమైన పెంపకానికి అద్దం పడుతోందన్నారు. రేవంత్ మానసిక ఆరోగ్య పరిస్థితి త్వరగా మెరుగవ్వాలంటూ ఆకాంక్షించారు. అంతకుముందు రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. కేటీఆర్, కేసీఆర్‌లను ఉద్దేశించి తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. సెక్రటేరియట్ ముందు రాజీవ్ విగ్రహాన్ని తొలగిస్తామంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఆ స్థానంలో కేసీఆర్ విగ్రహం పెట్టాలని కేటీఆర్ అనుకున్నాడని, అదెప్పుడు జరిగేనని రేవంత్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి.

**మేఘాపై సీఎం రేవంత్ ప్రత్యేక ఔదార్యం..**
**ఈ బంధం వెనక మతలబు ఏంటో?: కేటీఆర్**

మేఘా ఇంజనీరింగ్ సంస్థపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఔదార్యం చూపిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సుంకిశాలపై సీఎం రేవంత్.. మేఘా బంధం వెనకున్న మతలబు ఏంటని ప్రశ్నించారు. మంగళవారం అయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ … సుంకిశాల ప్రమాదానికి కారణమైన మేఘా ఇంజనీరింగ్ కంపెనీని బ్లాక్ లిస్ట్ చేయాలని, ప్రమాదంపై న్యాయ విచారణ చేయాలని ప్రధాన ప్రతిపక్షంగా డిమాండ్ చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదానికి కారణమైన ఆ కంపెనీపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి.. ఆ సంస్థకు రూ.4,350 కోట్ల కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి అప్పజెప్పనున్నారని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే మెఘా ఇంజనీరింగ్ కంపెనీని తెలంగాణ సంపద దోచుకు వెళ్తున్న ఈస్ట్ ఇండియా కంపెనీగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. నేడు అదే సంస్థపై ఎందుకింత ఔదార్యం, ప్రేమ చూపిస్తున్నారో ప్రజలకు తెలిపాలన్నారు. మేఘా ఇంజినీరింగ్‌పై రేవంత్‌కు ఉన్న ప్రత్యేక ఆసక్తి, అందులోని ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు.

# ఏపీలో నూతన విద్యుత్ విధానం



**విశ్వంభర, అమరావతి:** రాష్ట్రంలో నూతన ఇంధన పాలసీపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ -2024 పేరిట రాష్ట్ర ప్రభుత్వం కొత్త విద్యుత్ విధానాన్ని తీసుకురానుంది. రెన్యూవబుల్ ఎనర్జీలో 2014-19 మధ్య కాలంలో దేశంలో ఏపీ అగ్రస్థానంలో ఉందన్న సీఎం.. 2019 తర్వాత ప్రభుత్వ విధానాలతో విద్యుత్ ఉత్పత్తి రంగం సంక్షోభంలోకి వెళ్లిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ, బయో ఎనర్జీకి ఉన్న అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగేలా కొత్త పాలసీ రూపొందించాలని సూచించారు. పర్యావరణ హితంగా, తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి సాధించేలా పాలసీ రూపకల్పనపై అధికారులతో చర్చించారు. సాధ్యమైనంత తక్కువ సమయంలోనే పెట్టుబడులు, వినియోగదారులకు తక్కువ ధరకే విద్యుత్ సరఫరా చేసే విధంగా పాలసీ రూపకల్పనపై చర్చించారు. వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాల్లో సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తికి అనుసరిస్తున్న విధానాలను స్టడీ చేసి కొత్త పాలసీకి రూపకల్పన చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు తీసుకుకోవాల్సిన చర్యలపైనా చర్చించారు. వ్యక్తులు, సంస్థలు సౌర విద్యుత్ ఉత్పత్తి, మిగులు విద్యుత్ విక్రయంచేలా కొత్త విధానం ఉండాలన్నారు. సౌర విద్యుత్ ప్యానెళ్ల తయారీ పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించే అంశంపైనా చర్చించారు.

## కరీంనగర్ పార్లమెంట్‌ను

# అభివృద్ధి చేయడమే లక్ష్యం

○ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**విశ్వంభర, కరీంనగర్:** కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి బండి సంజయ్ కరీంనగర్ కలెక్టరేట్ కు విచ్చేశారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సహా పలువురు అధికారులు బండి సంజయ్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ శాఖధిపతులతో ఏర్పాటు చేసిన ఇంటరాక్షన్ సమావేశానికి బండి సంజయ్ హాజరయ్యారు. శాఖల వారీగా కేంద్ర ప్రభుత్వ అందిస్తున్న భాగస్వామ్యం, నిధులు వివరాలతోపాటు కేంద్ర పథకాల అమలు తీరుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలు, స్మార్ట్ సిటీ వ్యవసాయం, పౌర సరఫరాలు, మహిళ, శిశు సంక్షేమం, వైద్య, ఆరోగ్యం, గ్రామీణ నీటి సరఫరా తదితర విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, జీఎంజీకేఏవై, పోషణ్ అభియాన్, ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకల అములు పైన సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను మంత్రికి తెలియజేయగా, ఆయా శాఖల జిల్లాస్థాయి అధికారులు గణాంకాలతో సహా వాటి ప్రగతిని వివరించారు. ముఖ్యంగా పీఎం స్వనిధి, నేషనల్ హెల్త్ మిషన్, స్మార్ట్ సిటీ, పోషణ్ అభియాన్, మధ్యాహ్నం భోజనం, పౌర సరఫరాలు, ఆయిల్ ఫాం, రోడ్ల నిర్మాణంపై పురోగతి వివరాలను కేంద్ర మంత్రి అధికారులను వివరించారు. ఆయా పథకాలు, అభివృద్ధి పనుల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, కేంద్రం నుండి అందాల్సిన సహకారంపైనా అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. పామాయిల్ తోటల పెంపకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని, రైతులకు కనీస మద్దతు ధర రూ.12 వేలు ఇస్తోందని, అయినప్పటికీ రైతులు ఆశించిన స్థాయిలో ముందుకు రావడం లేదన్నారు. కనీస మద్దతు ధరను రూ.15 వేలుగా పెంచాలని రైతులు కోరుతున్న విషయాన్ని మంత్రికి వివరించారు. పంచాయతీల్లో బిల్లులు ఆగిపోవడానికి కారణాలేమిటని మంత్రి ఆరా తీశారు. కేంద్రం నుండి నిధుల విడుదలలో జాప్యముందా? రాష్ట్ర ప్రభుత్వం నిధులిస్తుందా? అని అడిగిన ప్రశ్నకు 'కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను క్రమం తప్పకుండా ఇస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వమే గత రెండున్నరేళ్ల నుండి నిధులు మంజూరు చేయక పోవడంతో బిల్లులు ఆగిపోయాయి అని అధికారులు బదులిచ్చారు. కరీంనగర్ జిల్లాలో ఎంఎస్ఎంఈ ఎక్స్ టెన్సన్ కౌంటర్ ను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుందని అధికారులు సూచించడంతో ఆ దిశగా తప్పకుండా క్రుషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కరీంనగర్ లో కేంద్ర నిధులతో సీఐటీడీ భవనాన్ని ఏర్పాటు చేశామని, అయితే రూ.6 కోట్ల విలువైన మిషన్ ను ఇంకా ఏర్పాటు చేయలేదని అధికారులు చెప్పడంతో కష్టపడి కేంద్రాన్ని ఒప్పించి యువతకు శిక్షణ ఇప్పించేందుకు సీఐటీడీ భవనాన్ని ఏర్పాటు చేసుకున్నం. మిషన్ లేకపోతే ఎలా? ఏ ఇన్నాళ్లు ఆ విషయం ఎందుకు చెప్పలేదు. ఇకపై శాఖల వారీగా ఏ ఇబ్బంది ఉన్నా నా ద్రుష్టికి తీసుకురండి అని పేర్కొన్నారు. డైనమిక్ కలెక్టర్ ఉన్నారు. అధికారులు కూడా ఉత్సాహంగా పనిచేస్తున్నారు. అందరి సహకారంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్నదే మా లక్ష్యం. అందులో భాగంగా శాఖల వారీగా ప్రణాళికలు అందించాలని కోరాం. వచ్చేసారి శాఖల వారీగా సమీక్ష జరుపుతున్నా. పీఎం స్వనిధి లబ్దిదారులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తున్నారని మంత్రి అడగడడంతో వీధి వ్యాపారులుగా తమ వద్ద రిజిస్టర్డ్ చేసుకున్న వాళ్లను ఎంపిక చేస్తున్నామని అధికారి తెలిపారు. రాజకీయ ఒత్తిళ్ల వల్ల మొన్నటి వరకు అర్హులైన వారికి కేంద్ర పథకాలు అందడం లేదు. ఇకపై అలా జరగడానికి వీల్లేదు. నేను అవినీతిని ప్రోత్సహించను. అర్హులకు మాత్రమే కేంద్ర పథకాలు అందాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యం. నేను కూడా నిబంధనలకు విరుద్ధంగా, అనర్హులకు కేంద్ర పథకాలు ఇవ్వాలని అడగబోను. మీరు కూడా వాటిని ప్రోత్సహించొద్దు. అర్హులకు మాత్రమే పథకాలు అందేలా చూడాల్సిందే అని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారులకు రెండు కళ్లులాంటివి. రాష్ట్ర ప్రథకాలే కాదు కేంద్ర పథకాల అమలుపైనా ప్రదానంగా పోకస్ పెట్టండి. అప్పుడే రాష్ట్రం సమగ్రాభివృద్ధి జరుగుతుంది. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే కసితో పనిచేస్తున్నా. మీ మీ శాఖల తరపున ఏం చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది? ఏ ప్రాజెక్టు తీసుకొస్తే అభివృద్ధి జరుగుతుందనే వివరాలపై ప్రణాళికలు రూపొందించండి. వాటిని కేంద్రంలోని ఆయా శాఖల మంత్రుల ద్రుష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకొస్తా. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తా. దయచేసి మీరంతా పూర్తిగా సహకరించాలని కోరుతున్నాఅని బండి సంజయ్ అన్నారు.



మిత్రుడు గజిటెడ్ హెడ్మాస్టర్ ఆర్ మంగారెడ్డి కుమారు డు సుమంత్ రెడ్డి వివాహ రిసెప్షన్‌కు హాజరైన మిత్ర బృందం. హాజరైన వారిలో సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కె వెంకటరమణ, అడిషనల్ ఎస్పీలు జి వెంకటేశ్వర్లు, నంద్యాల నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ప్రముఖ సామాజిక, వేత్త పత్రిక సంపాదకుడు కాచం సత్యనారాయణ, రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆర్ దేవేందర్ రెడ్డి, రిటైర్డ్ హెడ్మాస్టర్ గజ్జల జనార్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

- విశ్వంభర, హైదరాబాద్




## తెలంగాణలో మావోయిస్టులు లేరు

# ఇతర రాష్ట్రాలకు పారిపోయారు

**- రాష్ట్ర డీజీపీ జితేందర్**




**విశ్వంభర, కరీంనగర్:** తెలంగాణలో శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలు క్షేమమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ వ్యవస్థ ముందుకు సాగుతుందని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. కరీంనగర్ కమిషనరేట్ కు మంగళవారం రాష్ట్ర డీజీపీ డా. జితేందర్ వచ్చారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల పోలీస్ అధికారులతో డీజీపీ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ప్రజల క్షేమమే పోలీస్ లక్ష్యమంటూ ముందుకు సాగుతున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకై తగు చర్యలు తీసుకుంటూనే అక్రమ ఇసుక రవాణా, సైబర్ నేరాలు, డ్రగ్స్ కంట్రోల్ గంజాయి అక్రమ రవాణా, సరఫరాపై డేగ కన్నేసి నట్లు తెలిపారు. అక్రమ భూకబ్జా దందా అరికట్టడంలో అన్నీ రాష్ట్రాల్లో కంటే ముందున్నామన్నారు. ట్రాఫిక్ పెరిగిపోతున్నందున యంత్రించేందుకుగాను అనేక చర్యలు చేపడుతున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలను పట్టుకోవడంపై స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తూ ప్రతీ వాహనదారు ట్రాఫిక్ రూల్స్ ని ఖచ్చితంగా పాటించేలా అనేక చర్యలు పడుతున్నామని అన్నారు. ఇతర ప్రాంతాల నుండి డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు వస్తున్న సమాచారం మేరకు పోలీస్ వ్యవస్థ అలర్ట్ అయిందన్నారు. త్వరలో సిబ్బంది కొరతను పూర్తిగా అధిగమిస్తామని అన్నారు. కొందరు ట్రైనింగ్ లో ఉన్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు డ్రగ్స్ సరఫరాపై ఆరా తీస్తున్నామన్నారు. ఎక్కడి నుండి వస్తుంది? ఎవరి ధ్వారా వస్తుంది అని ఆరా తీస్తున్నామన్నారు. వారి కదలికలపై కన్నేసి పెట్టాం. ఎవరిని వదిలి పెట్టేది లేదన్నారు. ఈ మధ్య కాలంలో అక్కడక్కడా గంజాయి గుట్టుగా సరఫరా అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అయితే ప్రత్యేక నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయి సరఫరా చేసే వారి కదలికలు ఆరా తీస్తున్నాం. తెలంగాణలో గంజాయి ఉత్పత్తి లేదు. ఇతర ప్రాంతాల నుండి సరఫరా అవుతుందన్నారు. అక్రమ భూ కబ్జా దారులపై చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ రేంజ్ ఐజీ చంద్ర శేఖర్, కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి, జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్, రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీస్ అధికారి శేషాద్రినీరెడ్డి పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో మంత్రుల పర్యటన సక్సెస్



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి నియోజకవర్గంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, భూపాలపల్లి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, కే.ఆర్ నాగరాజు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి ల పర్యటన సక్సెస్ అయింది. ముందుగా రేగొండ మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి వారిని మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.12.15కోట్లతో చేపట్టనున్న కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు. అనంతరం పాండవుల గుట్టకి చేరుకుని అక్కడ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో మంత్రి పాల్గొని మొక్కను నాటారు. ఆదిమ మానవులు వేసిన చిత్రాలు నేటికీ ఈ గుహలో ఉన్నాయని, ఇది ఒక అద్భుతమైన పర్యాటక ప్రాంతమని అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సుమారు రూ.8 కోట్లతో పాండవుల గుట్టలను అభివృద్ధి చేయాలని మంత్రిని కోరగా, త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గణపురం మండలం మైలారం గ్రామంలో పర్యాటక శాఖ వారు ఏర్పాటు చేసిన సున్నపు గుహల ఛాయా చిత్రాలను మంత్రి పరిశీలించారు. గణపురం మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువు కట్టపై పరిశీలించారు. చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని మంత్రి సంబంధిత అధికారులను కోరారు. కోటగుళ్లకు చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. అక్కడి నుండి మంత్రులు ములుగు జిల్లా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. మంత్రుల పర్యటనను సక్సెస్ చేసిన ప్రతీ ఒక్కరికీ ఎమ్మెల్యే పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.





# మార్క్సిజం శాస్త్రీయతను సవాలు చేసిన దార్శనికుడు బీఎస్ రాములు

**తన హృదయస్పందనను యథాతథంగా వ్యక్తీకరించడంలో విజయవంతమైన అతికొద్దిమంది దార్శనికులలో బీఎస్ రాములు ఒకరు. సత్యాన్వేషణ లో అమాయకుడైన బాటసారిగా తన రచనలన్నింటిలోనూ మనకు కనిపిస్తారు. భయం లేదు, పొగడ్త నిందల పట్టింపు లేదు. కేవలం భావితరాలకు ముఖ్యంగా బడుగుజీవులకు మంచి జరగాలనే తలంపు ఆయన రచనలన్నింటా అంతర్లీనంగా ఒక సూత్రంలా పనిచేసింది.బుద్ధుడు, పూలే, అంబేడ్కర్ ల భారతీయచింతన స్రవంతికి కొనసాగింపుగా బీఎస్ రాములు నేటి సమాజానికి అందించిన సాహిత్యం వెలకట్టలేనిది. పాశ్చాత్య చింతనా ప్రభావం నుండి భారతీయ సమాజాన్ని కాపాడటానికి బీఎస్ రాములు అవిశ్రాంత కృషి చేశారు.**

భారతీయచింతన ప్రాధాన్యతను నొక్కి చెబుతూనే, పాశ్చాత్యచింతనలోని ముఖ్యంగా మార్క్సిజంలోని లోపాలను బీఎస్ రాములు బలంగా ఎత్తి చూపారు. బుద్ధుడు, పూలే, అంబేడ్కర్ భావాలను బహుజనులకు సామాన్యమైన భాష ద్వారా సులభతరంగా అర్థమయ్యేలా ఒక చారిత్రక కర్తవ్యంలా సాహిత్యం ద్వారా బీఎస్ రాములు నిర్వర్తించారు.డా.బీఆర్ అంబేద్కర్ ముందుచూపుతో చేసిన సూచనలు బహుజనులకు చేరకుండా మార్క్సిస్టులు విస్తారమైన సాహిత్యాన్ని వెదజల్లి, తమ భావాలే శాస్త్రీయమని ప్రచారం చేసుకున్నారు. 'సోషలిజం: ఊహాజనితం, శాస్త్రీయం' అంటూ ఉధృతంగా సాగించిన ప్రచారంలో- ఊహలు ఏ విధంగా శాస్త్రీయమౌతాయని ప్రశ్నించలేని స్థితిలోకి బహుజనులు నెట్టబడ్డారు. మార్క్సిజం శాస్త్రీయతను సవాలు చేసి, మనిషి తనను తాను ఎలా తెలుసుకోవాలో బీఎస్ రాములు బహుజనుల దృష్టికి తీసుకువచ్చారు.

బీఎస్ రాములుతన నిశిత దృష్టితో, లోతైన అధ్యయనం ద్వారా బహుజనులు తమ చరిత్రను గుర్తెరిగేలా సాహిత్యాన్ని సృజించారు. మార్క్సిస్టులు- 'కార్మికులకు దేశం లేదు', 'కార్మికులు విశ్వమానవులు' వంటి నినాదాలతో.. బహుజనులు తమకు తాము ఈ దేశచరిత్ర నుండి పరాయీకరణ చెందేలా, వేల సంవత్సరాలుగా తమకు జరిగిన అన్యాయాన్ని, తమపై ఆధిపత్యవర్గాలు సాగించిన దోపిడీని గుర్తించలేకుండా చేసేందుకు విస్తారంగా సాహిత్యాన్ని సృష్టించి ప్రచారం చేశారు. బహుజనుల దృష్టి గతం మీదకు మరలకుండా, భవిష్యత్తుపై రంగుల కలలు సృష్టించి మార్క్సిస్టులు చేస్తున్న ప్రచారాన్ని బీఎస్ రాములు ధీటుగా ఎదుర్కొన్నారు. చరిత్ర మరచినవారు చరిత్ర సృష్టించలేరనే' అంబేద్కర్ సందేశాన్ని తన రచనల ద్వారా బహుజనులకు చేరవేసి, వారిని అప్రమత్తం చేశారు.

దోపిడీని అంతమొందిస్తామని బయలుదేరిన సంస్థల్లో, పార్టీలలో తరతరాలుగా దోపిడీకి గురయినవారు నాయకత్వ స్థానాల్లో లేకపోవడాన్ని B.S రాములు తీవ్రంగా ఖండించారు. కార్మికవర్గ దృక్పథం కలిగి వున్నామనే సాకుతో, కార్మికవర్గం కానివారు కార్మికవర్గంలో చొరబడి కార్మికవర్గానికి నాయకులుగా స్థిరపడిపోయిన తీరును, వారి ఆధిపత్య స్వభావాన్ని బీఎస్ రాములు బట్టబయలు చేశారు. అంబేద్కర్ అంటే మార్క్సిస్టులకు కోపం ఎందుకు? అసలు మార్క్సిజంలో ఏముంది ? అంబేద్కర్ మార్క్సిజం గురించి ఏం చెప్పారు ? ఈ విషయాలపై విశ్లేషణ జరగనీయకుండా... అంబేద్కరిజంను చర్చించాలనే వారిపై 'దిగజారినవారిగా' మార్క్సిస్టులు ముద్రవేసారు. వాస్తవాన్ని మార్చేముందు దాని విలువను మార్చడంలో పండిపోయిన మార్క్సిస్టులు బీఎస్ రాములు వంటి వారిని 'కులతత్వవాది' గా చిత్రించే ప్రయత్నం చేశారు. అంబేద్కర్ భావాలపై చర్చించే ప్రయత్నం చేసినప్పుడు రాములుకి ఎదురైన అనుభవం ఇలా వుంది.

అంబేద్కర్ గురించి చర్చిస్తే నీవు మార్క్సిజాన్ని వదిలేసినట్టే అంటూ రాయడానికి వీలుకాని అనమానకరమైన మాటలన్నాడు లక్ష్మణరావు. "(దరకమే- పేజీ.160)

గతితర్క నియమాల ప్రకారం.. వాదం ( Thesis) – మార్క్సిజం, ప్రతివాదము (Anti thesis) -అంబేద్కరిజం అనుకుంటే సమన్వయవాదం(synthesis) ఉండాలి కదా! ఎందుకని సమన్వయ వాదానికి మార్క్సిస్టులు సిద్ధపడలేదు? వారి గతితర్క సూత్రాలకు భిన్నంగా ఎందుకని పిడివాదంతో మిగిలిపోయారు ? ఇటువంటి ప్రశ్నలెన్నో బీఎస్ రాములు చర్చించారు.

అంబేద్కర్ ఎవరినైతే దోపిడీదారులుగా నిరూపించారో...ఆ దోపిడీదారులను మార్క్సిజం పుణ్యాత్ములను చేసింది. మార్క్సిజం ప్రకారం పనిముట్లు ఆధీనంలో లేనివారు అమాయకులు. అందుకే తరతరాలుగా దోపిడీ చేసిన వర్గం యొక్క ప్రతినిధులు మార్క్సిజాన్ని అక్కున చేర్చుకుని, అంబేద్కర్ ని ద్వేషిస్తూ, అంబేద్కర్ విలువను తగ్గించేందుకు - అంబేద్కర్ ను పాలకవర్గాల ఏజెంటుగా, పెద్దపాలేరు గా చిత్రిస్తూ చరిత్రను వక్రీకరించి చాలాకాలంపాటు అంబేద్కర్ ను బహుజనులకు దూరం చేసే ప్రయత్నం చేశారు. వారి కుట్రలను బీఎస్ రాములు తన రచనల ద్వారా బహిర్గతం చేశారు.

గతితర్క తత్వదర్శ భూమిక లో మార్క్సిజం శాస్త్రీయతను సవాల్ చేసిన బీఎస్ రాములు.. మార్క్సిస్టులు తను శాస్త్రీయ సూత్రాలుగా ప్రచారం చేసుకుంటున్న గతితార్కిక భౌతిక వాదం, చారిత్రక భౌతిక వాదాలలోని అశాస్త్రీయతను బీఎస్ రాములు తన ప్రసిద్ధ రచన 'గతి తర్క తత్వదర్శన భూమిక' లో బట్టబయలు చేశారు. ' వైరుధ్యం లేకపోతే ప్రగతి లేదు' అన్న మార్క్స్ సూత్రీకరణ యొక్క సంకుచితత్వాన్నిబీఎస్ రాములు ఎండగట్టారు.

అశేషప్రజానీకం యొక్క ఆకాంక్షలను,వారి మధ్య అనుబంధాలను, వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పట్టించుకోకుండా కార్మికులను మాత్రమే పరిగణన లోకి తీసుకుని కారల్ మార్క్ సృష్టించిన సిద్ధాంతం యొక్క ప్రాథమిక లక్ష్యం ప్రజలకు సేవ చేయడం కాదని, కార్మికవర్గం పేరిట అధికారం పొందడమే అని బీఎస్ రాములు స్పష్టం చేశారు.

కారల్ మార్క్స్ ప్రకృతిని, సమాజాన్ని అర్థం చేసుకోకుండానే ప్రపంచాన్ని మార్చాలంటూ ప్రగతి నిరోధక సిద్ధాంతాన్ని తయారుచేశాడు. అర్థరహితమైన ' గతితార్కిక భౌతికవాదం' ను చరిత్రకు అన్వయించి, చరిత్రలో చెప్పుకోదగ్గ మార్పులన్నీ వ్యక్తుల సంకల్పం, కృషి , త్యాగం ద్వారా కాకుండా వస్తూత్పత్తిలో ఉత్పత్తి సాధనాల అభివృద్ధి ద్వారా మాత్రమే జరిగాయని చరిత్రను వక్రీకరించాడు. ప్రతితరం లోనూ మహనీయులు చేసిన కృషి, త్యాగాలకు విలువ ఇవ్వకుండా మాట్లాడాడు. దీనిని బీఎస్ రాములు తీవ్రంగా ఖండించారు.

మార్క్సిజం చేసిన అనేక కీలక ప్రతిపాదనలు దారుణమైనవని ,దోష పూరితాలని రుజువయ్యాయి. జ్యోతిష్యం లాగే మార్క్సిజం కూడా పరీక్షించడానికి అవకాశం లేకుండా ఎటువంటి ప్రమాణాల మీద రూపొందలేదు. ఆచరణలో మాత్రం మార్క్సిజం అమానుష, సామాజిక ఫలితాలకు దారితీసింది. జ్ఞాన రంగంలో కూడా సకల శాస్త్రాలకు తల్లి అయిన తత్వశాస్త్రానికి మార్క్సిజం ద్రోహం చేసింది. ఈ విషయమై బీఎస్ రాములు ఇలా అన్నారు.

30 ఏళ్ళ క్రితం పల్లం . కుమారస్వామి అనే యువ దార్శనికుని అభిప్రాయాలను తన 'గతితర్కం-అంబేద్కరిజం-మార్క్సిజం'పుస్తకంలో సాహసోపేతంగా ప్రచురించి... నాలాంటి ఎందరికో స్ఫూర్తిదాయకంగా బీఎస్. రాములు నిలిచారు.

భారతీయ చింతన ప్రాముఖ్యత గుర్తించిన బీఎస్ రాములు..దిగుమతి చేసుకున్న భావజాలంపై మోజులో స్వదేశీ భావజాలాన్ని నిర్లక్ష్యం చేసి భారతదేశం చాలా నష్టపోయింది. భారతదేశానికి తత్వశాస్త్రమే లేదని కొందరు పాశ్చాత్యులు చేసిన విషప్రచారాన్ని తీవ్రంగా ప్రతిఘటించలేక పోయాము. కానీ ఆ లోటును బీఎస్ రాములు తీర్చగలిగారు.

అరుదైన జీవితం ... అపూర్వమైన కృషి కలబోసిన తత్వవేత్త బీఎస్ రాములు...

" పరీక్షించని జీవితం వృధా " అంటాడు గ్రీకు తత్వవేత్త సోక్రటీస్. బీఎస్.రాములు జీవితం అనేక రకాలుగా పరీక్షించబడింది. ఆర్.ఎస్.ఎస్ ముఖ్య శిక్షక్ గా, ఉద్యోగ సంఘాల, అంబేద్కర్ సంఘాల నిర్మాణ భాగస్వామిగా, పౌరహక్కుల కార్యకర్తగా, విరసం సభ్యునిగా, విప్లవనాయకుడిగా, ఉద్యోగిగా, దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక ( దరకమే) వ్యవస్థాపక కార్యదర్శిగా , తెలంగాణ ఉద్యమకారునిగా, తెలంగాణ తొలి బీసీ కమీషన్ చైర్మన్ గా, చివరిగా " పూలే అంబేద్కర్ బుద్దిస్ట్ దృక్పథం" లో సామాజిక జీవితానికి అంకితమైన బీఎస్ రాములుకు లభించిన అరుదైన జీవితం అందరికీ లభించదు. ఎవరికైనా లభించినా తట్టుకొని నిలబడటం కష్టం.

విప్లవోద్యమంలో బీఎస్ రాములు సహచరులు, శిష్యులు ఎందరో ఎన్నో కష్టాల పాలయ్యారు. ఎందరో అమరులయ్యారు. వారిని గురించిన జ్ఞాపకాలు బీఎస్ రాములు ను ఎంతలా కలచివేసాయి.

ఆరెస్సెస్ భావజాము , మార్క్సిస్టు భావజాలము, బుద్దుడు- పూలే - అంబేద్కర్ ల భావజాలము ... ఇలా భారత దేశంలోని పరస్పర భిన్నమైన భావజాలాలను అనుభవ పూర్వకంగా పరిశీలించిన అనుభవశాలి బి.యస్ రాములు. ఆయన జీవితం పూలపాన్పు కాదు. కఠోర క్రమశిక్షణ, త్యాగనిరతి, ఓర్పు, సానుకూల దృక్పథంలో బీఎస్ రాములు ఎన్నో కఠిన పరీక్షలను ఎదుర్కొని నిలబడ్డారు.

బీఎస్ రాములు జీవితంలో... వ్యక్తిగత జీవితం కంటే సాహిత్య జీవితమే ఎక్కువ. శతాధిక గ్రంధాలు రచించారంటే.... ఆయన ఏకాంతంగా ఎంతగా తలబద్దలు కొట్టుకొని ఉంటారో ఊహించడం కష్టం. బీఎస్ రాములు సాహిత్యం ఒక జీవనది. సహజంగానే ఇంత చిన్న వ్యాసంలో అపూర్వమైన ఆయన సాహిత్యకృషిని వివరించడం సాధ్యం కానిపని. ఆయన సాహిత్యం వెనుక ఊహలు లేవు. వాస్తవ జీనితమే ఉంది. విస్తృత అధ్యయనం ఉంది. బీఎస్ రాములకు ఎదురైన కష్టాలు, బాధలు - బడుగుజీవులకు, భావితరాలకు మేలు జరగాల నే ఆయన సంకల్పం ముందు ఓడిపోయాయి. ఆయన ఒక మార్గదర్శి ... సుదీర్ఘ అనుభవంతో ఆయన చెప్పే విషయాలు మనం వినాలి. ఆచరించాలి . వాటిని భావితరాలకు అందించాలి.

మనకు ప్రజలు ప్రాథమికం కావాలి. మొత్తం సమాజం, ప్రకృతి ప్రాథమికం కావాలి అనే సందేశమిచ్చిన బీఎస్ రాములు నేటి ప్రపంచంలో మేటి తత్వవేత్త. మహోన్నత మానవతావాది. బీఎస్ రాములు భారతీయుడు కావడం, ముఖ్యంగా తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణం.

**- ఎర్రా. చైతన్య కిరణ్**
**8985985959**

# తెలుగు మహిళల హృదయ నేత్రి మాలతీ చందూర్

**నేడు (ఆగస్టు 21) ఆమె వర్ధంతి**

ప్రపంచం గర్వించదగ్గ తెలుగు స్త్రీవాద రచయిత్రి మాలతీ చందూర్. ఎక్కువగా చదువుకోకపోయినా, తెలుగు భాషకు, తెలుగు మహిళకు పట్టాభిషేకం చేసి, సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీతగా గుర్తింపు పొందిన ప్రతిభాశాలి. రచయిత్రిగా, కాలమిస్టుగా, 1950ల నుండి దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగువారికి ఆమె సుపరిచితం. మాలతీ చందూర్ (1930 - ఆగస్టు 21, 2013) కృష్ణా జిల్లా లోని నూజివీడులో 1930 లో జన్మించారు. ఊర్లో ఉయ్యూరు రాజావారి దివాణం పక్కనే ఎస్ఆర్ఆర్ పాఠశాలలో 8వ తరగతి వరకు ఎస్ఎస్ఆర్ పాఠశాలలోనే చదివారు. 8వ తరగతి పూర్తి కాగానే ఏలూరు వెళ్ళి, అక్కడ వారి మామయ్య (చందూర్) ఇంట్లో ఉండి చదువు కున్నారు. ఏలూరు లోని వల్లూరు సెయింట్ థెరిస్సా స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చేరారు. అప్పుడు చందూర్ గారి ద్వారా డి.కామేశ్వరి, ఆనందరామం, అరవిందా చారి, సక్కుబాయి వంటి వారితో పరిచయం ఏర్పరుచు కున్నారు. ఏలూరులో వారున్న ఇంటికి దగ్గరగా 'కథావీధి' అనే సాహిత్య పత్రిక ఉండేది. అక్కడికి శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, వెంకటచలం, కావలి లక్ష్మీనరసింగం మొదలైన వారు వచ్చేవారు. 1947లో ఆమె, తన మేన మామ, రచయిత, జగతి పత్రిక సంపాదకులు ఎన్. ఆర్. చందూర్‌ను వివాహం చేసుకున్నారు. మద్రాసు చేరుకుని, జార్జిటాన్‌లో అద్దె ఇంటిలో ఉంటూ, మద్రాసులో ప్రైవేటుగా ఎస్ఎస్ఎల్సి పూర్తి చేశారు. 1949లో వారి రచనా వ్యాసంగం ప్రారంభించారు. అప్పట్లో రేడియోలో ఆమె రచనలను చదివి వినిపించేవారు. ఆ రోజుల్లో ఎగ్మూర్‌లో ఉన్న రేడియో స్టేషన్‌కు వెళితే ఒక సాహితీ సభకు వెళ్ళిన అనుభూతిని పొందేవారు. అక్కడే ఆచంట జానకిరాం, బుచ్చిబాబు, జనమంచి రామకృష్ణ, పి.వి. రాజమన్నార్, ముని మాణిక్యం నరసింహారావు వంటి వారిని దగ్గరగా గమనించే అవకాశం ఆమెకు కలిగింది. 1952 నుంచి రచనా వ్యాసంగంలో తీరిక లేకుండా గడిపారు. భర్త చందూర్‌ను ఎప్పుడూ ''మామయ్య''గానే సంబోధించేవారు. సంతానం లేని మాలతీ, చందూర్ దంపతులు రచనలే తమ సంతానంగా, సాహితీ ప్రియులే బంధువులుగా గడిపారు. మద్రాసులో తెలుగు సాహితీ సంస్థలకూ, సామాజిక ప్రముఖులకూ పెద్ద దిక్కుగా నిలిచారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్థాపించిన 'ఆంధ్ర మహిళా సభ' నిర్వహణలో, అభివృద్ధిలో దంపతులు ప్రధాన పాత్రలు పోషించారు. 1950లలో 'ఆంధ్రప్రభ' వారపత్రికలో 'ప్రమదావనం' పేరిట స్త్రీల కోసం ప్రత్యేకంగా మాలతీ చందూర్‌తో కాలమ్ ప్రారంభించారు. ప్రమదావనం ద్వారా దశాబ్దాల కాలంగా పాఠకులతో ప్రశ్నలు, జవాబులు శీర్షికను విజయ వంతంగా నడుపుతూ, తెలుగు కాలమిస్టుల చరిత్రలో మాలతీ చందూర్ ఓ అరుదైన ఘనత సాధించారు. ఆ శీర్షికలో వంటలు, వార్పులే కాకుండా ఇంగ్లీషు నవలలను పరిచయం చెయ్యటం, విదేశాలలో తిరిగి వచ్చిన వారి చేత వారి అనుభవాలు రాయించటం మొదలైనవి చేశారు. ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే వారు. ఎప్పుడూ వంటింటికి దూరంగానే గడిపిన మాలతీ చందూర్ రాసిన 'వంటలు - పిండి వంటలు' రచన తెలుగునాట ఎంతో ప్రసిద్ధం. వంటల పుస్తకాలు కొత్తగా పెళ్ళయిన అమ్మాయిలకు ఉపయోగకరంగా ఉండేవి. మాలతీ చందూర్ రాసే "జవాబులు" ఆడవారితో పాటు మగవారు కూడా చదివేవారు. 'జవాబులు' శీర్షిక పేజీలను వారపత్రిక నుండి చించి, పుస్తకాలుగా బైండింగులు చేసి, చాలామంది అపురూపంగా దాచుకొనేవారు. స్వాతి' మాస పత్రిక ప్రారంభ రోజుల నుండి మూడు దశాబ్దాల పైచిలుకుగా 'పాత కెరటాలు' శీర్షిక నిర్వహించారు.



చంపకం - చెద పురుగులు' (1955 సెప్టెంబర్ లో ప్రథమ ముద్రణ) తో ప్రారంభించి, దాదాపు 150కి పైగా కథలు ఆమె రాశారు. మహిళా ప్రధాన నవలలు రాయటమే కాక 300 కు పైగా రచనలను తెలుగులోకి అనువదించారు. ఇవి 'పాత కెరటాలు' శీర్షికన స్వాతి మాసపత్రికలో ప్రచురించారు. నవలా రచయిత్రిగా, మహిళా కాలమిస్టుగా అనేక పురస్కారాలు అందుకొన్నది. 70వ దశకములో కేంద్ర సెన్సారు బోర్డు సభ్యురాలిగా పనిచేశారు. అందుకోసం తమిళ తమిళ భాష నేర్చుకుని, రెండేళ్లకే అనువాదాలు ప్రారంభించి, ప్రముఖ తమిళ రచయితలు శివశంకరి, జయకాంతన్, ఎన్.ఎ.పార్థసారథి, పుళమై పిత్తన్, సుజాత, కలైంజర్ కరుణానిధి తదితరులు చేసిన తమిళ రచనలను ఆమె తెలుగులోకి అనువదించారు. భారత స్వాతంత్ర్య సమర కాలంలో జరిగిన ప్రసిద్ధ చీరాల - పేరాల ఉద్యమ నేపథ్యంతో 'వనిత' మాసపత్రికలో ఆమె రాసిన 'హృదయ నేత్రి' నవలకు 1990వ దశకం తొలి రోజుల్లో కలకత్తాలోని 'భారతీయ భాషా పరిషత్' వారి ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డు వరించింది. కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను పొందారు.

2013 ఆగస్టు 21 న చెన్నైలో మాలతీ కన్ను మూసారు. మృతి చెందదానికి ముందు క్యాన్సర్ వ్యాధి గ్రస్తులయ్యారు. మెడికల్ కాలేజీకి ఆమె శరీర దానం చేశారు.

# నామమాత్రమైన వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు

**నేడు (ఆగస్టు21 ) నేషనల్ సీనియర్ సిటిజన్స్ డే**

కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ... విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయో వృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారత దేశంలో ప్రస్తుతం 15 కోట్లమంది వృద్ధులున్నారు. 2050 నాటికి వీరి సంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతంకు మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితిని తామే తిట్టు కుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ, నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సచిత్రం సర్వత్రా సాక్షాత్కార మిస్తున్నది. దేశంలో నెలకొన్న పరిస్థితుల వల్ల సామాన్యులకు నానాటికీ బతుకు భారం అవుతున్న రోజులివి. అదేక్రమములో వృద్ధుల పట్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కుపై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినప్పటికీ వయోవృద్ధుల సమస్యలకు పరిష్కారం కనబడక పోవడం అసలైన విషాదం. దేశంలోని ప్రతి అయిదుగురు వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేదింపులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారు. దూషణలకు పాల్పడటమే



కాకుండా కొందరు శారీరక హింసకూ పాల్పడు తుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం. వాస్తవానికి వృద్ధులు జాతి సంపద. వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. బతికినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందు పరచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ళ తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొదింది. ఐతే దీని గురించి ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించక పోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. ఫలితంగా ఆ చట్టం నిరుపయోగం అవుతోంది.

**వృద్ధులను విస్మరిస్తే శిక్షార్హులే**

సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వయోవృద్ధులను, సీనియర్ సిటిజన్లను కుమారులు, కూతురులు విడిచిపెట్టి, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా, చట్ట ప్రకారం శిక్షార్హమే. శిక్షాకాలం ఒక టర్మ్‌కు, మూడు మాసాల జైలు శిక్ష లేదా అపరాధ రుసుం, గరిష్టంగా ఐదు వేల రూపాయలు, లేదా రెండింటిని విధించవచ్చు. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్. డి. ఓ. నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు.

**ప్రభుత్వాలకూ బాధ్యత**

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు వేరుగా క్యూ పద్ధతి ప్రవేశపెట్టాలని, దీర్ఘకాలిక, అంతిమ పునర్వికాసం లేని రోగాల చికిత్సల సదుపాయాలు, ప్రభుత్వమే కల్పించాలని, 2007 సంక్షేమ చట్టం నిర్దేశిస్తున్నా, అమలుకు నోచుకోక పోవడం శోచనీయం. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం వృద్ధుల సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం పై, సదవగాహన కల్పించడానికి సదస్సులు ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం, సీనియర్ సిటిజన్ "డే కేర్" సెంటర్ల నిర్వహణ, ప్రతి మండలంలో వీరి రక్షణ, వైద్య సహాయం కోసం వైద్యశాల, బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా మరిచింది. వయోవృద్ధుల సంక్షేమానికి ఒక డైరెక్టరేటును ఏర్పరచి తగిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. జిల్లాలలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ లను నెలకొల్పాలి. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ, సంక్షేమ నియమావళి చట్టం 2011 నిబంధనల మేరకు, జిల్లా కేంద్రాలలో అప్పిలేట్ ట్రిబ్యునళ్ళు, డివిజన్ కేంద్రాలలో ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేసి బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలి. ఇతర రాష్ట్రాలలో రవాణా సంస్థల బస్సులలో, 30 శాతం రాయితీ ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకు లేదు. ఇంటి పన్నులో 30% రాయితీ ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి. కళ్ళజోళ్ళు, వినికిడి తదితర పరికరాలు, వీల్‌ఛైర్లు, వాకింగ్ సాధనాలు అందించాలి. వీరి రక్షణ చర్యలు గైకొనాలి. దేవాలయాలలో ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించాలి.

**"సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంఘాలు"**

జగిత్యాల జిల్లాలో 80 వేల మంది వయో వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి, సౌకర్యాల కల్పనకు, "ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్" ఏర్పాటయింది. విద్యాధికులు, అనుభవైక వైద్యులైన, ఉద్యోగ సంఘాల సీనియర్ నేత హరి అశోక్ కుమార్ అధ్యక్షతన అసోసియేషన్ సమర్థ వంతంగా నడుస్తోంది.

**-రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తా

**- ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి**

విశ్వంభర, మర్పల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చేవెళ్ల ఎంపీ. కొండ విశ్వసిరెడ్డి అన్నారు. మంగళవారం నాడు వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేసే యంత్రాన్ని, స్వచ్ఛ విద్యాలయ, శానిటేషన్ ట్రక్కును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు విద్యావేత్తలు అందరు కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకునేవారని ఆయన అన్నారు. మర్పల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రం చేసే యంత్రం ఆరు లక్షల విలువ ఉంటుందని, ప్రతినెల 45 వేల రూపాయల వరకు వ్యయం అవుతుందని ఈ ఖర్చులన్నీ ఫౌండేషన్ తరపున భరిస్తామని ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి మాట్లాడుతూ ఇది ఒక ప్రారంభం మాత్రమే అని అన్నారు. ఇంకా పాఠశాలల అభివృద్ధికి ఎంపీ గా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మర్పల్లి మండల ఎంఈఓ. విద్యాసాగర్ మాట్లాడుతూ మండలంలోని 17 పాఠశాలలో ఇంతవరకు చేసిన మరుగుదొడ్ల పనులు అలాగే ప్రహరీ గోడ నిర్మించిన నిధులు రాలేదని అందుకు ఎంపీ నిధులు కేటాయించాలని కోరారు. మర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయ మాట్లాడుతూ ఈ యంత్రం ద్వారా మరుగుదొడ్లు శుభ్రం చేయడం వల్ల విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉంటుందని అందుకు ఎంపీకి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ తాను కొత్తగా ప్రిన్సిపల్ గా వచ్చానని వచ్చిన రెండు రోజుల లోపే తమ కళాశాలలో మరుగుదొడ్లు శుభ్రం చేయడం అభినందనీయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ కోఆర్డినేటర్ రాములు ముదిరాజ్, వికారాబాద్ జిల్లా బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శి. మల్లేష్ యాదవ్, మర్పల్లి మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, మర్పల్లి మండల బీజేపీ పార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలు అన్నపూర్ణ, నాయకులు యాదవ రెడ్డి, మర్పల్లి ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, మర్పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి వారిని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రూ.12.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులకు మంత్రి జూపల్లి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భక్తుల పాలిట కొంగు బంగారమై విరాజిల్లుతున్న కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు భక్తుల సౌకర్యాలను మెరుగుపరుస్తామని అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భక్తుల కోసం వసతి సదుపాయాలు కల్పిస్తామని, దీనికి సంబంధంచిన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఎంపీ కడియం కావ్య, పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో
# కామారెడ్డి బంద్



**విశ్వంభర, కామారెడ్డి:** చాంబర్ ఆఫ్ కామర్స్ కామారెడ్డి బందుకు పిలుపు ఇవ్వడంతో మంగళవారం కామారెడ్డి ప్రజలు పూర్తిగా బంద్ పాటించారు. వాణిజ్య సముదాయమైన సుభాష్ రోడ్, జయప్రకాష్ నారాయణరావు తిలక్ రోడ్, స్టేషన్ రోడ్ బస్టాండ్, ఓల్డ్ బస్టాండ్, న్యూ బస్టాండ్ ఎక్కడ చూసినా కామారెడ్డి బందు కనబడింది. బెంగాల్లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బందుకు పిలుపునిచ్చారు. చాయ్ హోటల్ నుండి పెద్ద పెద్ద షోరూం వరకు పూర్తిగా మద్దతుకు సహకరించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కంచర్ల లింగం మాట్లాడుతూ హిందువులపై బంగ్లాదేశ్ లో జరుగుతున్న దాడులకు నిరసనగా కుల మతాల కతీతంగా బంద్ కు పిలిపించామని, వాణిజ్య సంఘాలు సహకరించినందుకు వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు అని ఆయన తెలిపారు. ఈ యొక్క బంద్ లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి సుకుమార్, కోశాధికారి నర్సింలు కౌన్సిలర్లు శ్రీకాంత్, పాత లక్ష్మణ్, ముప్పారప్పానందు, కొక్కొండ రవీందర్, వివిధ వ్యాపార వాణిజ్య సంఘాలు బంద్ లో పాల్గొన్నారు. అనంతరం వ్యాపారస్తులు అందరు కలిసి ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి




**విశ్వంభర, తలకొండపల్లి:** వర్షాకాలం సీజన్ వ్యాధులు గ్రామాలలో వ్యాపిస్తున్నాయి అని తెలుసుకున్న ఉప్పల వెంకటేష్ తన ట్రస్టు ద్వారా తలకొండపల్లి మండలం జంగారెడ్డి పల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఉప్పల అఖిల్, తలకొండపల్లి ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్ పాల్గొని ప్రారంభించారు. శిబిరంలో దాదాపు 200 మంది రోగులకు జనరల్ బీపీ, షుగర్ పరీక్షలు, వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల బారిన పడిన రోగులకు మందులు అందజేయడమే కాకుండా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మల్లేష్, అన్నం మోహన్ రెడ్డి, మీసాల మధు, మహేష్, మాజీ ఉప సర్పంచ్ చంద్రమౌళి, బుచ్చిబాబు వైద్యులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు

**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండలం మల్లారెడ్డి పల్లి గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో సోమవారం గుర్తు తెలియని దుండగులు చెట్లు నరికి తరలించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో పలు పత్రికలలో పల్లె ప్రకృతి వనంలో చెట్లు నరికివేత అనే శీర్షికతో వచ్చిన సమాచారాన్ని మండల అధికారుల ఫిర్యాదును అందుకున్న నల్గొండ జిల్లా డీఆర్డీఏ దేవరకొండ క్లస్టర్ ఏపీడి బాలకృష్ణ మంగళవారం ఎంపీడీవో సుజాతతో కలిసి పల్లె ప్రకృతివనాన్ని పంచనామా నిర్వహించారు. పల్లె ప్రకృతి వనంలో 3000 మొక్కలను సంరక్షించారని, వాటి గురించి ఎంపీఓ, ఏపీఓలను అడిగి తెలుసుకున్నారు. అందులో 85 ఏపుగా ఎదిగిన చెట్లను నరికి తరలించకపోయారని తేల్చేశారు. నరికిన చెట్ల విలువ 9,540 విలువ ఉంటుందని నిర్ధారించారు. పల్లె ప్రకృతి వనం మొదలు పెట్టిన నాటి నుండి ఇప్పటి వరకు అయినటువంటి వ్యయం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. జరిగిన సంఘటనపై వాటి వివరాలను సేకరించి పూర్తి నివేదిక నల్గొండ డీఆర్డీఏ పీడీ శేఖర్ రెడ్డికి తెలియజేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లె ప్రకృతి వనం లోని చెట్లను నరికి తరలించిన వారిని త్వరలో గుర్తించి వారిపై శాఖ పరమైన చర్యలు ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, ఎంపీ ఓ ప్రవీణ్ శ్రీధర్, ఏపీవో శౌరి రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ ఫకీర, పంచాయతీ సెక్రెటరీ ఓర్సు సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



## పర్యాటక ప్రాంతంగా భూపాలపల్లిని అభివృద్ధి చేస్తాం




**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, ఎక్సయిజ్, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంగళవారం రేగొండ మండల పరిధిలోని పాండవుల గుట్టను రాష్ట్ర పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, పార్లమెంటు సభ్యులు డా కడియం, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట శాసనసభ్యులు నాగరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయుటకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు, పురాతన కట్టడాలు, దేవాలయాలు, జలాశయాలు, అడవులు అధికంగా ఉన్న జిల్లా అని తెలిపారు. పాండవుల గుట్టకు ఎంతో ప్రాశస్త్యం ఉందని పాండవులు ఇక్కడ వనవాసం చేసిన ఆనవాళ్లు ఉన్నట్లు తెలిపారు. వేల సంవత్సరాలు చరిత్ర కలిగిన ఈ గుట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం వల్ల ఈ ప్రాంత యువతకు, ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. పాండవుల గుట్ట రాష్ట్ర, దేశ, విదేశాల పర్యాటకులను ఆకర్షించే విధంగా తయారు చేస్తామని అన్నారు. అన్ని వయస్సుల వారు సందర్శిస్తుంటారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. రోప్ వే, ట్రెక్కింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక సంస్థ చైర్మన్ రమేష్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్, పర్యాటక శాఖ ఎండి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అటవీ అధికారి వసంత పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల ఎదుట గ్రామస్తుల ధర్నా




**విశ్వంభర, చింతపల్లి:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద విద్యార్థులకు న్యాయం చేస్తామని ప్రభుత్వం చెప్పే మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. మా పిల్లలకు న్యాయం జరగాలని గ్రామస్తులు పాఠశాల ముందు ధర్నా చేయడంతో పరిస్థితి ఎంతవరకు దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. మండల పరిధిలోని తక్కళ్ళపల్లి మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలో 31 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 31 మంది విద్యార్థులకు గాను నలుగురు ఉపాధ్యాయులు పాఠాలు బోధించాల్సి ఉంది. అయితే ఇదే పాఠశాలలో పనిచేస్తున్న ఓ మహిళ ఉపాధ్యాయురాలు గత రెండు నెలల నుండి మెడికల్ లీవ్ లో ఉన్నది. ఈ ఉపాధ్యాయురాలు ఈనెల 31వ తేదీన పదవి విరమణ కానుంది. ఇదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మరో ఎస్జీటీ ఉపాధ్యాయుడు వీటి నగర్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఆదేశానుసారం అనధికారకంగా కేవలం ఉపాధ్యాయుల జీతాలు చేయడం కోసం వీటీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళుతూ అక్కడ కాలక్షేపం చేస్తున్నాడని గ్రామస్తులు బాహటంగానే ఆరోపణలు చేస్తున్నారు. మిగిలిన ఇద్దరు ఉపాధ్యాయులు ఒకటి నుండి ఏడవ తరగతి వరకు పాఠాలు బోధించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాల విద్యార్థులు పాఠాలు బోధించేవారు లేక అరకొర చదువులతో కాలం నెట్టుకొస్తున్నారు. మండల విద్యాధికారి గురువారావును సంప్రదించగా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అనధికారికంగా ఓ ఉపాధ్యాయుడిని వీటి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ కోరిక మేరకు ఆ పాఠశాలకు పంపించిన మాట వాస్తవమేనన్నారు. మరో ఉపాధ్యాయురాలు పదవి విరమణ సమీపిస్తుండడంతో ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులతో ఎలా పాఠాలు బోధిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, విద్యాధికారులు స్పందించి విద్యార్థుల జీవితాలతో ఆటలాడకుండా వారికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 44 ఏళ్లుగా విగ్రహాల తయారీలో ఎంతో మందికి
# జీవనోపాధి కల్పిస్తున్న గంగాధర్



**విశ్వంభర, కోరుట్ల :** నిజామాబాద్ జిల్లా ఒడ్యాడు గ్రామానికి చెందిన పోలాపల్లి గంగాధర్ 1980లో కోరుట్ల పట్టణానికి ఉపాధి నిమిత్తం వచ్చారు. స్వతహాగా శిల్పి కళాకారుడు అయిన గంగాధర్ బంక మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేసేవాడు 1983 వ సంవత్సరం "శిల్పకళా ఆర్ట్స్" పేరుతో కుటుంబ సభ్యుల సహకారంతో వినాయక విగ్రహాలను రూపుదిద్దేవారు. ఈ క్రమంలో పీఓపీ విగ్రహాలు మార్కెట్లో ఎక్కువ డిమాండ్ తో అమ్ముడుపోయేవి మట్టి విగ్రహాలను కొని వారు తక్కువ కావడం పీఓపీ విగ్రహాలకు మార్కెట్ అధికంగా ఉండడంతో పీఓపీ విగ్రహాల తయారీలో మెలుకువలు నేర్చుకోవడానికి బొంబాయి వెళ్లి అనతి కాలంలోనే మంచి విగ్రహాల తయారీ కళాకారునిగా పేరును గాంచి కోరుట్ల పట్టణంలో పీఓపీ విగ్రహాల కేంద్రాన్ని ప్రారంభించి చిన్న చిన్న విగ్రహాల నుండి అతి భారీ విగ్రహాలను సైతం "శిల్పకళ ఆర్ట్స్" ద్వారా క్రయవిక్రయాలు చేస్తున్నారు. నిత్య, విద్యార్థి లాగా శిల్పాలను రూపుదిద్దుతూ ప్రారంభంలో చిన్న కేంద్రంగా ఉన్న"శిల్పకళ ఆర్ట్స్" శాకోప శాఖాలుగా విస్తరించి నేడు 16 నుండి 20 శిల్ప తయారీ కేంద్రాలతో వందలాది మంది శిల్పులకు శిక్షణనిస్తూ జీవనోపాధిని కలిగిస్తున్నారు. గణపతి నవరాత్రులకు నెల రోజుల ముందు నుండి వివిధ ప్రాంతాలకు విగ్రహాలను చేరవేస్తూ వాహనదారులకు దినసరి కూలీలకు లోడింగ్ చేసే వారికి అన్ లోడింగ్ చేసే వారికి ఉపాధిని కలిగిస్తూ నేటికీ కూడా సామాన్య శిల్ప కళాకారునిగా నిడంబరమైన జీవితం గడుపుతున్నారు. వేల సంఖ్యలలో గణపతి, దుర్గామాత విగ్రహాలు గంగాధర్ చేతిలో రూపుదిద్దు కొని నవరాత్రులలో నిత్య పూజలు అందుకోవడం విశేషం. విగ్రహాల తయారీ కొరకు ముడి సరుకులు రాజస్తాన్ కేరళ రాష్ట్రాల నుండి కొబ్బరి పీచు జిప్సం పదార్థాలను దిగుమతి చేసుకొని భారీ విగ్రహాలను తయారు చేస్తారు. స్వతహాగా పకృతి ప్రేమికుడు అయినా గంగాధర్ కు మట్టి విగ్రహాలు చేయడమంటేనే చాలా ఇష్టమని ప్రకృతిలో లభించే రంగులను వాడే వారమని నేటి సమాజానికి అనుగుణంగా విగ్రహాలు సర్వాంగ సుందరంగా కనిపించడానికి కళాకారులు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారని అన్నారు. కోరుట్లలో తయారైన విగ్రహాలను జగిత్యాల జిల్లా లోనే కాకుండా కరీంనగర్, నిజామాబాద్ అదిలాబాద్, వరంగల్, నిర్మల్, కామారెడ్డి, బోధన్, హైదరాబాద్, తెలంగాణ సరిహద్దు మహారాష్ట్ర ప్రాంతాలకు కోరుట్లలో తయారైన గణేష్, దుర్గామాత విగ్రహాలకు ఆదరణ ఎక్కువగా ఉంటుందని గణేష మండపాల నిర్వాహకులు స్వయంగా వచ్చి వారి అభిరుచికి నచ్చే విధంగా విగ్రహాలను తయారు చేయడం వలన సంవత్సరం మొత్తం విగ్రహాల తయారీలో నిమగ్నమై ఉంటామని అన్నారు. పీఓపీ విగ్రహాలే కాకుండా దేశ నాయకుల, దేవుళ్ళ విగ్రహాలను, సిమెంట్ తో తయారు చేస్తూ శిల్ప కళా కళాకారులకు పోలాపల్లి గంగాధర్ జీవనోపాధి కల్పిస్తున్నారు.



## ఎమ్మెల్సీ కోదండరాంకు సన్మానం

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** ఎమ్మెల్సీ కోదండరాంను ఆయన సన్నిహితుడు పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన మురళీకృష్ణ మంగళవారం ఆయన స్వగృహంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పెద్ద శంకరంపేట ప్రాంతంలోని సమస్యలను ఎమ్మెల్సీకి వివరించడంతోపాటు వాటిని పరిష్కరించాలని కోరారు. పెద్ద శంకరంపేటలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఆయన ఎమ్మెల్సీకి కోరారు. పెద్ద శంకరాపేట ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ కోదండరాం పేర్కొన్నారని మురళీకృష్ణ వివరించారు.

## పెద్ద శంకరంపేటలో స్వచ్ఛందంగా బంద్




**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** బంగ్లాదేశ్ లో హిందువుల పై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలకు నిరసనగా మంగళవారం పెద్ద శంకరంపేటలో స్వచ్ఛందంగా వ్యాపార, వాణిజ్య, ఇతర సంస్థలు బందు పాటించారు. హిందూ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు పెద్ద శంకరంపేటలో రామాలయం నుండి పట్టణ పురవీధుల గుండా యువకులు బంగ్లాదేశ్ లో ఉన్న హిందువులను రక్షించాలి అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్లో ఉన్న హిందువులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విట్టల్, హిందూ సంఘాల ఐక్యవేదిక బాధ్యులు సుభాష్ గౌడ్, రాజన్ గౌడ్, కందుకూరి రవీందర్, సీతారామారావు, రవి వర్మ, సతీష్ గౌడ్, శ్రావణ్, కృష్ణమూర్తి, వీరప్ప, ఆయా కుల సంఘాల బాధ్యులు, వాణిజ్య, వ్యాపార సంస్థల బాధ్యులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్తమ ఎంపీడీవో శ్రీకాంత్‌కు సన్మానం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ ఉత్తమ ఎంపీడీవో గా స్వాతంత్ర దినోత్సవం రోజున రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ చేతుల మీదుగా అవార్డు పొందడంతో కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండలానికి పేరు తీసుకొచ్చిన సందర్భంగా మండల ప్రజల తరపున శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానం చేశారు. మీ సేవలు మరింత విస్తృతం చేసి మండలన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ రాఘవ, ఏఈ విద్యాసాగర్, రాధా కృష్ణ, శివ, నందిష్, మహేష్, రాజశేఖర్, ఉదయ్, శ్రీనివాస్, కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానలో పండ్ల పంపిణీ

**విశ్వంభర, కడ్తాల్:** రాధ కృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జరుపుల దశరథ్ నాయక్ పుట్టిన రోజు సందర్భంగా కడ్తాల్ పట్టణం అగస్థ హాస్పిటల్ లో కంబాలపల్లి అంజి కడ్తాల్ బీఆర్ఎస్ మండల నాయకుల ఆధ్వర్యంలో డాక్టర్స్ తో కలిసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. దశరత్ నాయక్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహేష్ వార్డు సభ్యులు, కంబాల రమేష్, ఇర్షత్, మహేష్, కొప్పు కృష్ణ పాల్గొన్నారు.



# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



కామారెడ్డి పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

**విశ్వంభర, కామారెడ్డి/ ఆమనగల్ /భూపాలపల్లి/ మెట్‌పల్లి/ ఆత్మకూరు(ఎం)/రామన్నపేట:** నాడు స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం కామారెడ్డి పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిజాంసాగర్ రోడ్లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశానికి ఎన్నో ఎనలేని సేవలు అందించిన గొప్ప మహానాయకుడని కొనియాడారు. ఈరోజు దేశం ఇంత అభివృద్ధి చెందడానికి రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన ఐటీ టెక్నాలజీ, 18 సంవత్సరాలకి ఓటు హక్కును కల్పించి యువకులకు ఎంతో చేశాడని, పేద ప్రజల అభ్యున్నతి కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి సంక్షేమానికి దోహదపడ్డారు అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కైలా శ్రీనివాసరావు మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పండ్లరాజు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుడుగుల శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, కారంగుల అశోక్ రెడ్డి, కౌన్సిలర్లు ప్రసన్న వంశీ అంజత్, ఉడుదుండ రవి, మాజీ కౌన్సిలర్ జమీల్, బీసీ చైర్మన్ గుడ్ల శ్రీనివాస్, పంపర లక్ష్మణ్, రానా ప్రతాప్, రంగా రమేష్, యూసుఫ్, సిద్ధి, జమీల్ రాణా ప్రతాప్, కిరణ్, జమీల్, విక్రమ్, లెక్కపదిని గంగాధర్ పాల్గొన్నారు.

## ఆమనగల్ పట్టణ కేంద్రంలో..



ఆమనగల్ పట్టణ కేంద్రంలో..

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ సేవకు జీవితాన్ని ధారపోసి భరత మాత ఒడిలో తుదిశ్వాస వదిలిన దివంగత ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వస్పుల మానయ్య, బ్లాక్ ఉపాధ్యక్షులు బిచ్య నాయక్, ఖలీల్, ధనుంజయ, మైనార్టీ నాయకులు అబ్దుల్ ఖాదర్, బాబా, సురేష్, అలీం, సురేష్, శేఖర్ గౌడ్, శ్రీకాంత్, ఫరీద్, నాజర్, ఫిరోజ్, కాలే మల్లయ్య, యాదయ్య, విజయ్ నాయక్, మహేష్, మల్లేష్, రఫీ, హరీలాల్, చంద్రు, వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, అలీ పాల్గొన్నారు.

## తలకొండపల్లిలో..

మాజీ భారత ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా తలకొండపల్లి మండలం కేంద్రంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోకురి ప్రభాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, డీసీసీ జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, తాలూకా సోషల్ మీడియా ఇంచార్జ్ ఎండి అజీమ్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అరిఫ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ నరేష్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు రమేష్ నాయక్ గ్రామ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

## కడ్తాల్‌లో..

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలోని మండల పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి స్వర్గీయ రాజీవ్ గాంధీ ఫోటోకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మాట్లాడుతూ ప్రధానిగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాజీవ్ గాంధీ ఎనలేని కృషి చేశారని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన స్వర్గీయ రాజీవ్ గాంధీని స్మరించుకుంటూ ఆయన అడుగుజాడల్లో నడిచి తన ఆశలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిఖ్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, సేవాలాల్ రాష్ట్ర కార్యదర్శి లక్పతి నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్ సేవాదల్ అధ్యక్షులు గురిగల్ల లక్ష్మయ్య, మాజీ కో ఆప్షన్ సభ్యులు జాంగిర్ బాబా, బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, టౌన్ వర్కింగ్ అధ్యక్షుడు రాంచందర్ నాయక్, జిల్లా నాయకులు భాస్కర్ రెడ్డి, జాంగిర్ అలీ పాల్గొన్నారు.

## జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో..

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి నివాళులర్పించిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ తన చివరి ఊపిరి ఉన్నంత వరకు దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆ విశ్రాంతి ధీరుడు, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు, గాంధీ వారసత్వాన్ని పెంచుకొని దేశాన్ని ప్రగతి బాటలో నడిపిన నాయకుడు, సాంకేతిక విప్లవం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా పునాదులు వేసిన మేధావి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మరియు జిల్లా అధ్యక్షులు అయిత ప్రకాష్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు, టౌన్ అధ్యక్షులు దేవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ పాల్గొన్నారు.

## మెట్‌పల్లి పట్టణంలో..

మెట్‌పల్లి పట్టణంలోని డిపో చౌరస్తా వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ జువ్వాడి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతదేశంలో అనేక సంస్కరణలు చేశారని అందులో భాగంగా ఓటు హక్కు వినియోగం 18 సంవత్సరాల యువకులందరికీ కల్పించాలని, నేడు ప్రతి ఒక్కరు వినియోగిస్తున్న కంప్యూటర్ యుగాన్ని రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో దుబాటులోకి వచ్చేలా సంస్కరణ చేపట్టారని అన్నారు. రాజీవ్ గాంధీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత ఉన్నత స్థాయికి వెళ్లాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో..


యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందడి అనంత రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోతగాని మల్లేశం, తాజామాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్, పాక్స్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, నాయకులు కట్టెకోల హన్మంతు గౌడ్, తండ శ్రీశైలం గౌడ్, బత్తిని ఉప్పలయ్య గౌడ్ పాల్గొన్నారు.

## రామన్నపేటలో..

నకిరేకల్ నియోజకవర్గం రామన్నపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని, భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా రహదారి బంగ్లాలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు జినుకల ప్రభాకర్, గోదాస్ పృథ్వీరాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, మొహమ్మద్ నాసర్, జెల్ల వెంకటేశం, మొహమ్మద్ అక్రమ్, సాల్వేర్ లింగం, కోట సుధాకర్, గురుకు శివ, మొహమ్మద్ బషీర్, దౌల చొల్లేటి పాండురంగాచారి, కంచి మల్లేష్, లవణం సాయి, గోదాసు శీను, సైదులు, కే. రవీందర్ పాల్గొన్నారు.



రామన్నపేటలో..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో..



తలకొండపల్లిలో..



కడ్తాల్‌లో..



ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో..



# గొట్టిముక్కులలో వర్షా నికి కూలిన పెంకుటిళ్లు

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్ద శంకరంపేట మండల పరిధిలోని గొట్టిముక్కుల గ్రామంలో అలిగే కిష్టమ్మకు చెందిన పెంకుటిల్లు సోమవారం రాత్రి వర్షానికి కూలిపోయింది. ప్రస్తుతం వారికి నివాసం ఉండడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిష్టమ్మ కుటుంబ సభ్యులు కూలి పనులు చేస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నారు. వర్షానికి ఇల్లు కూలిపోవడంతో వారికి ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రుణమాఫీ కాని రైతుల దరఖాస్తుల స్వీకరణ

**విశ్వంభర, రామన్నపేట:** రైతులు స్వల్పకాలిక రుణాలు తీసుకుని, రుణమాఫీ కాని రైతుల దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం కొరకు రామన్నపేట మండలంలో మండల నోడల్ అధికారిగా ఎం.డి. అజాజ్ అలీ ఖాన్, యాదాద్రి భువనగిరి జిల్లా నోడల్ అధికారిగా రాజేష్ (మొబైల్ నెం.7288878411) లను నియమించడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ స్వల్పకాలిక రుణాలు మాఫీ కానట్లయితే వారి యొక్క బ్యాంక్ లోన్ ఎకౌంటు నెంబర్, పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలను అప్లికేషన్ తో జత చేసి సంబంధిత మండల వ్యవసాయ అధికారికి లేదా నోడల్ అధికారికి ఇవ్వవలసిందిగా కోరారు. రెండు లక్షలు రుణము తీసుకున్నట్లయితే రెండు లక్షల కంటే ఎక్కువ ఉన్న పైకము(డబ్బులు) బ్యాంకులో కట్టవలసిందిగా తెలియజేశారు. 09 డిశంబర్ 2023 తేదీ నాటికి రెండు లక్షల కంటే ఎక్కువ ఉన్న అమౌంట్ బ్యాంకులో జమ చేసినట్లయితే ప్రభుత్వం మాఫీ చేసిన రెండు లక్షల రూపాయలు మీ అకౌంట్లో జమ చేయబడుతుందని తెలిపారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, నారాయణపూర్:** సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రానికి చెందిన బచ్చనగోని పెద్దమ్మ అనారోగ్యం తో మృతి చెందారు. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న స్ఫూర్తి విద్యా సంస్థల చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త రాపర్తి సురేష్ కుమార్ గౌడ్ వారి కుటుంబానికి తక్షణ సాయంగా 5,000 వేల రూపాయలు అందచేశారు. ఈ కార్యక్రమంలో రాసాల వెంకటేష్, తెలంగాణా బిక్షం, ఉప్పల ఆంజనేయులు, బొమ్మగోని రమేష్ గౌడ్, చిలివేరు బుగ్గరాములు, బొమ్మని రఘు గౌడ్, చిలివేరు శంకర్, వడ్డేపల్లి రాములు, పేరే రమేష్ పాల్గొన్నారు.

# బాటను కబ్జా చేసిన బీఆర్ఎస్ నాయకులు



**విశ్వంభర, చివ్వేంల:** ఏండ్ల తరబడి ఉన్న రైతులకు చెందిన వ్యవసాయ బాట బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేశారు. ఇదేమిటని అడిగితే రైతులపై దాడికి పాల్పడ్డారు. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే పట్టించుకోకపోవడంతో మంగళవారం కలెక్టర్ ను ఆశ్రయించి కలెక్టరేట్ లో బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. రైతులు వివరాల ప్రకారం పెన్ పహాడ్ మండలం అనంతారం గ్రామ శివారులోని సర్వే నెంబర్ 104, 105, 114, 129, 115, 116, 127, 130 అనుకోని వెళ్తున్న ఏండ్ల తరబడి ఉన్న వ్యవసాయ దారిని ఉపయోగించుకొని వ్యవసాయం చేస్తుండగా సర్వే నెంబర్ లోని 114, 115లో బీఆర్ఎస్ కు చెందిన ఒంటెద్దు రాఘవ రెడ్డి, చిట్టెపు నారాయణరెడ్డి, కొడిదల రాంబాబు, జనార్దన్ రెడ్డి, రైతులకు దారి లేదని దారిని మూసివేసే ప్రయత్నం చేయగా రైతులందరు కలిసి అడ్డుకున్నారు. రెండేళ్ల క్రితం టీ పాన్ కట్టి సర్వేయర్ తో సర్వే చేసి హద్దు రాళ్లు పాతగా రెండేళ్ల తర్వాత వచ్చి రైతులు పెట్టిన హద్దు రాళ్లను ఎవరు లేని సమయంలో జేసీబీ సహాయంతో బీఆర్ఎస్ నాయకులు దారిని మూసివేశారు. బాట తొలగించిన విషయం అడిగితే తిరిగి తమపైనే దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఫేక్ 13 బీ సృష్టించి పట్టా చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. దీనితో రైతులను భూమి పైకి వెళ్ళనివ్వకుండా అడ్డుకోవడంతో భూములను పడవు పెట్టాల్సిన దుస్థితి ఏర్పటిందని వాపోయారు. దీనిపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఏండ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు ఆధారమైన బాటను గాతులు పెట్టి రైతులను ఇబ్బందులు పెడుతున్న బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### పర్యావరణ పరిరక్షణకు

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎన్ హెచ్ ఏ ఐ తెలంగాణ హైదరాబాద్ రీజినల్ అధికారి షేక్ రజాక్ అన్నారు.

మంగళవారం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్ జమ్మికుంట వద్ద ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పెద్దలు ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలన్నారు. ఎన్ హెచ్ ఏ ఐ సంస్థ మొక్కలు నాటడం తో పాటు సంరక్షించడంలో కూడా ఎప్పుడు ముందుంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీ మధుసూదన్ రావు, గజ్వేల్ జాయింట్ అడ్మిన్నర్ రాజారావు, మహమ్మద్ రెహమాన్ రవిశంకర్, క్యూబ్ హైవేస్ రీజనల్ హెడ్ వసుంధర, శంకరంపేట్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ హెడ్ ప్రభాకర్ రెడ్డి, ఐఎంఎస్ మేనేజర్ కాజా మొయినుద్దీన్, నిజాంపేట్ జిల్లా పరిషత్ విద్యార్థులు, ఎన్ హెచ్ ఏ ఐ ప్రాజెక్టు శంకరంపేట సిబ్బంది పాల్గొన్నారు.

# దోషులను బహిరంగంగా ఉరి తీయాలి




**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్ పల్లి పట్టణం శాస్త్రి చౌరస్తా వద్ద వాసవి కిరాణం జనరల్ స్టోర్ అసోసియేషన్ మెట్ పల్లి కన్జ్యూమర్స్ ప్రోడక్టు డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలకత్తాలో డ్యూటీలో ఉన్న వైద్య విద్యార్థినిపై జరిగిన పైశాచిక అఘాయిత్యంపై కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. భూమి పైన ప్రాణం ఉన్న దేవుడు డాక్టర్ అని అలాంటి డాక్టర్ పై అఘాయిత్యానికి పాల్పడిన వారిని వెంటనే ఉరిశిక్ష వేయాలని, లేదంటే బయట దేశాల్లో లాగా షూట్ అండ్ సైట్ లేదా బహిరంగంగా ఉరి తీయాలని అనారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, దొంతుల సాయి కిరణ్, చాద సురేష్, దొంతుల సంతోష్, పంపట్టి ఆనందు, కోటగిరి సంజయ్ కుమార్, దినేష్ సింగ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# నిరుపేదలకు వరం సీఎం సహాయ నిధి

**విశ్వంభర, నారాయణపూర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల సర్వేల్ గ్రామనికి చెందిన బూస ఝాన్సీ, శ్రీనివాస్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సిఫార్సు చేయగా 60,000 వేల రూపాయల చెక్కును సర్వేల్ గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ షబ్బీర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం గుత్త శేఖర్ రెడ్డి, మాజీ చైర్మన్ వెల్లంకి చంద్రయ్య గౌడ్, మాజీ సర్పంచ్ మానిపాటి సతీష్ కుమార్, గుజ్జ సింగిల్ విండో డైరెక్టర్ పగిళ్ల యాదయ్య, వేనుముల శంకర్ రెడ్డి, మాజీ వార్డ్ సభ్యులు చిలకరాజు రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కోశాధికారి వీరమళ్ళ పెంటయ్య, సర్వేల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సుక్క స్వామి, ప్రధాన కార్యదర్శి గుండె రాజేష్, చర్ల మహేష్, కార్యదర్శి సుక్క నర్సింహా, వెల్లంకి శ్రీశైలం, బోయ మధు, నలపరాజు వెంకయ్య, వరికుప్పల యాదగిరి, బాజ అంజయ్య, షేక్ జానీ పాల్గొన్నారు.

# అన్నదాతల నిరసన

**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్ పల్లి పట్టణం శాస్త్రి చౌరస్తా వద్ద రుణమాఫీ పై రైతులు నిరసనలు ధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతన్నలు రోడ్లపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం పూటకో మాటతో రైతులను మోసం చేస్తుందని బేషరతుగా రైతులకు ఇస్తానన్న రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడడానికి రైతులను అన్ని విధాల ఆదుకుంటామని చెప్పి గద్దెనెక్కి 9 నెలలైనా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని కేవలం 20 నుండి 30 శాతం మంది రైతులకు రుణమాఫీ చేసి 70 శాతం మంది రైతుల జీవితాలతో ఆటలాడుకుంటుందని అన్నారు. సుమారు మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ అయినది ఒకానొక సందర్భంలో కలెక్టర్ రావాలని రైతులు డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులు పోలీస్ అధికారులు ఎంత నచ్చచెప్పిన రైతులు వినకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన రైతులు భారీ సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు. మెట్ పల్లి టౌన్ సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో మెట్పల్లి టౌన్ ఎస్సై, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కథలాపూర్ పోలీస్ స్టేషన్ లకు చెందిన పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.



# రాజీవ్ గాంధీకి ఘన నివాళి


ఎల్బీనగర్‌లో..


కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో..

**విశ్వంభర, ఎల్బీనగర్/కుత్బుల్లాపూర్/ఘట్కేసర్:** భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్బీనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ మల్ రెడ్డి రామ్ రెడ్డి, కార్పొరేటర్లు శ్రీ రాగుల వెంకటేశ్వర రెడ్డి గారు, శ్రీ దర్పల్లి రాజశేఖర్ రెడ్డితో కలిసి స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నివాళులు అర్పించిన వారిలో గుర్రం శ్రీనివాస రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, పన్యాల జైపాల్ రెడ్డి, భీమిడి రామకృష్ణా రెడ్డి, కళ్ళెం సుజాత రెడ్డి, జోగు రాములు, యం డి ముజీబ్, యూసఫ్, షఫి జహంగీర్ బాబు గౌడ్, అరుణ్ అంబేద్కర్, బాను చందర్, ఆశోక్ రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకటేష్, శ్యామ్, అజయ్, ప్రవీణ్ తదితరులున్నారు.

### జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో..

టీపీసీసీ ప్రతినిధి కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జి జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ రింగ్గు రోడ్డులో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతదేశాన్నిఅనేక రంగాల్లో అభివృద్ధి చేసిన ధృవతార అని, సాంకేతిక విప్లవం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా పునాదులు వేసిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు, టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ కే. గాంధీ నాయక్ మాట్లాడుతూ దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసి భారీ విదేశీ పెట్టుబడులను ఆకర్షించిన మార్గదర్శి దివంగనేత భారతరత్న రాజీవ్ గాంధీ అని అన్నారు. మహిళా నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు, యువజన నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆర్కే పురంలో...

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ప్రధాన కూడలి రాజీవ్ గాంధీ చౌరస్తాలో భారత రత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి హాజరై రాజీవ్ గాంధీ విగ్రహాన్నికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. భారత దేశాన్ని ఆధునిక కంప్యూటర్ యుగానికి మలుపు తిప్పిన గొప్ప నాయకుడుగా రాజీవ్ గాంధీ పేరొందినారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, రాజు నాయక్, పెద్దవూర సైదులు, అల్లెటి కిరణ్ కుమార్, దుబ్బాక శేఖర్, ముప్పిడి లింగస్వామి గౌడ్, అక్బర్, బొడ్డుపల్లి మహేందర్, గోదా కళ్యాణ్ యాదవ్, ప్రేమ్ నాయక్, జహంగీర్, వంగాల శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో..

గాజులరామారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని, స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని శ్రీ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా రాజీవ్ గాంధీ చేసిన సేవలను ఆయన కొనియాడారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు తీసుకొచ్చేందుకు ఆయన ఎంతగానో కృషి చేసారని, వయోజన ఓటు హక్కును 21 ఏండ్ల నుండి 18 ఎండ్లకి తగ్గించిన ఘనత శ్రీ రాజీవ్ గాంధీ గారిదని అన్నారు. టెలికాం, కంప్యూటరైజేషన్ రంగాలలో రాజీవ్ గాంధీ విశేష కృషి చేసారని, సాంకేతిక రంగ అభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. గౌరవ ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి పాలన రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగానే ఉందని, ఆ మహనీయుని ఆశయాల సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, నిజాంపేట్ కార్పొరేటర్ ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు లాయక్, పండరి, బేకు శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్, బుచ్చిరెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, ఓరుగంటి కృష్ణా గౌడ్ పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘట్కేసర్‌లో...

మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపల్ రాజీవ్ గృహకల్ప కాలనీలో ఏడో వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుకర్ రెడ్డి ఉపాధ్యక్షుడు దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, పోచారం మున్సిపల్ 10వ వార్డ్ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్, పోచారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్, పోచారం మున్సిపల్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు వరికుప్పల వెంకటేష్, ఉస్కమూరి వెంకటేష్, గంధం రమేష్ గౌడ్, మల్లికార్జున్ రెడ్డి, సారంగండ్ల రమేష్ కుమార్, రవి, వినయ్, వరికుప్పల అనిత వెంకటేష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు శశికళ పావని రేణుక సురేష్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


ఘట్కేసర్‌లో...


జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో..


ఆర్కే పురంలో...



## ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలి

**విశ్వంభర, ఎల్బీనగర్:** ప్రజలకు అసౌకర్యం కలుగకుండా అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఫేజ్ 2 లోతట్టు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షానికి రోడ్లపై చెత్త, చెదారం పేరుకుపోయిందని వెంటనే తొలగించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భారీ వర్షాలు కురుస్తాయని ప్రభుత్వం హెచ్చరించడంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అవసరం ఉంటేనే బయటికి రావాలని అన్నారు.

## వాటర్ లైన్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, కాచిగూడ:** కాచిగూడ మెయిన్ రోడ్ లో జరుగుతున్న స్ట్రామ్ వాటర్ లేన్ పనులను అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం జీహెచ్ఎంసీ వాటర్ వర్క్స్ అధికారాలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు సమన్వయంగా పనిచేసి ఈ పనులను అతి త్వరలో పూర్తి చేయాలి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు డీజీఎం కృష్ణ, ఏఈ భావన, జీహెచ్ఎంసీ అధికారులు డీఈఈ ప్రవీణ్, ఏఈ విశ్వ తేజ, డివిజన్ ప్రెసిడెంట్ భీష్మ, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## భారీ చెట్టు విరిగి పడి ఆటో ధ్వంసం



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్కే పురం డివిజన్ మార్గదర్శి కాలనీలో వర్షం బీభత్సం సృష్టించింది. తీవ్రమైన గాలుల ధాటికి పెద్ద వృక్షం నేలకొరిగింది. వృక్షం నేలకొరడంతో ఆటోపై పడి ఆటో నుజ్జునుజ్జయింది. పాణాపాయం తప్పడంతో ఆందరు ఊపిరి పీల్చుకున్నారు. గమనించిన రంగారెడ్డి జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ జాహంగిర్ అధికారులకు తెలియజేశారు. అధికారులు వెంటనే స్పందించి చెట్టుని తొలగించారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**విశ్వంభర, హైదరాబాద్:** రాజీవ్ గాంధీ 80వ జయంతిని పురస్కరించుకొని గాంధీ భవన్ లో తెలంగాణ ఫిషరీస్ కోఆపరేటివ్ సోసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ తెలంగాణ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, సీనియర్ కాంగ్రెస్ నేత వి. హన్మంత్ రావు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిణి రెడ్డిలు పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్ లు పంపిణీ చేశారు.

## ప్రభుత్వ పాఠశాలపై ప్రజాప్రతినిధుల కన్ను

**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో కొన్ని సంవత్సరాలుగా, ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన పాఠశాల శిధిలావస్థకు చేరుకున్న భవనాన్ని, గత ప్రభుత్వంలో పిల్లలను దృష్టిలో పెట్టుకొని ఆ గ్రామకంఠ భవనాన్ని కూల్చి వేశారు. కూల్చి వేసిన కాళీ ప్రదేశంపై ప్రజాప్రతినిధుల కన్ను పడింది. చైర్మన్ ల గడువు ఇంకా ఐదు నెలలు ఉండడంతో ఎలాగైనా కబ్జా చేయాలని అనుకున్నారో ఏమో ఆ ప్రదేశంలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, భవనాన్ని నిర్మిస్తుండగా, పోచారం మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్, వారిని అడ్డుకొన్నారు. ప్రభుత్వ అనుమతులతోనే భవనాన్ని నిర్మిస్తున్నామని పోచారం మున్సిపల్ చైర్మన్ చెప్పడంతో కౌన్సిలర్ వెంకటేష్ గౌడ్, మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ కు రాతపూర్వకంగా ఫిర్యదు చేశారు. ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పడంతో నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయురాలు దొండి బాయ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా భవన నిర్మాణం నిలిపివేయడం జరిగింది. స్కూల్ ఆవరణలో కూడా కబ్జాలకు పాల్పడుతున్న ప్రజాప్రతినిధులపై, అధికారులు కఠినమైన చర్యలు తీసుకోని, పిల్లలకు ఉపయోగపడే విధంగా నూతన పాఠశాలను నిర్మించి ఆ స్థలాన్ని కబ్జాలకు గురికాకుండా కాపాడవలిసిందిగా రెవెన్యూ అధికారులను ప్రజలు కోరారు.




## డాక్టర్‌పై అత్యాచారం, హత్య.. దోషులను కఠినంగా శిక్షించాలి



**విశ్వంభర, బషీర్ బాగ్:** యువ పీజీ డాక్టర్ పై జరిగిన అత్యాచారం, హత్య ఘటన జుగుప్సాకరమైనదని, సభ్య సమాజం తలదించుకునే సంఘటన అని డాక్టర్ జీ.వీ. వెన్నెల గద్దర్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీని, దేవతగా, భూమాతగా, సరస్వతిగా, లక్ష్మిదేవిగా, కాళీమాతగా, కొలిచే భారతదేశంలో ఈ సంఘటన మనసును కలచివేసి, ఎంతో వేదనకు గురిచేసిందన్నారు. ఈ సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సనాతన ధర్మం గురించి పదే పదే వల్లించే సో కాల్డ్ సనాతన వాదులు సమాజం ఎటుపోతుందో, ఆలోచించుకోవాలన్నారు. గతంలో జరిగిన సంఘటనలో ఎదురు కాల్పులలో హంతకులు మరణించినా, మరణశిక్షలు విధించినా, ఫోక్స్ చట్టం తీసుకొచ్చినా ఇటువంటి సంఘటనలు పునరావృతం కావటం శోచనీయం అన్నారు. ముఖ్యంగా తల్లి తండ్రులు, పిల్లలను చిన్నతనం నుండే సోదర సోదరీ ప్రేమానురాగాల ప్రాముఖ్యతను వివరిస్తూ, చదువుతోపాటు సామాజిక భాధ్యతను నేర్పాలన్నారు. ఆడపిల్లలకు, యుద్ధ విద్యలో తర్ఫీదు ఇప్పించాలని, అలాగే మగపిల్లలకు, స్త్రీల పట్ల ప్రేమానురాగాలు పంచేటట్లుగా తయారుచేయాలని వెన్నెల గద్దర్ పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో స్త్రీని విలాస వస్తువుగా, కోరికలు తీర్చుకునే వస్తువుగా చూసే మనస్తత్వం మగవారి మెదడు నుండి నీచ భావజాలాన్ని పారద్రోలేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అలాగే కలకత్తా లో పీజీ డాక్టర్ పై దాష్టీకం చేసిన వారిపై కఠినాతీ కఠిన చర్యలు తీసుకొని, ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునారావృతం కకుండా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డాక్టర్ జీ.వీ. వెన్నెల గద్దర్ విజ్ఞప్తి చేశారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలోని టీఎస్ యుటీఎఫ్ భవన్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థలలో బీసీలకు జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లాలని మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, బీసీ సంఘం నాయకులు కొమ్ము శ్రీనివాస యాదవ్, రాజేందర్ లు డిమాండ్ చేశారు. బీసీలంతా ఐక్యంగా ఉండి పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచి లాల్కోట జంగయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు లాలు యాదవ్, చారగొండ మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య యాదవ్, బీసీ సంఘం నాయకులు గంగాధర్, రూక్కయ్య యాదవ్, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోళ్ల రాఘవేందర్, రజక సంఘం నాయకులు సురేందర్, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## బాలికపై టాయిలెట్‌లో దారుణం

### 7గంటలపాటు రైల్వేట్రాక్‌లపై నిరసనలు

**థానే:** అభం శుభం తెలియని మూడు, నాలుగేళ్ల వయసున్నఇద్దరు చిన్నారులపై టాయిలెట్ లో ఓ స్వీపర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మహారాష్ట్రను కుదిపేస్తోంది. థానే జిల్లాలోని బద్లాపూర్ లో ఓ స్కూల్లో జరిగిన ఈ అమానవీయ ఘటనను ఖండిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. చిన్నారులపై దుశ్చర్యకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ దాదాపు ఏడు గంటలుగా బద్లాపూర్ రైల్వే స్టేషన్లో పట్టాలపై బైఠాయించి రైళ్ల రాకపోకల్ని అడ్డుకొంటున్నారు. రైళ్ల రాకపోకల్ని అడ్డుకోవద్దంటూ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సైతం లెక్క చేయకుండా తమ నిరసనలు కొనసాగిస్తున్నారు.

**హ్యాంగ్.. హ్యాంగ్.. నినాదాలతో హోరు**

మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ ఈ మధ్యాహ్నం నిరసనకారుల్ని శాంతింపజేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బాధిత బాలికలకు న్యాయం చేయాలని, అరెస్టు చేసిన నిందితుడిని ఉరితీయాల్సిందేనంటూ ఆందోళనకారులు నినదించారు. రైల్వే ట్రాక్లను ఖాళీ చేయాలంటూ మంత్రి విజ్ఞప్తి చేసినా.. 'హ్యాంగ్.. హ్యాంగ్' అంటూ నినాదాలతో ఆ పరిసరాలను హోరెత్తించారు. డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్కు సన్నిహితుడైన మంత్రి గిరీశ్ మహాజన్.. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదుల్ని తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారుల్ని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిందని.. నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆరు గంటలకు పైగా కొనసాగుతోన్న రైల్ రోకోతో పలు లోకల్ రైళ్లు రద్దవ్వడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిరసనకారుల డిమాండ్లకనుగుణంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. అయినా ఆందోళనకారులు నిరసనల్ని విరమించలేదు.

**మహిళా ఐపీఎస్‌తో దర్యాప్తు.. : దేవేంద్ర ఫడణవీస్**

మరోవైపు, ఈ ఘటనపై డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ఇద్దరు చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటనను మహిళా ఐపీఎస్ నేతృత్వంలో విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఐజీ ర్యాంకు కలిగిన ఐపీఎస్ అధికారిణి ఆర్తి సింగ్ను దర్యాప్తు అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఈ ఘటనపై వీలైనంత త్వరగా విచారించాలని, ఛార్జిషీట్ను దాఖలు చేయాలని, విచారణ కోసం ఫాస్ట్రాక్ కోర్టు ముందు ఈ అంశాన్ని ఉంచాలనుకుంటున్నట్లు ఫడణవీస్ తెలిపారు. ఇలాంటి అనాగరిక, అమానవీయ చర్యకు తక్షణమే శిక్ష పడేలా పోలీసులు పూర్తిస్థాయిలో కృషిచేస్తున్నారని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఈ ఘటనను రాజకీయం చేసేందుకు సుప్రియా సూలే, ఉద్ధవ్ ఠాక్రే వంటివారు చూస్తున్నారని దేవేంద్ర ఫడణవీస్ ఆరోపించారు. ఇలాంటి ఘటనలతో రాజకీయ లబ్ధి పొందాలని విపక్షాలు చూడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. విపక్షాలకు ఎలాంటి సానుభూతి లేదన్నారు. ఠాక్రే ఒక రాజనీతిజ్ఞుడిలా ప్రవర్తించాలి తప్ప ఇలాంటి సున్నితమైన అంశాలను రాజకీయం చేయరాదని హితవు పలికారు.

## హైడ్రా ఆలోచన బాగున్నా.. ఆచరణలో సామాన్యులకే ఎక్కువగా నష్టం

**- బీజేపీ ఎమ్మెల్యే కాటెపల్లి ధ్వజం**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** హైడ్రా ఆలోచన బాగున్నా.. ఆచరణలో అది సామాన్యులకు ఎక్కువగా నష్టం చేసేదిగా ఉందని బీజేపీ ఎమ్మెల్యే కాటెపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు.

నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాన్యుల బతుకులు కూల్చడం తప్ప హైడ్రా కొత్తగా సాదించిందేమీ లేదని ఘాటుగా విమర్శించారు. హైడ్రాపై మరో తెలంగాణ ఉద్యమం మొదలు పెడతామని వెంకటరమణారెడ్డి తెలిపారు. గతంలో బఫర్ జోన్ లలో అనుమతులు ఇచ్చిన అదికారులను వదిలేసి.. సామాన్యులపై పడటం ప్రజాపాలన అవుతుందా? అని ప్రశ్నించారు. "భూమి కొనుగోలు చేసినప్పుడు చాలా మందికి అది ఏ పరిధిలోనిది అనేది తెలియదని, హెచ్ఎండీఏ పరిధిలో భూమి ఉందా? అనుమతులున్నాయా! లోన్ వస్తుందా? అనేది మాత్రమే ప్రజలు చూస్తారన్నారు. రియల్టర్లకు అనుమతులు ఎవరిచ్చారు? లేఔట్ వేసేందుకు పర్మిషన్లు ఇచ్చిందెవరన్నది ప్రజలకు తెలియవన్నారు. ప్రభుత్వ అనుమతులతోనే ప్రజలు గతంలో భూములు, ప్లాట్లు కొన్నారన్నారు. బఫర్ జోన్లు, చెరువులు, శిఖం భూములని తెలియకుండా, ప్రభుత్వ అనుమతులు లేకుండానే రియల్టర్ల చేతుల్లోకి వెళ్లాయా? ప్రభుత్వానికి తెలియకుండానే ఎఫ్‌టీఎల్ ప్రకారం డాక్యుమెంట్లు ఎలా తయారయ్యాయి? అనుమతి లేకుండానే లేఔట్లు ఎలా అయ్యాయి? ఇళ్ల నిర్మాణంతో పాటు ప్లాట్లు ఎలా అమ్ముడయ్యాయి? దానికి బాధ్యులెవరు? అనుమతి ఇచ్చిన జీహెచ్ఎంసీది తప్పా? కమిషనర్లది తప్పా? బఫర్ జోన్లు, చెరువులు, శిఖం భూములని తెలిసి అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. బాధ్యులైన అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌లు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు . చెరువులు, బఫర్ జోన్లు, శిఖం భూములంటూ ఏ ప్రాతిపదికన ఇళ్లు కూలుస్తున్నారని, ఇష్టా రీతిన డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు ఉండవా? అని ప్రశ్నించారు.

# ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి

- నష్టాల నుంచి విద్యుత్ సంస్థలను గట్టెక్కించే బాధ్యత మనందరిది
- ఎస్పీడీసీఎల్ అధికారులు, ఉద్యోగులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** రాష్ట్ర సంపదను ప్రజలకు చేరవేసే క్రమంలో ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేనప్పటికీ ఉద్యోగుల ప్రయోజనం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చడానికి ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం పదోన్నతులు కల్పించిందని వెల్లడించారు. నష్టాల్లో ఉన్న విద్యుత్ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి ముందు ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు ఈ సంస్థలను అందించాల్సిన కర్తవ్యం కూడా మన పైన ఉందని ఉద్బోధించారు. మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ను మర్యాద పూర్వకంగా కలిసి ఎస్పీడీసీఎల్ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత ఎస్పీడీసీఎల్ సంస్థలో ఒకే సారి 2320 మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టి ఆర్ వి కె ఎస్, సిఐటియు, టీఈఈఏ, పి ఈ ఏ, డి ఏ, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్, ఎస్పీడీసీఎల్ అకౌంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, 327 ఎంప్లాయిస్ యూనియన్, 1104 ఎంప్లాయిస్ యూనియన్ సంబంధించిన ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్చం అందించి శాలువా కప్పి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల విద్యుత్ రంగ సంస్థల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని వాటిని తిరిగి లాభాల్లోకి తీసుకురావడానికి మనందరం సమిష్టిగా కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రూపొందించే నిర్దిష్టమైన ప్రణాళికలను క్షేత్రస్థాయిలో ఉద్యోగులు సంపూర్ణంగా అమలు చేయడం వలనే కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. ప్రతి ఉత్పత్తికి కరెంట్ అవసరమని ఉత్పత్తి పెరగడం వలన ఆదాయం పెరుగుతుందని తద్వారా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందనే విషయాన్ని విద్యుత్ ఉద్యోగులు మర్చిపోవద్దన్నారు. మనిషి బ్రతకడానికి ఆక్సిజన్ ఎంత అవసరమో రాష్ట్ర అభివృద్ధికి రెప్పపాటు కూడా కరెంటు పోకుండా ఉండడం అంతే అవసరం అన్న విషయాన్ని గమనంలో పెట్టుకొని వినియోగదారులకు మరింత మెరుగుగా, నాణ్యమైన సేవలను అందించాలని దిశా నిర్దేశం చేశారు. ఉద్యోగులు అందరూ ఈ రాష్ట్రం నాది, ఈ ప్రభుత్వం నాది, ఈ రాష్ట్ర ప్రజలు నా వాళ్ళు, వాళ్ల సేవ కోసమే నేను నియమించబడ్డానని భావించాలని సూచించారు. మీ కష్టసుఖాల్లో ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుంది, మీరు ప్రజల కష్టసుఖాల్లో భాగం కావాలని సూచించారు. అధికారులు, ఉద్యోగులు పెట్టే ప్రతి సంతకం, తీసుకునే ప్రతి నిర్ణయం, చేసే ప్రతి పని సామాన్యునికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. మీ పనిలో మానవీయ కోణం ఉండాలని సూచించారు. భవిష్యత్తులోనూ ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం ఇదే తరహా ప్రోత్సాహాన్ని కొనసాగిస్తుందని భరోసా ఇచ్చారు. సాధ్యమైనంత మేరకు ఉద్యోగుల సమస్యలన్నింటిని పరిష్కరించడానికి మా మంత్రిమండలి కృషి చేస్తుందని చెప్పారు. పదోన్నతులు పొందిన అధికారులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. మీ పిల్లలు బాగా చదువుకోవాలని సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ట్రాన్స్కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఆయా ఉద్యోగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ - కటక్ మధ్య ఎనిమిది ప్రత్యేక రైళ్లు..

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా మధ్య ప్రయాణికులకు సర్వీసులందించేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక చొరవ తీసుకొంది . ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే తెలుగు రాష్ట్రాలు, ఒడిశా మధ్య ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ - కటక్ మధ్య రాకపోకల కోసం ఎనిమిది ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 18వరకు ప్రతి మంగళ, బుధవారాల్లో ఈ రైళ్లు నడుస్తాయని పేర్కొంది. హైదరాబాద్ - కటక్ (07165) రైలు మంగళవారం, కటక్ -హైదరాబాద్ (07166) రైలు బుధవారం సర్వీసులందించనున్నాయి. సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బెర్హంపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్ స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. అయితే, ఈ రైళ్లు బయల్దేరే సమయాలను మాత్రం ఇంకా వెల్లడించలేదు.

# కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా..

**ఆగస్టు 27వ తేదీకి వాయిదా వేసిన సుప్రీం కోర్టు ధర్మాసనం..**

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** మద్యం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవితకు మరోసారి నిరాశే ఎదురైంది. అనారోగ్యం కారణంగా ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో కవిత బెయిల్‌పై సీబీఐ కౌంటర్ దాఖలు చేసినా.. ఈడీ చేయలేదు. కౌంటర్ దాఖలు చేసేందుకు తమకు సమయం ఇవ్వాలని వారు ధర్మాసనాన్ని కోరగా, ఈడీ అభ్యర్థనపై కౌంటర్ దాఖలు చేసేందుకు సుప్రీంకోర్టు సమయం ఇచ్చింది. గురువారంలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశించింది. శుక్రవారం లోపు కవిత తరఫున న్యాయవాది రిజాయిండర్ దాఖలు చేయాలని ఆదేశించింది. వచ్చే మంగళవారానికి ఆగస్ట్ 27 కు సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ వాయిదా వేసింది. ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను మార్చి 15న హైదరాబాద్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసి, మార్చి 16న ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టులో హాజరుపరచగా.. కోర్టు అనుమతితో కవితను ఈడీ కస్టడీలోకి తీసుకున్న సంగతి తెలిసిందే.



# మహా నగరం.. అతలా కుతలం



(మొదటి పేజీ తరువాయి)

ఓ ద్విచక్ర వాహనదారుడు వరదలో కొట్టుకుపోయాడు. వరదలో కొట్టుకుపోయిన మరో కూలీ మృతి చెందాడు. కాగా, ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి ఎల్బీ స్టేడియం ప్రహరీ గోడ కూలిపోయింది. బషీర్ బాగ్ సీసీఎస్ పాత కార్యాలయానికి అనుకోని ఉన్న గోడ కూలడంతో అక్కడే పార్క్ చేసిన పోలీస్ వాహనాలు ధ్వంసమయ్యాయి. గోడ కూలే సమయంలో ఎవరూ లేకపోవడం పెను ప్రమాదం తప్పింది.బలమైన ఈదురుగాలతో వర్షం కురిసిన కురిసిన కారణంగా టోలిచౌకిలో వందల ఏళ్ళ వయసున్న మహావృక్షం నేలకొరిగింది . ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో స్థానికులు అందించిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన డీఆర్ఎఫ్ బృందం ఆ మహా వృక్షాన్ని కట్ చేసి తొలగించారు. కాగా, పంజాగుట్టలోని అపార్టుమెంట్ సుఖ్ నివాస్ అపార్టుమెంటు వద్ద పిడుగుపడింది.. షెడ్డుపై పిడుగు పడి కారు ధ్వంసమయింది. దీంతోపాటు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మరోవైపు జీహెచ్ఎంసీ పరిధిలోని విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. భారీ వర్షం కారణంగా స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల డీఈవోలు ఆదేశాలు జారీచేశారు.

**యాదాద్రి భువనగిరిలో అత్యధికం..**

అత్యధికంగా యాదాద్రి భువనగిరిలో 170.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో అత్యధికంగా ఖైరతాబాద్‌లో 126.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇటీవలి భారీ వర్షపాతం తీవ్రమైన వేడి నుండి అవసరమైన ఉపశమనాన్ని అందించినప్పటికీ, ఇది ప్రజలకు సమస్యలను కూడా తెచ్చింది.హైదరాబాద్ అంతటా వరద నీరు ఎక్కడికక్కడ నిలిచి పోవడం ప్రధాన సమస్యగా మారింది, అనేక లోతట్టు ప్రాంతాలలో రోడ్లు మునిగిపోయాయి. ట్రాఫిక్ అంతరాయం, ప్రయాణికుల అసౌకర్యానికి దారితీసింది.

**అప్రమత్తమైన జీహెచ్ ఎంసీ**

హైదరాబాద్ మహానగరానికి మరో నాలుగు రోజుల పాటు వర్ష సూచన ఉండడంతో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. ఇప్పటికే క్షేత్ర స్థాయి సిబ్బందిని కూడా అధికారులు అప్రమత్తం చేశారు. మంగళవారం ఉదయం దంచి కొట్టిన వర్షం కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం ఏర్పడింది. బలమైన ఈదురుగాలతో వర్షం కురిసిన కురిసిన కారణంగా టోలిచౌకిలో వందల ఏళ్ళ వయసున్న మహావృక్షం నేలకొరిగింది . ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో స్థానికులు అందించిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన డీఆర్ఎఫ్ బృందం ఆ మహా వృక్షాన్ని కట్ చేసి తొలగించారు. వర్షాలతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా రోడ్డుపై నిలిచిన నీటిని ఎప్పటి కప్పుడు తొలగించేందుకు ఈ బృందాలు పని చేస్తాయని అధికారులు తెలిపారు. 238 స్టాటిక్, 154 ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నిలిచిన నీటిని వెంటనే తొలగిస్తున్నామని, గ్రేటర్ లో 141 వాటర్ లాగింగ్ పాయింట్ లను గుర్తించి ప్రమాదాలు సంభవించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎమర్జెన్సీ టీమ్ లను ఏర్పాటు చేయడంతో పాటు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు వరద ముంపుకు గురైన సందర్భంలో వారికి సహాయం అందించడం కోసం హెడ్ ఆఫీస్ , జోనల్ , సర్కిల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలను ఆపద నుండి ఆదుకునేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నివేళలా అండదండగా అప్రమత్తంగా ఉన్నారనే మనో ధైర్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రజలకెలాంటి సహాయం అవసరమైనా జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ డయల్ 100, మై జీహెచ్ఎంసీ యాప్ లకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమును డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మంగళవారం సందర్శించి ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న తీరు ను పరిశీలించారు.

**అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్ ఆమ్రపాలి**

రహదారుల పై నీరు నిలవడం వల్ల ప్రమాదాలు జరగకుండా క్షేత్ర స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం అడిషనల్, జోనల్ కమిషనర్ లతో ఆమె టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షాలకు నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రధాన రహదారి పై ప్రాజెక్టు సైట్ వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారుల పై మరమ్మత్తులు చేస్తున్న స్థలం వద్ద ప్రమాదం సంభవించకుండా భద్రతా చర్యల్లో భాగంగా బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డు లతో పాటు రాత్రి సమయంలో లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బహుళ అంతస్థుల నిర్మాణాలు, నాలాలు, నీటి వనరుల వద్ద కూడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాల వలన ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. గత ఏడాది లాగా ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. అంతకు ముందు కమిషనర్ మెహదిపట్నం, హఫీజ్ నగర్, అత్తాపూర్, గుడి మల్కాపూర్, విజయ నగర్ కాలనీ, మాసబ్ ట్యాంక్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వాటర్ లాగింగ్ పోయింట్లను పరిశీలించారు. వర్షాకాలం సహాయక చర్యల కోసం 040-21111111 ఫోన్ నెంబర్లు అనే ఫోన్ నంబరును సంప్రదించవచ్చునని కమిషనర్ అమ్రపాలి తెలిపారు.

**జలమండలి ఉద్యోగులకు సెలవులు రద్దు**

హైదరాబాద్ మహానగరాన్ని మంగళవారం తెల్లవారుజాము నుంచే వర్షం ముంచెత్తింది. నగరంలోని పలు చోట్ల భారీ వర్షం కురిసింది. దీంతో జలమండలి అప్రమత్తమైంది. ఎండీ అశోక్ రెడ్డి జలమండలి ఉన్నతాధికారులతో పాటు జీఎం, డీజీఎం, మేనేజర్ లతో అత్యవసరంగా జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్ లో పలు కీలక సూచనలు, ఆదేశాలిచ్చారు. ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ అధికారులంతా తాగునీటి సరఫరా, ముగురు నీటి నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. ఇందు కోసం క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్, ఎస్పీటీ టీమ్స్ సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. వీలైన చోట్ల క్లోరిన్ బిళ్లలు పంపిణీ చేయాలన్నారు. కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రాంతాల్లో.. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. పని జరిగే ప్రాంతాల్లో తప్పని సరిగా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వాటర్ లాగింగ్ పాయింట్స్పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్ హోల్స్ గుర్తించి, మురుగు పొంగకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మ్యాన్ హోల్స్ ను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవొద్దని నగర పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఏవైనా సమస్యలుంటే.. జలమండలి కస్టమర్ కేర్ సెంటర్ నెంబర్ 155313కి ఫోన్ చేయాలని కోరారు. జలమండలి అధికారులు, జీహెచ్ఎంసీతో పాటు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ సేవలు అందించాలన్నారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసినందున జలమండలి ఉద్యోగులు, సిబ్బందికి సెలవులు రద్దు చేశారు.

## నిండుతున్న జలాశయాలకు

రిజర్వాయర్ల లోకి భారీగా వర్షం నీరు

గరిష్ట స్థాయి నీటి మట్టం దాటుతున్న హుస్సేన్ సాగర్

అప్రమత్తమైన జిహెచ్ఎంసి

పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

**విశ్వంభర హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో తరుచూ కురుస్తున్న వర్షాల కారణంగా జంట జలాశయాలు జల కళను సంతరించుకుంటున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వర్షం నీరు జలాశయాల్లో చేరటంతో జలాశయాల నీటిమట్టాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉస్మాన్ సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1790 అడుగులు కాగా(3.900 టీఎంసీలు), ప్రస్తుత నీటిమట్టం 1778.900 అడుగులు (1.812) టీఎంసీలు) చేరినట్లు జలమండలి అధికారులు తెలిపారు. హిమాయత్ సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1763.500 అడుగులు (2.970 టీఎంసీలు), ప్రస్తుత నీటిమట్టం 1755.100అడుగులు (1.640టీఎంసీలు) చేరినట్లు అధికారులు తెలిపారు. వీటికి తోడు హుస్సేన్ సాగర్ నీటిమట్టం కూడా పూర్తిస్థాయికి చేరుతున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. ఈ రెండు జలాశయాల నుంచి ప్రస్తుతం ఎలాంటి అవుట్ ఫ్లో లేదని ముమ్ముందు అవసరాలను బట్టి అవుట్ ఫ్లో నిర్ణయించనున్నట్లు తెలిపారు. అలాగే హుస్సేన్ సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 513.41 మీటర్లు కాగా, గరిష్ట స్థాయి నీటిమట్టం 514.75 మీటర్లుగా ఉండగా, ప్రస్తుత నీటి మట్టం 513.21 మీటర్లకు చేరినట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. మధ్యాహ్నం హుస్సేన్ సాగర్ తూముల నుంచి దిగువకు అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. అప్రమత్తమైనజీ హెచ్ఎంసీ హుస్సేన్ సాగర్ పరీవాహ ప్రాంతాలకు ఇరువైపుల నివాసం ఉంటున్న ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. హుస్సేన్ సాగర్ లోకి పై నుండి వస్తున్న వరదను అంచనా వేస్తూ ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ నీటి యాజమాన్య పద్ధతులు ఇంజనీరింగ్ అధికారులు పాటిస్తున్నారు. ఇన్ ఫ్లో 2075 క్యూసెక్ లు కాగా ,ఔట్ ఫ్లో 1538 క్యూసెక్కుల ల నీటినీ దిగువకు వదిలారు.







# రుణమాఫీ చేస్తే రైతులు ఆందోళన ఎందుకు చేస్తారు?

## మాజీ మంత్రి: హరీశ్‌రావు

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** రైతు రుణమాఫీపై కాంగ్రెస్ నేతలు రోజుకో తీరున మాట్లాడుతున్నారని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.31వేల కోట్ల రుణమాఫీ జరిగిందని చెప్పారు, సీఎం సమక్షంలోనే భట్టి అసత్యాలు చెప్పారని విమర్శించారు. మంగళవారం సిద్దిపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులంతా ఆందోళన చేస్తున్నారని చెప్పారు. సీఎం, మంత్రులు ఇష్టానుసారం మాట్లాడి గందరగోళం సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. రుణమాఫీ జరిగితే రైతులు ఎందుకు ఆందోళన చేస్తారని ప్రశ్నించారు. రుణమాఫీపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు.

**సిద్దిపేటలో కాంగ్రెస్..బీఆరెస్**

**పోటాపోటీ సభలు మరోసారి ఉద్రిక్తత**

సిద్దిపేట పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ పోటాపోటీ ర్యాలీలతో పట్టణంలో హైటెన్షన్ వాతావరణం ఏర్పడింది. పట్టణంలో మంగళవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ ర్యాలీలకు పిలుపునివ్వడంతో ఇరు పార్టీల కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేసుకుంటూ తరలి వెళ్లారు. దీంతో వీరిరువురి మధ్య ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది.'మేం ధ్వజం ఎత్తాలనుకుంటోంది బీఆర్ఎస్‌పైన.. హరీశ్ రావుపైనో ప్రజలపైనో కాదు. ప్రజాస్వామ్యంలో బీఆర్ఎస్ నేతలు గూండాల్లా వ్యవహరిస్తున్నారు. మేం ర్యాలీకి ముందస్తు అనుమతి తీసుకున్నాం.వారు రేపు కూడా రైతు రుణమాఫీ ర్యాలీ చేసుకోవచ్చు. కానీ, మా ర్యాలీ అడ్డుకునేందుకే పోటాపోటీ ర్యాలీ పెట్టి ఉద్రిక్తతలు పుట్టిస్తున్నారు. వాళ్ల అంతు చూసేదాకా వదలబోం. రుణమాఫీ చేసినందున హరీశ్‌రావు మళ్లీ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. ఇద్దరం మళ్లీ పోటీ చేద్దాం. హరీశ్ మళ్లీ గెలిస్తే నేను రాజకీయాల్లో నుంచి వెళ్లిపోతా'అని కాంగ్రెస్ సీనియర్ నేత మైనంపల్లి హన్మంతరావు సవాల్ విసిరారు. అయితే రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ ర్యాలీకి మాత్రమే అనుమతి ఉందని పోలీసులు చెబుతున్నారు. రుణమాఫీపై బీఆర్ఎస్ ర్యాలీకి అనుమతి లేదని తెలిపారు. తాము కూడా ర్యాలీ చేసి తీరుతామని బీఆర్ఎస్ శ్రేణులు తెగేసి చెప్పాయి. దీంతో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు.





# ఎంపాక్స్ కొవిడ్ కాదు.. నియంత్రించొచ్చు: డబ్ల్యుహెచ్ఓ

**ఢిల్లీ:** కరోనా సృష్టించిన కలవరాన్ని మర్చిపోతున్న తరుణంలో తాజాగా ఎంపాక్స్ కలకలం రేపుతోంది. ఆఫ్రికా దాటి పలు దేశాలకు ఈ వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ ఆందోళన సమయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిన మాట కాస్త ఊరటనిస్తోంది. ఎంపాక్స్ కొవిడ్ కాదని, దాని వ్యాప్తిని నియంత్రించొచ్చని తెలిపింది. డబ్ల్యూహెచ్ఓలో యూరప్ రీజినల్ డైరెక్టర్గా విధులు నిర్వహిస్తున్న హాన్స్ క్లుగే మీడియాతో మాట్లాడుతూ.. ఎంపాక్స్ వ్యాప్తిని నియంత్రించేందుకు, నిర్మూలించేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమయంలో ప్రపంచం స్పందించే తీరు కీలకమని వ్యాఖ్యానించారు. "దీనిని కలిసికట్టుగా ఎదుర్కోవాలి. మనం ఈ వైరస్ ను నియంత్రిస్తామా.. మరోసారి నిర్లక్ష్యం, భయం వైపు వెళ్తామా.. అనేది మన స్పందనపై ఆధారపడి ఉంటుంది. రానున్న ఏళ్లలో ఐరోపా, ప్రపంచానికి ఇది మరో పరీక్ష" అని హెచ్చరించారు. ఇదిల ఉంటే.. మంకీపాక్స్ పై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలకు కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. బంగ్లాదేశ్, పాకిస్థాన్ సరిహద్దుల్లోని నౌకాశ్రయాల దగ్గర కూడా నిఘా పెంచాలని, మంకీపాక్స్ లక్షణాలు ఉన్న వారెవరైనా కనిపిస్తే వెంటనే తెలపాలని పేర్కొంది. మంకీపాక్స్ వైరస్ సోకిన వారిని ఐసోలేషన్లో ఉంచేందుకు, చికిత్స చేసేందుకు వీలుగా దేశరాజధాని ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా, సర్దార్జంగ్, లేడీ హార్డింగ్ ఆసుపత్రులను ఆరోగ్యమంత్రిత్వశాఖ గుర్తించింది.రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మంకీపాక్స్ నోడల్ కేంద్రాలుగా తమ పరిధిలోని కొన్ని ఆసుపత్రులను గుర్తించాలని పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం.. 2022 నుంచి ఇప్పటివరకు 116 దేశాలకు ఎంపాక్స్ వైరస్ విస్తరించింది. మొత్తం 99,176 కేసులు నమోదయ్యాయి. ఇటీవల కాంగోలో వేగంగా వ్యాపిస్తోంది. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 15,600 కేసులు నమోదు కాగా 537 మరణాలు సంభవించాయి. భారత్లో 2022 నుంచి ఇప్పటివరకు 30 ఎంపాక్స్ కేసులు రికార్డయ్యాయి. మార్చి 2024లో చివరి కేసు గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఆ తర్వాత దేశంలో ఎటువంటి ఎంపాక్స్ కేసులు కొత్తగా నమోదు కాలేదని తెలిపింది. మరోపక్క పొరుగున ఉన్న పాకిస్థాన్లో నలుగురిలో ఈ వైరస్ను గుర్తించారు.

# బాలికలు కోరికలు అణుచుకోవాలన్న కోల్కతా హైకోర్టు

## తీర్పును కొట్టేసిన సుప్రీం కోర్టు..

**ఢిల్లీ:** కిశోరప్రాయ బాలికలు తమ లైంగిక వాంఛలను నియంత్రించుకోవాలంటూ గతేడాది ఓ తీర్పు సందర్భంగా కలకత్తా హైకోర్టు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారం సుప్రీంకోర్టును చేరడంతో తాజాగా కీలక తీర్పు వెలువరించింది. ఆ వివాదాస్పద తీర్పును కొట్టివేస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. ఆ కేసులో నిందితుడికి వేసిన శిక్షను పునరుద్ధరిస్తున్నట్లు స్పష్టం చేసింది. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు గానూ బెంగాల్కు చెందిన ఓ వ్యక్తికి కింది కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆ వ్యక్తి కలకత్తా హైకోర్టును ఆశ్రయించాడు. గతేడాది అక్టోబరులో దీనిపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. సంచలన తీర్పు వెలువరించింది. బాలిక అతడితో ఇష్టపూర్వకంగానే సాన్నిహిత్యాన్ని కొనసాగించిందన్న కారణంతో అతడిని నిర్దోషిగా ప్రకటించింది. ఆ సందర్భంగా న్యాయస్థానం కొన్ని సూచనలు చేసింది. "కేవలం రెండు నిమిషాల లైంగిక ఆనందం కోసం చూసుకుంటే.. సమాజం దృష్టిలో బాలికలు పరాజితులుగా మిగిలిపోతారు. కిశోరప్రాయ బాలికలు తమ లైంగిక వాంఛలను నియంత్రించుకోవాలి" అని సూచించింది. దీనిపై అప్పట్లో పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ సూచనలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. మరోవైపు, నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో అప్పీలు దాఖలు చేసింది. వీటిపై గతంలో విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం కోర్టు సూచనల పై అసహనం వ్యక్తంచేసింది. న్యాయమూర్తులు తీర్పుల్లో ప్రవచనాలు చెప్పరాదని పేర్కొంది. ఈ క్రమంలోనే తాజాగా దీనిపై తీర్పు వెలువరించింది. నిందితుడిని నిర్దోషిగా పేర్కొంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కనబెట్టింది. అతడి శిక్షను పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించింది. అంతేగాక.. కోర్టులు తీర్పులు ఎలా రాయాలన్న దానిపై ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది.

# కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరిస్తున్న గవర్నర్: సిద్ధరామయ్య



**బెంగళూరు:** కర్నాటక గవర్నర్ను కాంగ్రెస్ నేతలు అవమానిస్తున్నారని కాషాయ నేతలు చేస్తున్న విమర్శలపై కర్నాటక సీఎం సిద్ధరామయ్య స్పందించారు. గవర్నర్ను తాము ప్రశ్నిస్తే అవమానించినట్టా అని నిలదీశారు. శశికళా జొల్లె, మాజీ మంత్రి మురుగేష్ నిరాని, జనార్ధన రెడ్డిపై ఫిర్యాదులున్నాయని సీఎం తెలిపారు. వీరిని ప్రాసిక్యూట్ చేసేందుకు తాము గవర్నర్ను కోరినా పర్మిషన్ ఇవ్వలేదని వివరించారు.గవర్నర్ పదవి అనేది రాజ్యాంగబద్ధమైనదని, రాష్ట్రపతి ప్రతినిధిగా ఆయన పనిచేయాలని, కేంద్రం ప్రతినిధిగా వ్యవహరించరాదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. కాగా ముడా స్కామ్లో కర్నాటక సీఎం సిద్ధరామయ్య ప్రాసిక్యూషన్కు రాష్ట్ర గవర్నర్ అనుమతించడం కర్నాటక రాజకీయాలను కుదిపేసిన సంగతి తెలిసిందే. మరోవైపు ముడా స్కామ్లో కర్నాటక సీఎం సిద్ధరామయ్యపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా తోసిపుచ్చారు. రాజకీయ దురుద్దేశంతోనే సిద్ధరామయ్యపై కాషాయ పార్టీ అవినీతి ఆరోపణలు గుప్పిస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవని అన్నారు. హిమాచల్ ప్రదేశ్లో ఎన్నికైన తమ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కాషాయ నేతలు ప్రయత్నించారని, మహారాష్ట్ర, జార్ఖండ్లో కూడా అదే జరిగిందని ఆరోపించారు. కాషాయ నేతలు ఇప్పుడు కర్నాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ను కూలదోసేందుకు కుటిల యత్నాలు చేస్తున్నారని, వారి ప్రయత్నాలు ఫలించబోవని పవన్ ఖేరా స్పష్టం చేశారు.

# చంద్రయాన్ 4, 5 డిజైన్లు పూర్తి..

## కేంద్రం ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాం: ఇస్రో చైర్మెన్



**ఢిల్లీ:** చంద్రయాన్ ప్రాజెక్టుకు చెందిన కొత్త అప్డేట్స్ ఇచ్చారు ఇస్రో చైర్మెన్ డాక్టర్ ఎస్ సోమనాథ్. చంద్రుడి మీదకు వరుసగా వ్యోమనౌకలను పంపినట్లు చెప్పిన ఆయన.. చంద్రయాన్ 3 సక్సెస్ అయినట్లు వెల్లడించారు. అయితే ప్రస్తుతం చంద్రయాన్ 4, 5 ప్రాజెక్టు డిజైన్లు పూర్తి అయ్యాయని, ఆ డిజైన్లకు ప్రభుత్వం నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్లు ఇస్రో చైర్మెన్ తెలిపారు. ఎల్వీఎం3 రాకెట్ తయారీ ఖర్చును తగ్గించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎవీఎం3 రాకెట్ తరహాలో కొత్త రాకెట్ను అభివృద్ధి చేస్తున్నామని, ఇది పేలోడ్ను మూడు రెట్లు అధికంగా మోసుకెళ్తుందని ఆయన తెలిపారు. ఆగస్టు 23వ తేదీన జాతీయ అంతరిక్ష దినంగా పాటించనున్నట్లు చెప్పారు. 23ను నేషనల్ స్పేస్ డేగా కేంద్ర సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే.

# సిద్ధరామయ్య అమాయకుడు

- బీజేపీ రాజకీయ డ్రామా చేస్తోంది
- ముడా స్కామ్పై డీకే శివకుమార్



**బెంగళూరు:** మైసూర్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ముడా) భూకుంభకోణం ఆరోపణలు కర్ణాటకలో ప్రకంపనలు రేపుతున్నాయి. ఈ కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అడ్డంగా బుక్కయ్యారు. ముడా నుంచి తన భార్యకు అనుచితంగా లబ్ధి కలిగించినట్లు సీఎంపై ఆరోపణలున్నాయి. దీంతో కుంభకోణం వ్యవహారంలో ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అనుమతి ఇవ్వడంతో కర్ణాటక కాంగ్రెస్ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలో సీఎం పదవికి సిద్ధు రాజీనామా చేయాలంటూ డిమాండ్లు వెల్లువెతుతున్నాయి. బీజేపీ సైతం సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటూ ఒత్తిడి పెంచుతోంది. ఈ అంశంపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ (DK Shivakumar) మరోసారి స్పందించారు. సిద్ధరామయ్య అమాయకుడని.. ఈ అంశంలో బీజేపీ రాజకీయ డ్రామాకు తెరలేపిందని వ్యాఖ్యానించారు. ఇండియా టుడే టీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో శివకుమార్ మాట్లాడుతూ.. 'సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేసే ప్రశ్నే లేదు. దేశంలోని చట్టం మా ముఖ్యమంత్రిని కాపాడుతుంది. సిద్ధరామయ్య అమాకుడు. ఈ అంశంలో బీజేపీ రాజకీయ డ్రామా చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ మొత్తం ముఖ్యమంత్రికి సపోర్ట్గా ఉంది. సీఎం తప్పు చేశాడని నిరూపించడానికి ఎలాంటి ఆధారాలూ లేవు' అని శివకుమార్ తెలిపారు. మరోవైపు తనపై ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అనుమతి ఇవ్వడాన్ని సిద్ధరామయ్య ఇటీవలే హైకోర్టులో సవాల్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును ఈ నెల 29న విచారణకు జాబితా చేసింది. కేసు విచారణ వరకు మధ్యంతర ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొంది. ఈ సందర్భంగా సమాధానం చెప్పాలని ప్రతివాదులను కోర్టు కోరింది.

**ఏమిటీ స్కాం?**

బీజేపీ నేతలు, హక్కుల కార్యకర్తల ఆరోపణల ప్రకారం.. మైసూరు శివారులోని కెసరె గ్రామంలో సిద్ధరామయ్య భార్య పార్వతమ్మకు 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. అయితే, అవసరాల దృష్ట్యా ఆ భూమిని సేకరించిన ప్రభుత్వం.. దానికి బదులుగా నగరం లోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా చెప్పుకొనే విజయనగర్, దట్టగల్లీ, జేపీ నగర్, ఆర్టీ నగర్, హంచయా-సతాగల్లీలో సిద్ధరామయ్య కుటుంబానికి 38,283 చదరపు అడుగుల భూమిని కేటాయించింది. 50:50 నిష్పత్తిలో (పడావు పడ్డ ఒక ఎకరా తీసుకొంటే, అభివృద్ధి చేసిన అర్ధ ఎకరం ఇవ్వడం) ఈ కేటాయింపు జరిగింది. అయితే, కెసరెలోని భూములతో పోలిస్తే మార్కెట్ ధర అతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సిద్ధరామయ్య కుటుంబానికి ఆ భూములను కేటాయించాలని ఎవరు సిఫారసు చేశారని బీజేపీ నేత ఆర్ అశోక్ నిలదీశారు. క్యాబినెట్ అనుమతి లేకుండా భూములు కేటాయించే అధికారం ఎవరికి ఉంటుందని, ముఖ్యమంత్రికి తెలియకుండానే రూ. 4 వేల కోట్ల విలువజేసే ఇంత పెద్ద కుంభకోణం జరిగిందా? అని ఆయన ప్రశ్నించారు. ముడా భూకుంభకోణంలో సిద్ధరామయ్య కొడుకు యతీంద్ర పాత్ర ఉన్నదని, ఆయనే దీనికి అసలు సూత్రధారని బీజేపీ ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్ ఆరోపించారు. ఈ స్కామ్ మూలంగా వేల కోట్లు పక్కదారి పట్టాయని ముగ్గురు హక్కుల కార్యకర్తలు ప్రదీప్ కుమార్, టీజే అబ్రహం, స్నేహమయి కృష్ణ.. లోకాయుక్త పోలీసులు సహా గవర్నర్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే గవర్నర్ సీఎంపై విచారణకు అనుమతినిచ్చారు.

# వైద్యులు వీలైనంత త్వరగా విధుల్లోకి చేరండి

## సుప్రీంకోర్టు విజ్ఞప్తి

**కోల్కతా:** కోల్కతాలో జరిగిన ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ గత 10 రోజులుగా వైద్యులు దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. వైద్యుల నిరసనతో ఆసుపత్రుల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు సమ్మెను విరమించి తమ విధుల్లోకి చేరాలని దేశ అత్యున్నత న్యాయస్థానం కోరింది. ట్రైనీ వైద్యురాలి హత్యాచార కేసును సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారిస్తున్న విషయం తెలిసిందే. ఆ బెంచ్లో జస్టిస్ జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలు ఉన్నారు. విచారణ సందర్భంగా జూనియర్, సీనియర్ డాక్టర్ల భద్రతపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, డాక్టర్ల సమ్మెతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొంది. ఈ మేరకు వైద్యులు వెంటనే సమ్మె విరమించి తమ విధుల్లోకి చేరాలని కోరింది. 'వైద్యులందరి భద్రత, సంక్షేమానికి సంబంధించిన విషయాలను కోర్టు పరిశీలిస్తున్నందున.. ప్రస్తుతం విధులకు దూరంగా ఉన్న వైద్యులు వీలైనంత త్వరగా తిరిగి విధుల్లోకి చేరాలని మేము కోరుతున్నాము' అని సుప్రీం ధర్మాసనం తెలిపింది.

**వైద్యుల భద్రతకై జాతీయ టాస్క్ ఫోర్స్..**

మరోవైపు ఈ ఘటన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు మంగళవారం ఓ జాతీయ టాస్క్ ఫోర్స్ను ఏర్పాటు చేసింది. డాక్టర్ల భద్రత గురించి టాస్క్ ఫోర్స్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. మెడికల్ ప్రొఫెషనల్స్ ఎవరైనా సరే.. వారికి సామాజిక భద్రత కల్పించడమే ఆ టాస్క్ ఫోర్స్ ఉద్దేశంగా పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా డాక్టర్ల భద్రత గురించి ఏకాభిప్రాయాన్ని క్రియేట్ చేయాలని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఈ మేరకు టాస్క్ఫోర్స్ బృందంలోని సభ్యుల పేర్లను కూడా సుప్రీం వెల్లడించింది.

**జాతీయ టాస్క్ ఫోర్స్ బృందం జాబితా:** సర్జర్ వైస్ అడ్మిరల్ ఆర్ సరిన్, డాక్టర్ డీ నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఎం శ్రీనివాస్ , డాక్టర్ ప్రతిమా మూర్తి, డాక్టర్ గోవర్ధన్ దత్ పురి, డాక్టర్ సౌమిత్ర రావత్, ప్రొఫెసర్ అనితా సక్సేనా(ఎయిమ్స్ కార్డియాలజిస్ట్), ప్రొఫెసర్ పల్లవి సప్రే (ముంబై గ్రాంట్ కాలేజీ డీన్), డాక్టర్ పద్మ శ్రీవాత్సవ్ (ఎయిమ్స్ న్యూరాలజీ) ఉన్నారు. వీరితో పాటు భారత ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటరీ, కేంద్ర ప్రభుత్వం హోం కార్యదర్శి, కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, జాతీయ మెడికల్ కమీషన్ చైర్పర్సన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినర్స్ ప్రెసిడెంట్ ఆ జాబితాలో ఉన్నారు.

# వైద్యుల భద్రతకై జాతీయ టాస్క్ ఫోర్స్..






**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న 31 ఏళ్ల ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. కేసును సిమోటోగా తీసుకుని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా జూనియర్, సీనియర్ డాక్టర్ల భద్రతపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది భద్రతకై తీసుకోవాల్సిన చర్యలను ప్రతిపాదించింది.

- ఆసుపత్రుల్లో అత్యవసర గది వద్ద అదనపు భద్రత అవసరం కావొచ్చు.
- ఆసుపత్రుల్లో బ్యాగేజీ స్క్రీనింగ్ చేయాలి.
- రోగులు కాకుండా.. ఆసుపత్రి లోపలికి పరిమితికి మించి వ్యక్తులను అనుమతించకూడదు.
- ఆసుపత్రుల్లో రద్దీని నియంత్రించడానికి సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి.
- వైద్యులు, నర్సులకు విశ్రాంతి కోసం ప్రత్యేకంగా వసతి కల్పించాలి. అలాంటి ప్రాంతాల్లో బయోమెట్రిక్స్, ఫేషియల్ రికగ్నిషన్ ఏర్పాటు చేయాలి.
- ఆసుపత్రి ప్రాంగణంలో లైటింగ్ ఉండేలా చూసుకోవాలి. అదేవిధంగా అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.
- వైద్య నిపుణుల కోసం రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య రవాణా సౌకర్యం కల్పించాలి.
- బాధ, సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా వర్క్షాప్లను నిర్వహించాలి.
- భద్రతా ఏర్పాట్లుకు సంబంధించి ప్రతి మూడు నెలలకోసారి ఆడిట్ చేపట్టాలి.
- POSH చట్టం వైద్య సంస్థలకు వర్తిస్తుంది కాబట్టి.. అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ICC)ని ఏర్పాటు చేయాలి.
- వైద్య నిపుణులకు అత్యవసర పరిస్థితుల కోసం హెల్ప్లైన్ నంబర్లు ఏర్పాటు చేయాలి.

**వైద్యుల భద్రతకై జాతీయ టాస్క్ ఫోర్స్..**

మరోవైపు ఈ ఘటన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు మంగళవారం ఓ జాతీయ టాస్క్ ఫోర్స్ను ఏర్పాటు చేసింది. డాక్టర్ల భద్రత గురించి టాస్క్ ఫోర్స్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. మెడికల్ ప్రొఫెషనల్స్ ఎవరైనా సరే.. వారికి సామాజిక భద్రత కల్పించడమే ఆ టాస్క్ ఫోర్స్ ఉద్దేశంగా పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా డాక్టర్ల భద్రత గురించి ఏకాభిప్రాయాన్ని క్రియేట్ చేయాలని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఈ మేరకు టాస్క్ఫోర్స్ బృందంలోని సభ్యుల పేర్లను కూడా సుప్రీం వెల్లడించింది.

**జాతీయ టాస్క్ ఫోర్స్ బృందం జాబితా..**

సర్జర్ వైస్ అడ్మిరల్ ఆర్ సరిన్, డాక్టర్ డీ నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఎం శ్రీనివాస్ , డాక్టర్ ప్రతిమా మూర్తి, డాక్టర్ గోవర్ధన్ దత్ పురి, డాక్టర్ సౌమిత్ర రావత్, ప్రొఫెసర్ అనితా సక్సేనా(ఎయిమ్స్ కార్డియాలజిస్ట్), ప్రొఫెసర్ పల్లవి సప్రే (ముంబై గ్రాంట్ కాలేజీ డీన్), డాక్టర్ పద్మ శ్రీవాత్సవ్ (ఎయిమ్స్ న్యూరాలజీ) ఉన్నారు. వీరితో పాటు భారత ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటరీ, కేంద్ర ప్రభుత్వం హోం కార్యదర్శి, కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, జాతీయ మెడికల్ కమీషన్ చైర్పర్సన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినర్స్ ప్రెసిడెంట్ ఆ జాబితాలో ఉన్నారు.


# ఆ యాడ్స్ను రద్దు చేయండి..

## యూపీఎస్సీకి లేఖ రాసిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్



యూపీఎస్సీ చైర్మన్కు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ మంగళవారం లేఖ రాశారు. డైరెక్ట్ రిక్రూట్మెంట్ కి సంబంధించి జారీ చేసిన ప్రకటనలను రద్దు చేయాలని యూపీఎస్సీని కోరారు. లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీల భర్తీ విధానంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్రం వెనక్కి తగ్గింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు లేఖలో మంత్రి పేర్కొన్నారు. సామాజిక న్యాయంపై మోదీ ప్రభుత్వం దృష్టి సారించిందని.. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు.2005లో వీరప్ప మొయిలీ నేతృత్వంలోని రెండో అడ్మినిస్ట్రేషన్ రిఫార్మ్స్ డైరెక్ట్ ప్రవేశాలకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని.. 2013లో ఆరవ వేతన సంఘం సిఫారసులు సైతం అదే దిశలో ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. అయితే, అంతకు ముందు చాలా హై ప్రొఫైల్ కేసులు లేటరల్ ఎంట్రీకి వచ్చాయని.. గత ప్రభుత్వాల్లో వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, ఉడాయ్ లీడర్షిప్ తదితర కీలకమైన పోస్టుల్లో రిజర్వేషన్ లేకుండా లేటరల్ ఎంట్రీ హోల్డర్లకు అవకాశం ఇచ్చారన్నారు. 2014కి ముందు చాలా వరకు రిక్రూట్మెంట్లు కాంటాక్టు ప్రాతిపదికపై లేటరల్ ఎంట్రీ ద్వారా జరిగాయని.. తమ ప్రభుత్వం ఈ ప్రక్రియను సంస్థాగతంగా, బహిరంగంగా, పారదర్శకంగా చేసేందుకు ప్రయత్నించిందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న సమానత్వం, సామాజిక న్యాయం సూత్రాలకు అనుగుణంగా ప్రవేశ ప్రక్రియ సామరస్యపూర్వకంగా ఉండాలని, ప్రత్యేకించి రిజర్వేషన్ నిబంధనల నేపథ్యంలో ఉండాలని ప్రధాని భావిస్తున్నారన్నారు.

# ఈ నెల 27 వరకు సీఎం అరవింద్ కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు



**ఢిల్లీ:** మద్యం పాలసీ సీబీఐ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు మంగళవారం పొడిగించింది. గతంలో కస్టడీని ముగియడంతో సీబీఐ ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచింది. ఈ సందర్భంగా కోర్టు కస్టడీని ఈ నెల 27 వరకు పొడిగిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఉత్తర్వులు వెలువరించారు. ఈ నెల 14న కేజ్రీవాల్కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. అరెస్టు సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్పై సీబీఐ స్పందన కోరింది. కేజ్రీవాల్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. సీబీఐ ఆయనను అరెస్టు చేయడాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించిన విషయం తెలిసిందే. సీబీఐ కేసులో ట్రయల్ కోర్టు నుంచి రెగ్యులర్ బెయిల్ కోసం ఆశ్రయించాలని సూచించింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. జూన్ 20న మనీలాండరింగ్ కేసులో ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఆదేశాలపై హైకోర్టు మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఈడీ దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసులో జులై 14న సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

# కర్నూలు, అనంతపురం జిల్లాలో ఎడతెరపిలేని వర్షాలు

### మిద్దెకూలి మహిళ దుర్మరణం



**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. నంద్యాల జిల్లాలో మిద్దెకూలి మహిళ మృతి చెందిన విషాద ఘటన చోటు చేసుకుంది. కర్నూలు, అనంతపురం జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులపై ఎటు చూసినా వరద చేరిపోవటంతో రాకపోకలు సాగించలేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. అనంతపురం జిల్లా కూడేరు , విడపనకల్లు మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెంచులపాడు , ఆర్.కొట్టాల, పొలికి, గడేకల్లు, గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధాన రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదు. పలు మండలాల్లో పొలాల్లో చీనీ, దానిమ్మ పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మంత్రాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం భారీ వర్షాలకు చెరువును తలపిస్తోంది. భారీ వర్షం కారణంగా భక్తుల ఇబ్బందులను గుర్తించిన మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రు తీర్థులు మఠంలో ఆశ్రయం కల్పించారు. కోసిగి మండలం దేవరబెట్టకు వెళ్లే రోడ్డు కల్వర్టు తెగిపోయి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. హాలహర్వి మండలం అమృతాపురంలో టోపీ మారెమ్మవ్వ ఆలయంలోకి వరద ప్రవేశించింది. నంద్యాల జిల్లా వెలుగోడు పట్టణంలోని అమ్మవారి శాల వీధిలో మిద్దెకూలి మద్దమ్మ(50) అనే మహిళ మృతి చెందింది. ఈ ఘటనలో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరపిలేని వర్షాలకు ఏజెన్సీలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. లక్ష్మీపురం, బుంగపుట్టు, ముంచంగిపుట్టు మండలాల నుంచి పంచాయతీలకు వెళ్లే మార్గంలో గడ్డ పొంగి ప్రవహిస్తుంది.

## విదేశాలకు వెళ్లేందుకు సీబీఐ కోర్టును కోరిన జగన్..

### విచారణ రేపటికి వాయిదా



**విశ్వంభర, అమరావతి:** మరోవైపు విజయసాయి రెడ్డి కూడా పిటిషన్‌పై వాదనలు పూర్తి కాగా ఈ నెల 30కి తీర్పు వాయిదా వేశారు. సెప్టెంబర్‌లో యూకే వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని జగన్, సెప్టెంబర్, అక్టోబర్‌లో యూరప్ వెళ్లేందుకు విజయసాయిరెడ్డి కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.మే 13న ఏపీలో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం జగన్15 రోజుల పాటు కుటుంబంతో కలిసి జగన్ విదేశీ ప్రయాణం చేశారు. ఈ మేరకు జగన్ విదేశీ పర్యటన వెళ్లేందుకు నాంపల్లి సీబీఐ కోర్టు కొన్ని ఆంక్షలు విధిస్తూ అనుమతి ఇచ్చింది. యూకే, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ దేశాల్లో జగన్ పర్యటించారు. ఏపీలో ఓటమి తరువాత వైఎస్ జగన్ విదేశాలకు వెళ్లడం ఇదే ప్రథమం.

## సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



**విశ్వంభర, శ్రీశైలం:** భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కొలువైన శ్రీశైలం ఆలయంలో మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు నిర్వహించారు. లోక కల్యాణం కాంక్షిస్తూ దేవ-స్థానం సర్కారీ సేవగా నిర్వహించింది. మంగళ, కృతికానక్షత్రం, షష్ఠి తిథుల్లో కుమారస్వామికి విశేష అభిషేకం, విశేష పూజలను శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తూ వస్తున్నది. అభిషేకానికి ముందు దేశంలో శాంతి, సౌభాగ్యాలు విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా తగినంత వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా కురవాలని.. ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని అర్చకులు మొదట సంకల్పం పటించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ నిర్వహించారు. అనంతరం కుమారస్వామికి అభిషేకం పంచామృతాలు, వివిధ ఫలరసాలతో అభిషేక అభిషేకం చేశారు.

## అంతర్రాష్ట్ర గంజాయి రవాణా ముఠా అరెస్ట్

### 22 కిలోల గంజాయి స్వాధీనం



**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాల నుంచి గంజాయి రవాణాచేస్తున్న అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను విజయనగరం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా ధర్మపురి ప్రాంతంలోని వసంత విహార్ విల్లాలో ఉత్తరప్రదేశ్‌లోని మేరట్, ఢిల్లీకి చెందిన ముగ్గురు గత ఏడాదిగా ఢిల్లీకి గంజాయిని రవాణా చేస్తున్నారని తెలిపారు. మేరఠ్‌కు చెందిన మహ్మద్ వసీం, అరకులోయలోని విశ్వనాథం నుంచి గంజాయిని కొనుగోలు చేసి అలాం ఖుర్షిద్ ద్వారా ఢిల్లీకి రవాణా చేస్తున్నారని వివరించారు.ఈ ముగ్గురు విజయనగరం లోని వేర్వేరు ఇండ్లల్లో అద్దెకు ఉంటూ గంజాయి రవాణాకు పాల్పడుతున్నారని వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నింది-తుడిగా కబీర్‌గా గుర్తించామని, మరో 5గురు గంజాయి రవాణాలో ప్రమేయం ఉందని తెలిపారు. నిందితుల నుంచి 22 కిలోల గంజాయి, రవాణాకు వినియోగిస్తున్న వస్తువులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వివరించారు. మిగతా నిందితులను కూడా త్వరలో పట్టుకుంటామని పేర్కొన్నారు.

## వాగులో కొట్టుకుపోయిన ఇద్దరు టీచర్ల కుటుంబాలకు ఉద్యోగాలు

### ఏపీ మంత్రి సంధ్యారాణి



**విశ్వంభర, అమరావతి:** పార్వతీపురం మన్యం జిల్లాలో ఈనెల 16న వాగులో కొట్టుకుపోయి చనిపోయిన ఇద్దరు టీచర్ల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఏపీ మంత్రి సంధ్యారాణి వెల్లడించారు.సాలూరు మండలం సరాయివలస గ్రామంలో ఏకలవ్య పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్తి, వార్డెన్‌గా పనిచేస్తున్న మహేశ్ విధులు నిర్వహించుకుని తిరిగి వారు నివాసముంటున్న గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. వారు ఒట్టిగెడ్డవాగులో వాగును దాటే క్రమంలో ఇద్దరు ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఆర్తి మృతదేహం దొరకగా, మహేశ్ మృతదేహం మరుసటి రోజు లభించింది. వీరిద్దరూ మృతి చెందడం పట్ల ఏపీ ప్రభుత్వం స్పందించి మృతదేహాలను అంబులెన్స్‌లో స్వస్థలమైన హర్యానకు పంపింది. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మంగళవారం మాట్లాడుతూ ఘటనలో మృతి చెందిన వీరిద్దరి కుటుంబాలకు ఉద్యోగం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కేంద్రం రూ. 10 లక్షలు, రాష్ట్రం రూ. 5 లక్షలు మృతుల కుటుంబాలకు అందజేస్తామని, ఎలాంటి సాయమడిగినా ఇవ్వాలని సీఎం ఆదేశించారని ఆమె వెల్లడించారు.

## బద్లాపూర్ ఘటనపై సిట్ ఏర్పాటు

### సీఎం ఏక్‌నాథ్ షిండే



**ముంబయి:** మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్ స్కూల్ చిన్నారులపై సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన దుమారం రేపుతోంది. ఈ ఘటనపై సీఎం ఏక్‌నాథ్ షిండే స్పందించారు. బద్లాపూర్ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, దీనిపై ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశామని చెప్పారు. ఘటన జరిగిన పాఠశాలపై కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.కేసును ఫాస్ట్‌ట్రాక్ ప్రక్రియలో దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షిస్తామని సీఎం వెల్లడించారు. దోషులను విడిచిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. కాగా, మహారాష్ట్రలోని థానే స్కూల్‌లో మూడేండ్ల వయసు కలిగిన ఇద్దరు బాలికలపై స్కూల్ క్లీనింగ్ సిబ్బంది ఒకరు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఆగస్ట్ 12-13 తేదీల్లో చిన్నారులు స్కూల్ వాష్‌రూంకు వెళ్లిన క్రమంలో ఈ ఘటన జరగ్గా పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. థానే జిల్లా బద్లాపూర్‌లో ఈ ఉదంతం వెలుగుచూసింది. నిందితుడు అక్షయ్ షిండేను కోర్టు మూడు రోజుల పోలీస్ రిమాండ్‌కు తరలించింది. బాలికల తల్లితండ్రుల ఫిర్యాదుతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.పోక్సో కేసులో సైతం స్థానిక సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శుభద శిటోలె ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం చేశారని బాధిత తల్లితండ్రులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన ప్రిన్సిపల్, క్లాస్ టీచర్, సంబంధిత సిబ్బందిని అధికారులు సస్పెండ్ చేశారు.

## నెల్లూరు ప్రాజెక్టులకు పాత పేర్లనే పునరుద్ధరించాలి

### మాజీ మంత్రి కాకాణి

**అమరావతి :** నెల్లూరు జిల్లాలో ఉన్న సంగం బ్యారేజ్ , నెల్లూరు బ్యారేజ్ లకు ఇదివరకు ఉన్న పేర్లను పునరుద్దరించాలని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగం బ్యారేజ్‌కు మంత్రిగా ఉంటూ మరణించిన గౌతమ్ రెడ్డి పేరును, నెల్లూరు బ్యారేజ్‌కు మాజీ మంత్రి నల్లపురె-డ్డి శ్రీనివాసులు రెడ్డి పేరును ఎందుకు తొలగించారని నిలదీశారు .పాత పేర్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అధికారంలో-కి వచ్చిన తరువాత చంద్రబాబు వైసీపీ హయాంలో కొనసాగిన పథకాల పేర్లను తొలగిస్తున్నారే తప్పా కొత్తవి ఏమీ చేపట్టడం లేదని ఆరోపించారు. 14 సంవత్సలరాల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి ఏనాడు ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేనది అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ ప్రాజెక్టులను ప్రా-రంభించడంతో పాటు వాటి విస్తరణ పనులు చేపట్టి రైతాంగానికి నీరందించారని తెలిపారు.సంగం, నెల్లూరు బ్యారేజ్‌లను వైసీపీ పూర్తి చేసిందన్నారు. ప్రచార ఆర్భాటాలే తప్ప చంద్రబాబు పనులు చేపట్టలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు.

### తిరుమలలో ఆగస్టు 27, 28 తేదీల్లో

## ఆర్జిత సేవలు రద్దు



**విశ్వంభర, తిరుమల:** ఈనెల 27న శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానాన్ని నిర్వహించనున్నామని టీటీడీ అధికారులు తెలిపారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖ మండపంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు బంగారు సర్వభూపాల వాహనంపై కృష్ణస్వామివారిని వేంచేపు చేసి నివేదనలు సమర్పిస్తామన్నారు. ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, కృష్ణస్వామివారికి ఏకాంత తిరుమంజనం నిర్వహించి , ద్వాదశారాధనం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. ఆగస్టు 28న ఉట్లోత్సవం సందర్భంగా సాయంత్రం 4 గంటలకు మలయప్పస్వామివారిని బంగారు తిరుచ్చిపై, కృష్ణస్వామివారిని మరో తిరుచ్చిపై తిరుమాడ వీధులలో ఊరేగింపు ఉంటుందని వివరించారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 28న శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జితసేవలైన బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## బెంగాల్ సర్కార్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

**ఢిల్లీ:** శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్నవారిపై అధికారాన్ని వాడరాదు అని బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు హెచ్చరిక జారీ చేసింది. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య కేసులో.. మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో ధర్మాసనం.. బెంగాల్ సర్కార్‌పై తీవ్ర ఆక్షేపణలు వ్యక్తం చేసింది. నిరసనకారులపై దాడి చేయడం సరికాదు అని కోర్టు పేర్కొన్నది. మేం జోక్యం చేసుకోబోయే అంశాల గురించి వెల్లడిస్తున్నామని, శాంతియుతంగా నిరసన చేపడుతున్నవారిపై బెంగాల్ సర్కార్ పవర్‌ను వాడరాదు అని, డాక్టర్లు అయినా లేక సాధారణ పౌరులైనా, వారిపై అధికారాన్ని వాడరాదు అని సీజేఐ డీవై చంద్రచూడ్ తెలిపారు. ట్రైనీ డాక్టర్ శరీరాన్ని ఆమె పేరెంట్స్‌కు అప్పగించడంలో ఎందుకు జాప్యం చేశారని బెంగాల్ సర్కార్‌ను కోర్టు ప్రశ్నించింది. ఈ కేసును విచారించడంలోనూ బెంగాల్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు కోర్టు చెప్పింది. ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య కేసును బెంగాల్ ప్రభుత్వం సరైన రీతిలో నియంత్రించలేకపోయిందని, ఆస్పత్రిలో జరిగిన విధ్వంసాన్ని ఎందుకు అడ్డుకోలేకపోయిందని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీని పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సీజేఐ చంద్రచూడ్ వెల్లడించారు. చంద్రచూడ్‌తో పాటు జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది.

## గత ప్రభుత్వం నిర్ణయించిన స్థలాలు నివాసయోగ్యం కాదు

### మంత్రి కొలుసు పార్థసారథి

**విశ్వంభర, మైలవరం:** మైలవరం ఇళ్ల స్థలాల విషయంలో ఇబ్బందులు ఉన్నాయని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గత ప్రభుత్వం నిర్ణయించిన స్థలాలు నివాసయోగ్యంగా లేవని తెలిపారు. కొన్ని చోట్ల వరదలు వచ్చే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. గృహ నిర్మాణ శాఖపై మంగళవారం నాడు మంత్రి పార్థసారథి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ రాజకీయ కక్ష కారణంగా జనం ఇబ్బంది పడ్డారని తెలిపారు.గృహ నిర్మాణంలో మట్టి కోసం కొత్త విధానాన్ని ఆలోచించామని కొలుసు పార్థసారథి తెలిపారు. గృహ నిర్మాణంలో మట్టికి బదులు ఫ్లైయాష్ వినియోగించారని చెప్పారు. 2014-19 గృహ నిర్మాణాలపై కొన్ని ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నిర్ణయం మేరకు 2014-19 నాటి గృహాలకు కూడా డబ్బు చెల్లిస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో క్వాలిటీ చెక్ కూడా పూర్తిగా చేస్తున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులను నష్టపరిచిన వారిపై కచ్చితంగా చర్యలు ఉంటాయని అన్నారు. లబ్ధిదారులు రుణం పొంది కూడా నిర్మాణం చేయకపోతే.. భవిష్యత్తులో ఇబ్బంది పడతారని తెలిపారు. స్థానిక అధికారులు, ఎమ్మెల్యేలు లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. కేంద్రం ఇళ్ల నిర్మాణానికి 1.5 లక్షలు మాత్రమే ఇస్తుందని తమకు తెలిసిందని.. గృహ నిర్మాణం అత్యంత ముఖ్యమైన అంశమని సీఎం చంద్రబాబు తెలిపారు. వందరోజుల్లో 1.20 లక్షల ఇళ్లు, రాబోయే రోజుల్లో 7 లక్షల ఇళ్లను నిర్మించడమే తమ టార్గెట్ అని పేర్కొన్నారు.

# మోదీ ఏకపక్షంగా వ్యవహరించే రోజులకు కాలం చెల్లింది

### లేటరల్ రిక్రూట్‌మెంట్‌పై జైరాం రమేష్ ఫైర్



**ఢిల్లీ:** యూపీఎస్సీ లేటరల్ రిక్రూట్‌మెంట్‌పై మోదీ సర్కార్ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జైరాం రమేష్ విమర్శలు గుప్పించారు. గత పదేండ్లుగా ప్రధాని మోదీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఇప్పుడు ఆయన వాస్తవాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందని, ఇష్టారీతిన వ్యవహరించే రోజులకు కాలం చెల్లిందని అన్నారు. 45 ఉన్నతోద్యోగ ఖాళీలను యూపీఎస్సీ ప్రకటించిందని, ఇవి సలహాదారుల పోస్టులు కాదని జైరాం రమేష్ పేర్కొన్నారు. సంయుక్త కార్యదర్శులు, డైరెక్టర్లు, సెక్రటేరియట్ హోదా కలిగిన పోస్టుల రిక్రూట్‌మెంట్ చేపట్టారని, వీటి భర్తీలో రాజ్యాంగ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని అన్నారు. లేటరల్ ఎంట్రీ రిజర్వేషన్లకు ముగింపు పలికే ప్రక్రియకు తెరతీయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పౌర అధికారుల వ్యవస్థలో అగ్నివీర్‌ను ప్రవేశపెట్టడం వంటిదని వ్యాఖ్యానించారు.సాయుధ దళాల్లో అగ్నివీర్‌ను ప్రవేశపెట్టడం ద్వారా దేశ భద్రతతో కాషాయ పాలకులు చెలగాటమాడారని, ఇప్పుడు పౌర అధికార వ్యవస్థతో చెలగాటమాడేందుకు ప్రయత్నిస్తున్నారని జైరాం రమేష్ దుయ్యబట్టారు. అందుకే ఇది రాజ్యాంగంపై దాడి అని రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే సహా ఇతర రాజకీయ నేతలు ఆందోళన వ్యక్తం చేశారని ఆయన గుర్తుచేశారు. ఇది ఐఏఎస్, ఇతర పౌర అధికార వ్యవస్థను ప్రైవేటీకరణ చేయడమేనని, లేటరల్ ఎంట్రీ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని తాము కోరుతున్నామని అన్నారు. లేటరల్ ఎంట్రీ పథకంపై దేశవ్యాప్తంగా ఆగ్రహం ఎదురవుతున్నదని ఈ జనాగ్రహాన్ని మోదీ ఎదుర్కోవాలని ఆయన పేర్కొన్నారు.





# యూవీ రికార్డు బద్దలు కొట్టిన విస్సేర్

## ఒకే ఓవర్‌లో 39 రన్స్

**విశ్వంభర, క్రీడావిభాగం :** ఐసీసీ టీ20 ప్రపంచకప్ తూర్పు ఆసియా-పసిఫిక్ క్వాలిఫయర్ మ్యాచ్‌లో సమోవా ఆటగాడు డారియస్ విస్సర్ ఒకే ఓవర్‌లో 39 పరుగులు చేసి సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. అలాగే యువరాజ్ సింగ్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడం విశేషం. అపియాస్ గార్డెన్ ఓవల్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో సమోవా, వనాటు జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో సమోవా జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఇన్నింగ్స్ ప్రారంభించిన సమోవాకు శుభారంభం లభించలేదు. కేవలం 10 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో డారియస్ విస్సర్ రంగంలోకి దిగి మ్యాచ్ మొత్తం మ్యాచ్‌ని మార్చేశాడు. ఆరంభం నుంచే తుఫాన్ బ్యాటింగ్ కనబర్చిన డారియస్ వనాటు బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ముఖ్యంగా నలిన్ నిపికో 15వ ఓవర్లో 39 పరుగులు చేసి కొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఓవర్ తొలి మూడు బంతుల్లో డారియస్ విస్సర్ మూడు సిక్స్‌లు బాదాడు. 4వ బంతికి నో బాల్, భారీ సిక్స్ బాదాడు. మళ్లీ బంతిపై మరో సిక్స్. 5వ బంతికి పరుగు లేదు. 6వ బంతికి నో బాల్, మరో సిక్స్ వచ్చింది. నో బాల్‌ని మళ్లీ డెలివరీ చేశాడు. చివరి బంతికి భారీ సిక్సర్. దీని ద్వారా డారియస్ విస్సర్ మొత్తం 39 పరుగులు సాధించాడు. సమోవా ఇన్నింగ్స్‌లో 15వ ఓవర్‌ను వనాటు బౌలర్ నిలిన్ నిపికో వేశాడు. ఈ ఓవర్‌లో సమోవా బ్యాటర్ విస్సెర్..6 బంతులను 6 సిక్స్ కొట్టాడు. అయితే బౌలర్ 3 నోబాల్స్ వేయడంతో మొత్తం 39 పరుగులు వచ్చాయి. అంతకుముందు 2012 జూలై 24న ససెక్స్, గ్లౌసెస్టర్ షైర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక్క ఓవర్‌లో 38 పరుగులు వచ్చాయి. కానీ ఆ మ్యాచ్ దేశీయ మ్యాచ్. కాగా, అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒక్క ఓవర్‌లో అత్యధికంగా నమోదైన పరుగులు 36 మాత్రమే. 2007 టీ 20 వరల్డ్ కప్‌లో యువరాజ్ సింగ్ 6 బంతులకు 6 సిక్స్‌లు బాదాడు. ఆ తర్వాత కీరన్ పొలార్డ్(2021), నికోలస్ పూరన్(2024), దీపేంద్ర సింగ్(2024)లు 36 పరుగులు చేశారు. ఇందులో యువరాజ్, పొలార్డ్ మాత్రమే వరుసగా ఆరు సిక్స్‌లు కొట్టారు.

# చెత్త రికార్డ్‌లో టాప్ ప్లేస్

- 2 ఓవర్లలో 60 పరుగులు ఇచ్చిన పాస్ట్ బౌలర్

**విశ్వంభర, క్రీడావిభాగం:** ఒకే ఓవర్లో 36 పరుగులు కాదు.. 39 పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ గురించి మీరు వినే ఉంటారు. అయితే, ఇక్కడ ఓ బౌలర్ రెండు ఓవర్లలో 60 పరుగులు ఇచ్చి వార్తల్లో నిలిచాడు. అతను అంతర్జాతీయ క్రికెటర్ కావడం కూడా విశేషం. వెస్టిండీస్‌లోని కేమన్ ఐలాండ్‌లో జరిగిన మ్యాక్స్ 60 టీ10 లీగ్‌లో నెదర్లాండ్స్ బౌలర్‌లోగాన్ వాన్ బీక్ 60 పరుగులు చేశాడు. అది కూడా 12 బంతుల్లోనే కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జోష్ బ్రౌన్ కరిబియన్ టైగర్స్ జట్టులో 23 బంతుల్లో 5 సిక్సర్లతో 56 పరుగులు చేశాడు. నిక్ హాబ్సన్ 12 బంతుల్లో 4 భారీ సిక్సర్లు, 3 ఫోర్లతో 40 పరుగులు చేశాడు. ఈ ఇద్దరి చేతిలో బలైన లోగాన్ వాన్ బీక్ తొలి ఓవర్‌లోనే 24 పరుగులు ఇచ్చాడు. ఆ తర్వాత, లోగాన్ వాన్ బీక్ మళ్లీ బౌలింగ్‌కు దిగడంతో 3 సిక్స్‌లు, 3 ఫోర్లు, 2 నో బాల్‌లు, ఒక వైడ్, 4 పరుగులతో మొత్తం 36 పరుగులు ఇచ్చాడు. దీంతో అతను కేవలం 2 ఓవర్లలో 60 పరుగులు ఇచ్చాడు. ఫలితంగా కరిబీయన్ టైగర్స్ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఛేదించిన గ్రాండ్ కేమన్ జాగ్వార్స్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 88 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో కరిబీయన్ టైగర్స్ జట్టు 65 పరుగుల తేడాతో విజయం సాధించింది.

ఇంతకుముందు న్యూజిలాండ్‌లో జరిగిన సూపర్ స్మాష్ టీ20 లీగ్‌లో లోగాన్ వాన్ బీక్ 5 బంతుల్లో 33 పరుగులు చేసి వార్తల్లో నిలిచాడు. ఈ మ్యాచ్ చివరి 4 ఓవర్లలో 33 పరుగులు చేయాల్సి ఉంది. ఈ సమయంలో దాడికి దిగిన వాన్ బీక్ 33 పరుగులు ఇచ్చి వెల్లింగ్టన్ జట్టు ఓటమికి కారణమయ్యాడు. ఇప్పుడు 60 పరుగులతో వాన్ బీక్ పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. లోగాన్ వాన్ బీక్ నెదర్లాండ్స్ జట్టులో శాశ్వత సభ్యుడు. ఇప్పటికే 33 వన్డేలు ఆడి 46 వికెట్లు పడగొట్టాడు. 30 టీ20 మ్యాచ్‌లు ఆడి 36 వికెట్లు కూడా తీశాడు. నెదర్లాండ్స్ తరపున ODI ప్రపంచకప్, T20 ప్రపంచకప్ ఆడిన ఆటగాళ్లలో లోగాన్ వాన్ బీక్ కూడా ఒకడు. కేవలం 12 బంతుల్లోనే 60 పరుగులు చేసి వార్తల్లో నిలిచాడు.



# రాజకీయాల్లోకి వినేశ్ ఫొగాట్

### హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో సోదరితో పోటీ?

**విశ్వంభర, క్రీడావిభాగం:** వినేశ్ ఫొగాట్. గత కొన్నిరోజులుగా దేశవ్యాప్తంగా మారుమోగుతున్న పేరు. పారిస్ ఒలింపిక్స్ 2024 లో మహిళల రెజ్లింగ్ విభాగంలో 100 గ్రాములు అధికంగా బరువు ఉన్న కారణంగా పతకానికి దూరమైన వినేశ్ ఫొగాట్ పట్ల దేశం మొత్తం తీవ్ర దిగ్భ్రాంతి చెందింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలుకుని.. నెటిజన్ల వరకు అంతా వినేశ్ ఫొగాట్‌కు అండగా నిలిచారు. ఈ క్రమంలోనే 100 గ్రాములు ఎక్కువ బరువు ఉండడంతో చేతివరకు వచ్చిన పతకం చేజారిపోయింది. దీంతో సంచలన నిర్ణయం తీసుకున్న వినేశ్ ఫొగాట్.. రెజ్లింగ్ నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్లు ప్రకటించి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశారు. అయితే ఆమె రాజకీయాల్లోకి వచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వినేశ్ ఫొగాట్ సన్నిహిత వర్గాలు తాజాగా చెబుతున్న వివరాల ప్రకారం.. ఆమె ఈ హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లోనే రాజకీయాల్లోకి అరంగేట్రం చేయనున్నారని సమాచారం.

**'రాజకీయాల్లోకి ఎందుకు రాకూడదు?'**

అయితే రాజకీయాల్లోకి రాబోనని గతంలో వినేశ్ తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలని సర్దిచెప్పే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. "ఆమె(వినేశ్) రాజకీయాల్లోకి ఎందుకు రాకూడదు? హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్ వర్సెస్ బబితా ఫొగాట్ పోటీ ఉండొచ్చు. రాజకీయాల్లోకి రాబోనని గతంలో ఆమె ప్రకటించింది. అయితే ఇప్పటికే కొన్ని రాజకీయ పార్టీలు ఆమెను సంప్రదించి సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏ పార్టీలో చేరనున్నారనేది మాత్రం ప్రస్తుతానికి స్పష్టత లేదు" అని ఫొగాట్ కుటుంబానికి అత్యంత సన్నిహిత వర్గాలు మీడియాకు వెల్లడించాయి.

**కాంగ్రెస్‌లోకి వినేశ్!**

పారిస్ ఒలింపిక్స్ నుంచి ఇటీవల వినేశ్ ఫొగాట్ స్వదేశానికి చేరుకున్న సమయంలో ఎయిర్‌పోర్టు వద్ద కాంగ్రెస్ ఎంపీ దీపిందర్ హుడా ఆమెను సాదరంగా స్వాగతం పలికారు. ఊరేగింపులో కూ డా పాల్గొన్నారు. గతంలోనూ దీపిందర్ హుడా వినేశ్‌ను రాజ్యసభకు పంపాలని అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే ఆమె కాంగ్రెస్‌లో చేరొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కానీ వినేశ్ సన్నిహిత వర్గాలు మాత్రం ఏ పార్టీలో ఆమె చేరనుందన్న విషయంపై నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నాయి.

**అందరి దృష్టి అటు వైపే!**

గత హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ముందు వినేశ్ సోదరి బబితా ఫొగాట్ 2019లో బీజేపీ చేరారు. దాద్రి స్థానం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో మరోసారి ఆమెకు కమలం పార్టీ టికెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా కథనాలు నిజమైతే ఈసారి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఫొగాట్ సిస్టర్స్ మధ్య పోరు దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించే అవకాశం ఉంది. అంతేగాక మరో రెజ్లర్ బజరంగ్ పునియా కూడా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. హరియాణాలో అక్టోబరు 1వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

# జహీర్‌కు మెంటార్‌గా బాధ్యతలు



**విశ్వంభర, క్రీడావిభాగం :** మరికొన్ని నెలల్లో ఐపీఎల్ మెగా వేలం జరగనున్న సంగతి తెలిసిందే. దీంతో ఫ్రాంఛైజీల్లో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అయితే సాధారణంగా మెగా వేలానికి ముందు రిటైన్డ్ ఆటగాళ్ల గురించే ఎక్కువగా చర్చ జరుగుతుంటుంది. ఏ ప్లేయర్స్‌ను అట్టిపెట్టుకుంటారనే విషయంపై అభిమానుల్లో ఉత్కంఠ బాగా ఉంటుంది. కానీ ఈ సారి దీంతో పాటే కోచింగ్ స్టాఫ్‌పై కూడా సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎందుకంటే మెగా ఆక్షన్‌కు ముందే ఆయా ఫ్రాంఛైజీలు సపోర్టింగ్ స్టాఫ్ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. జట్టును బలోపేతం చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాయి. ఆక్షన్‌కు ముందే అనుభవజ్ఞులను తమ ఫ్రాంఛైజీలలోకి తీసుకోవాలని ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. భారత దిగ్గజ ఫాస్ట్ బౌలర్ జహీర్ ఖాన్‌ను తీసుకోవాలని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ భావిస్తున్నట్లు సమాచారం. జహీర్‌కు మెంటార్‌గా బాధ్యతలు అప్పగించాలని చూస్తోందట. వాస్తవానికి టీమ్ ఇండియా బౌలింగ్ కోచ్‌గా జహీర్ ఖాన్‌ను తీసుకుంటారని ఈ మధ్య జోరుగా ప్రచారం సాగింది. జహీర్ ఎంపిక కోసం బీసీసీఐ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కథనాలు వచ్చాయి. కానీ అనూహ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ జహీర్‌ను కాదని మోర్నీ మోర్కెల్‌ను బౌలింగ్ కోచ్‌గా తీసుకున్నాడు. అంతకుముందు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కోసం గంభీర్ - మోర్కెల్ కలిసి పని చేశారు. అయితే ఇప్పుడు గంభీర్ రిజెక్ట్ చేసిన జహీర్‌నే లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తీసుకోబోతుందట. మెంటార్‌తో పాటు బౌలింగ్ కోచ్ బాధ్యతలను అప్పగించాలని ప్రణాళిక చేస్తోంది! ఇప్పటికే జట్టులో మయాంక్ యాదవ్ వంటి యంగ్ పేసర్లు ఉన్నారు. కాబట్టి జహీర్ వస్తే యంగ్ బౌలర్లు మరింత రాటు దేలుతారని లఖ్‌నవూ ఫ్రాంఛైజీ భావిస్తోందని సమాచారం. ఇకపోతే ప్రస్తుతం లఖ్‌నవూ ప్రధాన కోచ్‌గా జస్టిన్ లాంగర్, అసిస్టెంట్ కోచ్‌లుగా లాన్స్ క్లూసెనర్, ఆడమ్ వోగ్స్, జాంటీ రోడ్స్ వ్యవహరిస్తున్నారు. ఇక జహీర్ ఖాన్ టీమ్ ఇండియా తరఫున 92 టెస్టులు, 200 వన్డేలు, 17 టీ20లకు ప్రాతినిథ్యం వహించాడు. 2011 వన్డే ప్రపంచ కప్‌ను భారత జట్టు సాధించడంలో కీలకంగా వ్యవహరించాడు.

# కరుణ్ నాయర్ బ్యాటింగ్ విధ్వంసం

**విశ్వంభర, క్రీడావిభాగం:** బెంగళూరు వేదికగా జరుగుతున్న మహరాజ్ టీ20 ట్రోఫీ 2024లో రాజస్థాన్ రాయల్స్ మాజీ బ్యాటర్ కరుణ్ నాయర్ చెలరేగిపోయాడు. చాలా కాలం తర్వాత సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. మైసూరు వారియర్స్, మంగళూరు డ్రాగన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అజేయ సెంచరీతో వీర విహారం చేశాడు. మైసూరు వారియర్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న నాయర్ పవర్ ప్యాక్ బ్యాటింగ్‌తో జట్టును గెలిపించాడు. టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్ చేసిన మైసూరు వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసింది. నాయర్ 48 బంతుల్లోనే 9 సిక్స్‌లు, 13 ఫోర్లతో అజేయంగా 124 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఓపెనర్ అజిత్ కార్తీక్(11) అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన నాయర్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. 26 బంతుల్లో సిక్సర్ తో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన తర్వాత కూడా జోరు కొనసాగించాడు. చివరి ఓవర్లో మూడు సిక్సర్లు కొట్టి 43 బంతుల్లో సెంచరీ సాధించాడు. మనోజ్ భాండాగే 31, ఎస్ యూ కార్తీక్ 23, సమిత్ ద్రవిడ్ 16, సమిత్ కుమార్ 15 పరుగులు చేశారు. మంగళూరు డ్రాగన్స్ బౌలర్లో అభిలాష్ శెట్టి 2 వికెట్లు తీశాడు. నిశ్చిత్ రావు, ఎంబీ దర్శన్ చెరో వికెట్ దక్కించుకున్నారు. వర్షం కారణంగా మ్యాచ్ కుదించడంతో మంగళూరు డ్రాగన్స్ టీమ్‌కు 14 ఓవర్లలో 166 పరుగుల టార్గెట్ విధించారు. కృష్ణమూర్తి సిద్ధార్థ్ హాఫ్ సెంచరీతో పోరాటం చేసినా మంగళూరుకు ఓటమి తప్పలేదు. నిర్ణీత 14 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి 27 పరుగుల తేడాతో ఓటమిపాయింది. సిద్ధార్థ్ 27 బంతుల్లో 9 ఫోర్లు, సిక్సర్‌తో 50 పరుగులు చేశాడు. నికిన్ జోస్ 32, రోహన్ పాటిల్ 12, ఎంబీ దర్శన్ 12 పరుగులు చేశారు. మైసూరు వారియర్స్ బౌలర్లలో అజిత్ కార్తీక్, జగదీశ సుచిత్ రెండేసి వికెట్లు పడగొట్టారు. విద్యాధర్ పాటిల్, దీపక్ దేవడిగ చెరో వికెట్ తీశారు. కాగా, ఐపీఎల్ 2025 వేలానికి కొద్ది నెలల ముందు కరుణ్ నాయర్ సత్తా చాటడంతో ఆశలు రేకెత్తుతున్నాయి. అతడు చివరిసారిగా 2022లో ఐపీఎల్ ఆడాడు. రూ. 50 లక్షల బేస్ ధర ఉన్నప్పటికీ అతడిని కొనేందుకు ఏ ఫ్రాంఛైజీ కూడా ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో అజేయ సెంచరీతో మరోసారి వెలుగులోకి రావడంతో ఈసారైనా ఐపీఎల్ వేలంలో నాయర్‌ను కొనేందుకు ఫ్రాంచైజీలు ముందుకొస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, కర్ణాటక క్రికెట్ బోర్డు నిర్వహిస్తున్న మహరాజ్ టీ20 ట్రోఫీలో 1000 పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా కరుణ్ నాయర్ గుర్తింపు సాధించాడు.

# వెండితెరపై యూవీ బయోపిక్



**విశ్వంభర, క్రీడావిభాగం :** టీమిండియా మాజీ ఆల్‌రౌండర్, సిక్సర్ల వీరుడు యువరాజ్ సింగ్ బయోపిక్ తెరకెక్కనుంది. మైదానంలో దేశం కోసం ప్రత్యర్థితో తలపడిన తీరుతో పాటు, క్యాన్సర్‌తో చేసిన యువీ పోరాటాన్ని వెండితెరపైకి తీసుకురానున్నారు. దీని గురించి మంగళవారం అధికారిక ప్రకటన విడుదల అయ్యింది. బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ టీ సిరీస్ యువరాజ్ సింగ్ బయోపిక్‌ను రూపొందించనుంది. ఈ విషయాన్ని నిర్మాతలు భూషణ్ కుమార్, రవిభాగ్ చందక్ వెల్లడించారు. యువీ బయోపిక్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు అతిత్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. 2007 టీ20 వరల్డ్ కప్, 2011 వన్డే వరల్డ్ కప్‌ను భారత్ విజయం సాధించడంలో యువరాజ్ సింగ్‌ది కీలకపాత్ర. ఆల్‌రౌండ్‌షోతో సత్తాచాటి టీమిండియాను యువీ విశ్వవిజేతగా నిలిపాడు. 2011 వన్డే వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ టోర్నీ అవార్డు అందుకున్నాడు. అయితే ఆ మెగాటోర్నీ సమయంలో యువీ క్యాన్సర్‌తోనూ పోరాడాడు. తనకి క్యాన్సర్ ఉందని తెలిసినా ఆటకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. వరల్డ్‌కప్ అనంతరం చికిత్స చేయించుకుని, కోలుకుని తిరిగి రీఎంట్రీ ఇచ్చాడు. క్యాన్సర్‌ను జయించిన తీరును వివరిస్తూ 'ది టెస్ట్ ఆఫ్ మై లైఫ్' అనే పుస్తకాన్ని యువీ రాశాడు. అయితే రీఎంట్రీలో యువరాజ్ సింగ్ ఆకట్టుకోలేకపోయాడు. 2017లో చివరిగా భారత్ తరఫున ఆడిన యువరాజ్ 2019లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. కాగా, యువీ బయోపిక్‌లో హీరోగా ఎవరు నటిస్తారనే ఉత్కంఠ మొదలైంది. ఎంఎస్ ధోనీ బయోపిక్‌లో యువీ పాత్రను హెర్రీ తంగిరీ పోషించాడు. ధోనీ సినిమాలో యువీ పాత్ర కొన్ని క్షణాలు కనిపించినా, హెర్రీ యవరాజ్‌లా ఆకట్టుకున్నాడు. దీంతో అతనికే హీరోగా అవకాశం ఇస్తారా అనే చర్చలు మొదలయ్యాయి. అయితే దేశవ్యాప్తంగా ఆదరణ ఉన్న యువీ పాత్రను అగ్రహీరోలతో చేయించాలని డిమాండ్ నెట్టింట మొదలైంది. కాగా, యువీ బయోపిక్‌లో హీరో ఎవరనే విషయంపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు ఎదురుచూడాల్సిందే..

# రూ.999కే అన్‌లిమిటెడ్ డేటాతో జియో కొత్త ప్లాన్

**విశ్వంభర, బిజినెస్ :** ప్రముఖ ప్రైవేట్ టెలికం కంపెనీ రిలయన్స్ జియో యూజర్లకు మరో ప్లాన్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ కాలింగ్, అన్‌లిమిటెడ్ హై స్పీడ్ డేటాతో పాటు ఓటీటీ సేవలను సైతం అందిస్తున్నది. ఇక ప్లాన్ వివరాలకు వస్తే.. రిలయన్స్ జియో రూ.999 కొత్త ప్లాన్‌లో యూజర్లకు పరిచయం చేసింది. ఇది ఓ ఫైబర్ ప్లాన్. ఇందులో చాలా ప్రయోజనాలు అందనున్నాయి. వార్షిక ప్లాన్ తీసుకుంటే 30 రోజులు అదనంగా వ్యాలిడిటీ లభిస్తుంది. ఈ రూ.999 ఫైబర్ ప్లాన్ 30 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. 30 రోజులు అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్ ఉంటుంది. ఇంకా రోజుకు 100 ఎస్ఎంఎస్‌లను సైతం పంపుకునే వీలుంటుంది. 150 ఎంబీపీఎస్ హైస్పీడ్ అన్‌లిమిటెడ్ డేటా పొందే అవకాశం లభిస్తుంది. అన్నింటికీ మించి ఈ ప్లాన్‌తో కలిగే బెస్ట్ బెనిఫిట్ ఓటీటీ. ఇందులో 15పైగా ఓటీటీ సేవలు ఫ్రీ వీక్షించొచ్చు. అమెజాన్ ప్రైమ్ వీడియో, జీ5, డిస్నీ ప్లస్ హాట్‌స్టార్, సోనీ లివ్, జియో సినిమా, ఆల్ట్ బాలాజీ, ఈరోస్ నౌ, షెమారూ మి, డోకుబే, ఎపికాన్, సన్ ఎన్ఎక్స్‌టీ, హోయ్ చోయ్, లయన్స్ గేట్ ప్లే, ఈటీవీ విన్ ఓటీటీలతో పాటు 550కుపైగా టీవీ ఛానెల్స్‌లో ఉచితంగా కంటెంట్‌ను వీక్షించొచ్చు. ఇదే ప్లాన్ ప్రయోజనాలను వార్షికంగా సైతం పొందొచ్చు. జియో ఫైబర్ 999 ప్లాన్ ఏడాదికి తీసుకుంటే రూ.11,998 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, జీఎస్టీ సైతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది ప్లాన్ ఇవే ప్రయోజనాలతో పాటు అదనంగా 30 రోజులు వ్యాలిడిటీ లభిస్తుంది. అంటే 365 రోజులు కాకుండా మరో 30 రోజుల పాటు ఈ ప్లాన్ పని చేస్తుంది.

# సరికొత్త హ్యుందాయ్ అల్కాజార్

**విశ్వంభర, బిజినెస్ :** హ్యుందాయ్ ఇండియా సెప్టెంబరు 9న దేశంలో ఫేస్‌లిఫ్టెడ్ అల్కాజర్ ధరలను ప్రకటించేందుకు సిద్ధంగా ఉంది . నవీకరించబడిన మూడు-వరుసల SUV మహీంద్రా XUV700 , Kia Carens , Tata Safari మరియు MG హెక్టర్ ప్లస్‌లకు పోటీగా ఉంది . డిజైన్ ఫ్రంట్‌లో, 2024 అల్కాజార్ తాజా గ్రిల్‌తో కొత్త ఫాసియాను పొందుతుంది, కొత్త క్రెటా మాదిరిగానే స్ప్లిట్ LED హెడ్‌ల్యాంప్‌లు మరియు ట్వీక్ చేయబడిన ఫ్రంట్ బంపర్. కొత్త అల్లాయ్ వీల్స్ సెట్ కాకుండా సైడ్ ప్రొఫైల్ చాలా వరకు ఒకేలా ఉంటుందని భావిస్తున్నారు. వెనుక వైపు, ఇది పునఃరూపకల్పన చేయబడిన LED టెయిల్‌లైట్‌లను మరియు రీవర్క్ చేయబడిన టెయిల్‌గేట్‌ను పొందవచ్చు. ఆఫర్ కోసం ముందు మరియు వెనుక వైపున LED లైట్ బార్‌లు మరియు కొత్త రంగు ఎంపికలు ఉంటాయి. కొత్త హ్యుందాయ్ అల్కాజార్ ఫేస్‌లిఫ్ట్ యొక్క ఫీచర్ సెట్ కూడా అప్‌గ్రేడ్ చేయబడుతుంది మరియు లెవల్ 2 ADAS సూట్, ట్విన్ 10.25-అంగుళాల స్క్రీన్‌లు, పనోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జర్, ఎలక్ట్రికల్‌గా సర్దుబాటు చేయగల డ్రైవర్ సీటు మరియు మరిన్నింటిని కలిగి ఉండవచ్చని భావిస్తున్నారు. హ్యుందాయ్ తన ఫేస్‌లిఫ్టెడ్ అవతార్‌లో అల్కాజార్ యొక్క మెకానికల్‌లను మార్చే అవకాశం లేదు. ఆరు-స్పీడ్ మాన్యువల్ మరియు టార్క్ కన్వర్టర్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌లతో కూడిన 1.5-లీటర్ టర్బో-పెట్రోల్ మరియు డీజిల్ ఇంజిన్‌లు అవుట్‌గోయింగ్ కారు నుండి క్యారీ చేయబడతాయి.





# శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఛావా

కొంతకాలంగా బాలీవుడ్‌లో బయోపిక్‌ల ట్రెండ్ నడుస్తోన్న సంగతి తెలిసిందే! 'సామ్రాట్ పృథ్వీరాజ్', 'తానాజీ', 'పానిపట్', 'బాజీరావ్ మస్తానీ', 'పద్మావత్' సంజూ, మేరీకోమ్ ఇలా చాలా చిత్రాలు చక్కని విజయం, వసూళ్లు సాధించాయి. ఇప్పుడు మరో హిస్టారికల్ సినిమా వెండితెరపై దర్శనమివ్వబోతోంది. అదే 'ఛావా'. బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్, నేషనల్ క్రష్ రష్మిక ప్రధాన పాత్రల్లో ఈ చిత్రం తెరకెక్కుతోందీ చిత్రం. 'మిమి', 'చుప్పి' ఫేమ్ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ చిత్రానికి దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా తెరకెక్కు తోంది. సినిమాలో శంభాజీ భార్య ఏసుబాయి పాత్రలో నటించనుంది రష్మిక. తాజాగా ఈ మూవీ టీజర్‌ను విడుదల చేసిన చిత్ర బృందం అఫీషియల్‌గా రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. డిసెంబర్ 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలిపింది. ఈ ప్రచార చిత్రంలో వందలాది మంది శత్రువులతో పోరాడే యుద్ధ వీరుడు శంభాజీగా తన నట విశ్వరూపం చూపించారు విక్కీ కౌశాల్. ఈ చిత్రం కోసం ఆయన గుర్రపు స్వారీ తో పాటు పలు విద్యలు నేర్చుకున్నారు. ఇంతకుముందు ఎప్పుడు విక్కీ ఇలాంటి వీరోచిత పాత్ర చేయలేదు. ఈపాత్ర ఆయన కెరీర్‌కు ల్యాండ్ మార్క్ అవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ టీజర్ సినీ ప్రియులను బాగా ఆకట్టుకుంటోంది.



# ఓజిలో భాగస్వామ్యం కావడం అదృష్టం

హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్

ప్రముఖ కథానాయకుడు పవన్ కల్యాణ్ నటిస్తోన్న చిత్రం 'ఓజీ' ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ సుజీత్ దర్శకత్వంలో రానుంది. ఇందులో పవన్ సరసన ప్రియాంక అరుల్ మోహన్ కనిపించనున్నారు. తాజాగా 'సరిపోదా శనివారం' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రియాంక మాట్లాడుతూ 'ఓజీ' అవకాశం గురించి పంచుకున్నారు. 'ఓజీ లాంటి గొప్ప కథలో భాగం కావడం, పవన్ సర్ పక్కన నటించడం నా అదృష్టం. ఆ అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు ధన్యవాదాలు. పవన్ కల్యాణ్, నాని ఇద్దరూ క్రియేటివ్‌గా ఉంటారు. నాని సినిమాల గురించి ఎప్పుడూ కలలు కంటారు. పవన్ ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచిస్తుంటారు' అని ప్రియాంక చెప్పారు. పవన్ కల్యాణ్ ప్రజల్లోకి వెళ్లడం కోసమే సినిమాల్లోకి వచ్చారేమో అనిపిస్తుంటుందని హీరో నాని అన్నారు. ఇక తాజాగా 'ఓజీ' గురించి హరీశ్ శంకర్ కూడా మాట్లాడారు. 'ఓజీ' టీజర్ చూసి ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. దానికి తమన్ అందించిన సంగీతం మరో స్థాయిలో ఉందని ప్రశంసించారు. ఈ చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. వీళ్లిద్దరూ 'ఓజీ' గురించి చెప్పడంతో ఎక్స్‌లో ఈ హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్ అవుతోంది. ఈ సినిమా విషయానికొస్తే.. ముంబయి - జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతోంది. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. అర్జున్ దాస్, వెంకట్, శ్రియారెడ్డి తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీని గ్లింప్స్‌కు భారీ స్పందన వచ్చిన విషయం తెలిసిందే.



# కోలుకుని ఇంటికి చేరుకున్న గాయని సుశీల

ప్రముఖ గాయని, పద్మభూషణ్ పురస్కార గ్రహీత పి.సుశీల పూర్తి ఆరోగ్యంతో ఇంటికి చేరుకున్నారు. తాను క్షేమంగా ఉన్నానంటూ అభిమానుల కోసం తాజాగా ఒక వీడియో విడుదల చేశారు. రెండురోజుల క్రితం ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే చెన్నైలోని కావేరి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స తీసుకున్న సుశీల క్షేమంగా ఇంటికి చేరుకున్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఓ వీడియో షేర్ చేశారు. ఇప్పుడే నేను ఇంటికి చేరుకున్నారు. పూర్తి ఆరోగ్యంతో వైద్యులు నన్ను ఇంటికి పంపించారు. అభిమానుల ప్రార్థనలే నన్ను రక్షించాయి. దేవుడిని నమ్మిన వాడు ఎప్పుడూ చెడిపోడు. నన్ను ఆ భగవంతుడు రక్షించినట్లే మిమ్మల్ని అందరినీ కూడా కాపాడుతాడు. మీ అందరికీ నా కృతజ్ఞతలు. మీరందరూ ఎప్పుడూ చల్లగా ఉండాలి.' అని ఆమె కోరుకున్నారు. అలాగే కావేరి ఆస్పత్రిలో ఆమెను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారని సిబ్బందికి, వైద్య బృందానికి వారికీ కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు, తమిళంతోపాటు పదికిపైగా భాషల్లో 45 వేలకు పైగా పాటలు పాడిన సుశీల కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్నారు.

# అన్ని పరీక్షల్లోనూ నెగెటివ్ వచ్చింది

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** కర్ణాటకలోని బెంగళూరు శివారు ప్రాంతంలో మే నెలలో జరిగిన ఓ రేవ్ పార్టీకి సంబంధించి తాను అన్ని పరీక్షలూ చేయించుకున్నానని, ఇటీవల వచ్చిన రిపోర్టుల్లో అన్నింట్లోనూ తనకు నెగెటివ్ వచ్చిందని సినీ నటి హేమ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అన్ని టీవీ ఛానళ్లకు వెల్లడించానని, అవసరమైతే బహిరంగ పరీక్షలకూ తాను సిద్ధమేనంని పేర్కొన్నారు. ఒక రేవ్ పార్టీలో సినీ నటి హేమ పాల్గొని, పోలీసులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. ఆ పార్టీకి ఏపీ, బెంగళూరుకు చెందిన 100 మందికి పైగా ప్రముఖులు హాజరు కాగా, వారిలో సినీ రంగానికి చెందిన కొందరు నటులు, బుల్లితెర నటులు, మోడల్స్ ఉన్నట్లుగా అప్పట్లో పోలీసులు వెల్లడించారు. పార్టీలో పాల్గొన్న వారితో పాటు 17 గ్రాముల ఎండీఎంఏ పిల్స్, కొకైన్ లాంటి మత్తు పదార్థాలనూ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడిన వారి రక్త నమూనాలు సేకరించి వైద్య పరీక్షలకు పంపగా, మొత్తం 103 మందిలో 86 మందికి డ్రగ్ పాజిటివ్?గా నిర్ధారణ అయినట్లు కర్ణాటక పోలీసులు నిర్ధారించారు. పలువురు నటుల రక్త నమూనాల్లోనూ మాదక ద్రవ్యాల ఆనవాళ్లను గుర్తించిన పోలీసులు, వారిలో తెలుగు నటి సైతం ఉన్నట్లు స్పష్టం చేశారు. పాజిటివ్? వచ్చిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అయితే పాజిటివ్ వచ్చిన తెలుగు నటి పేరు మాత్రం వెల్లడించలేదు. అయినప్పటికీ ఆ నటి హేమ అయి ఉంటారంటూ అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో నటి హేమ తాజాగా ఓ వీడియో విడుదల చేశారు. రేవ్ పార్టీకి సంబంధించి తాను అన్ని పరీక్షలూ చేయించుకున్నానని, ఇటీవల వచ్చిన రిపోర్టుల్లో అన్నింట్లోనూ తనకు నెగెటివ్ వచ్చిందని ఆమె స్పష్టం చేశారు. ఇకనైనా తనపై అనవసర ఆరోపణలు మానుకోవాలని కోరారు. ఇదే సమయంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను కలవాలనుకుంటున్నానన్న ఆమె, అపాయింట్‌మెంట్ ఇవ్వవలసిందిగా వారికి విజ్ఞప్తి చేశారు.




# ప్రభాస్‌తో సినిమాతో స్టార్ స్టేటస్

## ఇప్పుడంతా ఇమాన్వీ ఇస్మాయిల్ కోసం సర్చ్

ప్రభాస్ పక్కన కథానాయికగా కొత్తమ్మాయి అనగానే, సోషల్‌మీడియా ఫోకస్ అంతా ప్రస్తుతం ఇమాన్వీ ఇస్మాయిల్ పైనే. అసలు ఈ అమ్మాయి ఎవరు.. ఎక్కడ్నుంచొచ్చింది? అంటూ ఆరాలు మొదలయ్యాయి. ప్రభాస్ పుణ్యమా అని రాత్రికి రాత్రి ఈ అమ్మాయి స్టేటస్ మారిపోయింది. తన ఇన్‌స్టాలో ఏకంగా లక్షమంది ఫాలోవర్లు ఒక్కరోజులో పెరిగిపోయారు. శంఖంలో పోస్తేనే కదా తీర్థం అన్నట్టు, ప్రభాస్ పక్కన హీరోయిన్ అనగానే స్టార్ అయి కూర్చుంది ఇమాన్వీ. బడా నిర్మాతలంతా ప్రభాస్ సినిమా తర్వాత తమ సినిమాల్లో ఈ అమ్మాయిని నటింపజేయడానికి అప్పడే ప్రయత్నాలు ముమ్మరం చేశారట. అయితే.. మైత్రీ మూవీమేకర్స్ వాళ్లు మాత్రం తమ సంస్థలో ముందు మూడు సినిమాలు చేసేంతవరకూ ఇతర సినిమాలు ఒప్పకో కూడదని కండీషన్ పెట్టారట ఈ ముద్దుగుమ్మకు. అంతేకాదు, దర్శకుడు అను రాఘవపూడి కూడా తన సినిమా పూర్తయ్యేంత వరకూ మరో సినిమా చేయడానికి వీల్లేదని షరతు విధించారట. ప్రభాస్‌తో ఆయన చేసే సినిమాకు కథానాయిక ఎవరైనా సరే, బల్క్ డేట్లు తనకు అవసరమట. పిలిచినప్పడల్లా సెట్‌కి రావాల్సి ఉంటుందట. అందుకే బిజీ కథానాయికలను పక్కనపెట్టి ఇమాన్వీని తీసుకున్నారట అను రాఘవపూడి. ఏదేమైనా ఈ అందాలభామ రొట్టె విరిగి నేతిలో పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com